اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 1 సంచిక 8 మార్చి 2010 రూ. 15/-



ప్రపంచపు తొలి సైంటిస్ట్ - ఇబ్న్ అల్-హైతమ్

ఖుర్'ఆన్ మరియు సైన్స్‌పై నాస్తికుని ప్రశ్నకు సమాధానం

ఇస్లామ్‌పై తప్పుడు వ్రాతలు వ్రాసిన 'క్రాంతికార్'కి సమాధానం

11 రోజుల పాటు తాలిబన్ల కస్టడీలో ఉన్న అంతర్జాతీయ రిపోర్టర్ సోదరి రిడ్లీ అభిప్రాయాలు

ప్రపంచ ప్రజలను మోసం చేస్తున్న అమెరికా

## ముహమ్మద్ ﷺ వారి జీవితచరిత్ర ప్రారంభం

అల్లాహ్ యొక్క లక్షణాలను తెలిపే పేర్లు ఖుర్'ఆన్‌లో 99 ఉన్నాయి

సకల సృష్టిరాసులపై కరుణ చూపించే  అర్-రహ్మాన్
పరలోకంలో విశ్వాసులపై కరుణ చూపించే అర్-రహీమ్

సృష్టికర్త

الله

అర్-రహీమ్

الرَّحِيم

The Especially MERCIFUL

అర్-రహ్మాన్

الرَّحْمٰن

The Entirely MERCIFUL

అల్లాహ్

చెప్పు : " ఆయనే అల్లాహ్!  ఒక్కడు.  అల్లాహ్ ఎవరి అక్కరా లేనివాడు.
ఆయనకు సంతానం లేదు మరియు  ఆయన ఎవరి సంతానమూ కాడు.
మరియు ఆయనతో పోల్చదగినది ఏదీ లేదు.       (ఖుర్'ఆన్ 112:1-4)

రబీ ఉల్ అవ్వల్ - రబీ ఉల్ ఆఖిర్ హి. 1431

# శాంతిబాట

మాసపత్రిక రూ. 15/-

సంపుటి 1 సంచిక 8 మార్చి 2010

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

Phone:9347046090 Email:velugubaata@gmail.com

**1** **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం :** ఖుర్'ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ ఫాతిహాలోని 3 ఆయత్‌లకు వివరణ ...

**6** **ప్రపంచ శాంతిదూత 'ముహమ్మద్(స)' వారి బోధనలు, ఆచరణలు :** సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం - ఈ నెల ప్రత్యేకం కష్టం-సుఖాలు. కష్టంతోపాటే నిశ్చయంగా సుఖాలు ఉంటాయి. ఒక కష్టం రెట్టింపు సుఖాన్ని జయించలేదు.

**10** **తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). సోదరి యోన్ రిడ్లీ (బ్రిటన్) యొక్క సంతోషమయ జీవనం గురించి...

**13** **ఖుర్'ఆన్ మరియు సైన్స్ :** తొలి సైంటిస్ట్ - అబూ అలీ అల్-హసన్ ఇబ్నె అల్-హైతమ్ (2వ భాగం)

**15** **జ్ఞానం - అజ్ఞానం :** జ్ఞానులమనుకొనే వారి అజ్ఞానాన్ని బయటపెట్టడం. ఖుర్'ఆన్ వాక్యాల వక్రీకరణను ఖండించి, వివరించే ప్రయత్నం - క్రాంతికార్ విషపువ్రాతలపై చర్చ

**18** **ధర్మసందేశ ప్రచారం :** ప్రస్తుతం సమాజంలో అనుసరిస్తున్న కొత్త పోకడల గురించి .... ఖుర్'ఆన్ మరియు సున్నత్ వెలుగులో సందేశాన్ని అందించే విధానాల పరిచయం ...

**23** **బాలబాలికలకు ప్రత్యేకం :** ఇస్లాం పరిచయం. పాఠ్య పుస్తకాలలో సైన్స్ డిస్కవరీల గురించి నేర్చుకున్న అసత్యాలను ఎత్తిచూపడం మరియు వాస్తవాల వివరణ

**24** **ముహమ్మద్(స) వారి జీవిత చరిత్ర :** ప్రారంభం

**28** **నాస్తికుని ఓ ప్రశ్న :** 1400 సంవత్సరాలకు పూర్వం ఉండే సైన్స్, ఖుర్'ఆన్‌లోని సైన్స్‌కి భిన్నంగా ఉందా? - శాంతిబాట జవాబు

**30** **టెర్రరిజం :** టెర్రరిజానికి ఏ మతం పేరును అతికించకుండా, 'ఇస్లామ్'నే అతికించి ముస్లిములనే టార్గెట్‌గా ఎందుకు పెట్టుకున్నారు? కనులు మూసుకున్న మీడియా యొక్క కనులు తెరిపించే ప్రయత్నం. నేరస్తున్ని శిక్షించాలి - ప్రపంచానికి పొంచిఉన్న పెనుముప్పు అమెరికా - పరిశోధనాత్మక వ్యాసం

**34** **ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్'ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని..

**35** **ముస్లిం యువత - ఆలోచించండి! :** మీరందరూ గౌరవించబడాలని ...

ఎడిటర్:

**ఎమ్‌డి. అతహరుల్లా**

**ఎడ్వయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు

ఎమ్‌డి. అఫ్ఫాన్ ఉమ్రీ

**సహాయకులు:**

**వెలుగుబాట**

ఎడ్యుకేషనల్ సొసైటీ

మరియు

**ట్రూవిజన్**

ఎడ్యుకేషనల్ సొసైటీ

సభ్యులు

**Printed by**
Md. Athaharullah

**Published by**
Md. Athaharullah

**Owned by**
Velugubaata Educational Society
(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**
'*Akash Industries*',G-14, Industrial Estate, Samalkot - 533440

and

**Published at**
2-8-31, Kota Bazar,
Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah

Phone : 9347046090,
Email: velugubaata@gmail.com
RNI Regd. No. APTEL/2009/29650

ఈ పత్రికలో ప్రచురించిన వ్యాసాల గురించిగాని, లేదా ఇతర వివరాలకుగాని సంప్రదించండి

**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.*
**Cell : 9491103017**

**సంవత్సర చందా:**

**రూ. 180/-**

*For online payments, Please contact Dr. N. Srinivasa Rao (Cell: 9491103017)*

M.O. చేయవలసిన చిరునామా:

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్,
సామర్లకోట-533440

మీ పూర్తి ఎడ్రస్‌ను, ఫోన్ నెంబర్లతో సహా **M.O.** ఫారమ్‌పై వ్రాయండి.
లేదా
క్రింది నెంబర్‌కు
మీ వివరాలను **SMS** చేయండి.
**Cell : 9491103017**

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# ద్వంద్వ వైఖరి

ఓ టి.వి. ఛానెల్‌లో నిర్వహిస్తున్న చిన్న పిల్లల డాన్స్ కార్యక్రమంపై, మిగిలిన టి.వి. చానళ్ల వారు ఏర్పాటు చేసిన చర్చా కార్యక్రమాలు పరోక్షంగా ఆ ఛానల్‌పై మరియు ఆ కార్యక్రమంపై దాదాపు యుద్ధాన్ని ప్రకటించినట్లే అనిపించింది. ఈ చర్చల్లో మహిళా సంఘాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. చిన్న పిల్లల చేత అశ్లీలమైన డాన్సులు చేయిస్తూ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. ఇది అభినందించదగిన విషయమే అయినా సరే, ఇంతకాలం వీరెందుకు నిశ్శబ్దంగా ఉన్నారని ప్రశ్నిస్తూ, వీరి నిజాయితీని శంకిస్తూ ప్రజలు తమ అభిప్రాయాలను తెలియజేయడం జరిగింది.

పేదవాళ్ళు తమ బిడ్డలతో సహా పొట్టకూటి కోసం పనిచేసి బ్రతికితే, బాలకార్మికుల వ్యతిరేక చట్టం పేదవారి పిల్లలను పనిచేయకుండా ఆపుతుంది. మరి రోజులో ఎక్కువభాగం రిహార్సల్స్ పేరుతో, షోల పేరుతో పిల్లలు నలిగిపోతుంటే, వాటిని ఆపడానికి బదులు ఆ షోలను ఎంజాయ్ చేయడం జరుగుతుంది. తమ కుటుంబానికి కొంత ఆసరాగా నిలబడి పిల్లలు శ్రమపడి, కాస్తో కూస్తో సంపాదించి తెస్తే ఆ పిల్లల తల్లిదండ్రులను తప్పుపడుతున్నారు. కాని ఎందరినో ఎంటర్‌టైన్ చేయడానికి తమ పిల్లలను అమితంగా కష్టపెట్టిస్తే మాత్రం ఆ తల్లిదండ్రులు చేసేది ఒప్పు అవుతుంది. ఇదేమిన్యాయం? ఇల్లు గడవడానికి పడే కష్టం తప్పు. ప్రజలను వినోదింపజేయడానికి పడే కష్టం ఒప్పా? అలాగని మేము బాలకార్మిక చట్టానికి వ్యతిరేకం కాదు.

మన దేశంలో కోళ్ల పందాలు నిషేధం. అలాగే జూదమూ నిషేధం. కాని క్రికెట్ ద్వారా ఇదే పని ఏ స్థాయిలో జరుగుతుందో ఈ మధ్యనే బయటపడింది.

కేవలం 6 సంవత్సరాలు లేదా 7 సంవత్సరాల బాలిక వేసుకునే పొట్టిబట్టలు అశ్లీలమైనవే అయితే, నేటి సినిమా హీరోయిన్లు ధరించే డ్రెస్‌లు అశ్లీలమైనవి కావా? సభ్య సమాజాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేస్తున్న నేటి సినిమాలలోని అశ్లీలతను మహిళా సంఘాలు ప్రశ్నిస్తున్నాయా? ఆపే ప్రయత్నాలు ఏమైనా చేస్తున్నాయా? వాటిపై కఠినంగా వ్యవహరించాలని చర్చాకార్యక్రమాలను టి.వి. ఛానెళ్ళు ఏర్పాటు చేస్తున్నాయా? కేవలం తమ సంఘాల ఉనికిని తెలియజేయడానికి అప్పుడప్పుడు ఈ సంఘాలు ఓ ఫలానా నిర్మాతపై లేదా ఓ ఫలానా దర్శకుడు సినిమాపైననే దృష్టిని కేంద్రీకరించి, మీడియాలో కాస్సేపు కనిపించి, చేతులు దులిపేసుకుంటున్నాయి.

ఇక టి.వి. ఛానెళ్ళ వారందరూ రాత్రి 11 గంటలు దాటితే, ఇటువంటి సినిమాలలోని అశ్లీల దృశ్యాలను ప్రత్యేకంగా చూపిస్తుంటారు. ఈ వ్యాధి రెగ్యులర్ ఛానెళ్ళ నుండి న్యూస్ ఛానెళ్ళ వరకూ ప్రాకింది. ఇవి చూస్తే పిల్లలు పాడవ్వరా? పిల్లలే కాదు పెద్దలు కూడా పాడవుతున్నారు. వివాహేతర సంబంధాలను ప్రస్తుత మీడియాలో కామెడీగా చూపిస్తున్నారు. ఛీదరించుకోవలసిన ఇటువంటి విషయాలతో కామెడీ చేస్తారా? ఆ సన్నివేశాలను చూసి ప్రేక్షకులు కూడా నవ్వుతున్నారు. ఇలా సమాజానికి కీడు చేసేవాటిని ఎన్నింటినో చూపిస్తున్నారు.

మరలా ఇవే టి.వి. చానెళ్ళు మరియు మహిళా సంఘాలు ముస్లిమ్ మహిళ ధరించే బురఖాపై, తమ వ్యక్తిగత అభిప్రాయాల వర్షాన్ని కురిపిస్తారు. ముస్లిమ్ మహిళ బురఖాలో మగ్గిపోతుందంటారు. చాలా సానుభూతి చూపిస్తారు. ముస్లిమ్ మహిళలు ధరించే విధంగా స్త్రీలందరూ శరీరాన్ని కప్పుకుని, తమ అందాలు తమ భర్తలకే స్వంతమని చెబితే, మిర్చిమసాలా షోలను టి.వి. ఛానెళ్లు ఆపివేయవలసి వస్తుంది. అలాంటివి లేకపోతే వారి వ్యాపారానికి నష్టమే! అంతేకాదు ఆడవారిని స్వేచ్ఛ పేరుతో వ్యాపార వస్తువుగా చేసి, జరుగుతున్న వ్యాపారాలు మూసివేయవలసి వస్తుంది.

నేడు ప్రతి కాన్వెంట్‌కీ ఓ యూనిఫామ్ ఉంది. యూనిఫామ్ లేకుండా సివిల్ డ్రెస్‌లో పిల్లలు కాన్వెంట్‌కి వెళితే, యాజమాన్యం వారు వెనక్కి పంపించి వేస్తారు. అప్పుడు ఆ పిల్లల తల్లిదండ్రులు క్రింది విధంగా వాదించగలరా?

**"మన దేశంలో తమకిష్టమైన దుస్తులు ధరించే స్వేచ్ఛ పిల్లలకు లేదా? వేసుకునే దుస్తులకు, నేర్చుకునే చదువుకి ఏమిటి సంబంధం?"**

ఈ విషయంలో మానవ హక్కుల కమీషన్‌గాని, మీడియాగాని, స్వచ్ఛంద సంస్థలుగాని ఏమీ చేయలేవు. సుప్రీం కోర్టు కూడా కాన్వెంట్ డ్రెస్ కోడ్ విషయంలో జోక్యం చేసుకోదు.

మరి ముస్లిమ్ మహిళ వేసుకునే డ్రెస్ కోడ్‌నే ఎందుకు విమర్శిస్తున్నారు?

బెల్జియంలో బురఖా నిషేధించారు. ఇంకా సెనేట్ ఆమోదం పొందవలసి ఉంది. యూరప్‌లో బురఖాను నిషేధించిన తొలిదేశం బెల్జియం. అదే బాటను కొన్ని యూరప్ దేశాలు అనుసరించడానికి ప్రయత్నిస్తున్నాయి. బురఖా వేసుకున్నందుకు ఇటలీలో ఓ ముస్లిమ్ మహిళకు 650 డాలర్లు ఫైన్ వేశారు.

ప్రజాస్వామ్యం, సెక్యులరిజమ్, మానవహక్కుల గురించి మాట్లాడే వీరికి బురఖా నిషేధం హక్కుల ఉల్లంఘనేనని తెలియదా?

ఓ స్త్రీ తన కిష్టమైన విధంగా బికినీతో రోడ్డుపై సంచరించడానికి హక్కు కలిగి ఉన్నప్పుడు, మరో స్త్రీ పూర్తిగా శరీరాన్ని కప్పుకోవడానికి హక్కు లేదనడం సమంజసమా? ఇది ద్వంద్వ వైఖరి కాదా?

స్త్రీ విలాస వస్తువో, సెక్స్ వస్తువో కాదు కదా! స్త్రీని గౌరవించాలి. పూర్తిగా బట్టలు వేసుకోకుండా, పొట్టి బట్టలు వేసుకునే స్త్రీలను చూసి ''అయ్యో పాపం! వేసుకోవడానికి వారికి సరిపోయే బట్టలు లేవు'' అని వారిపై జాలిపడాలి గాని, శరీరాన్ని కప్పుకున్న వారిపై జాలిపడటం ఎందుకు?

ఈ యూరప్ దేశాలు మతతత్వ దేశాలేగాని, **సెక్యులర్ దేశాలు కాదని, మత దురభిమానంతో మానవహక్కులను ఒక పక్క కాలరాసేస్తూ** ప్రజాస్వామ్యానికి, మానవహక్కులకు విలువిస్తున్నామని చెప్పుకోవడం యూరప్ దేశాల కపటవైఖరిని బట్టబయలు చేస్తుంది.

పోలీస్, డాక్టర్, లాయర్, నర్స్, బస్ కండక్టర్ ... ఇలా ఎన్నో రకాల మహిళా ఉద్యోగాలకు, వాటికి సరిపడా యూనిఫామ్‌లున్నాయి. ముక్కూ మొహం తెలియని కాషాయ వస్త్రాలు ధరించిన స్వాములు కనిపించగానే మన దేశంలోని హిందువులు గౌరవంతో వారికి నమస్కరిస్తారు. ఆ స్వామి ఎలాంటివాడో తెలియకపోయినా సరే, ఆ డ్రెస్‌కోడ్‌కి ఓ విలువుంది. అలాగే పోలీస్ యూనిఫామ్‌కి ఓ గౌరవముంది. క్రైస్తవ నన్స్‌కి ఒక డ్రెస్‌కోడ్ ఉంది. వారు సంసార జీవితాన్ని త్యాగం చేసినవారుగా, చూసేవారికి నన్‌యొక్క డ్రెస్ కోడ్ తెలియజేస్తుంది.

మరి ముస్లిమ్ స్త్రీ వేసుకున్న బురఖా ఏం చెబుతుంది?

ఆమె సర్వలోకాల ప్రభువైన అల్లాహ్‌నే ఏకైక ఆరాధ్యుడుగా విశ్వసించిన స్త్రీ అని, అల్లాహ్ ఆదేశాల మేరకు తన అందాలను తన భర్తకు మాత్రమే చూపించే దైవ విశ్వాసి అని తెలియజేస్తుంది. ఆమె తన భర్త దగ్గర మరియు ఖుర్ఆన్ అనుమతించిన తన బంధువుల దగ్గర మరియు తన ఇంటిలో మాత్రమే మామూలు వస్త్రధారణలో ఉంటుందని అందరూ తెలుసుకునేలా చేస్తుంది. బురఖా ఆమె శరీరానికి రక్షణను, ఆమెకు వ్యక్తిగత గౌరవాన్ని కలుగజేస్తుందని ప్రతీ ముస్లిమ్ మహిళ తోటివారికి తెలియజేయవలసి ఉంది.

నేడు బురఖా గురించి సరిగ్గా తెలియని వారు, బురఖా గురించి మాట్లాడలేనివారు కూడా స్టేజీలెక్కి ప్రసంగాలిస్తున్నారు. సరియైన విధంగా చెప్పకపోవడంతో, ముస్లిమ్ మహిళలు తీవ్రంగా నిరాశపడిన సంఘటనలున్నాయి.

**ఈ మండు వేసవిలో మగ, ఆడ తేడా లేకుండా ఎండ నుండి కాపాడుకోవడానికి ఉద్యోగాలకు, కాలేజీలకు వెళ్ళే వాళ్ళు తమ శరీరాలను బట్టలతో ఎలా కప్పుకుంటున్నారో చూస్తున్నారు కదా! ఇదే పని గనుక ఓ ముస్లిమ్ స్త్రీ చేస్తే ఎందుకు విమర్శిస్తున్నామని ఒక్కసారైనా ఆత్మపరిశీలన ఎందుకు చేసుకోరు?**

మీడియాకి మహిళలు పూర్తిగా శరీరాన్ని కప్పుకున్నా నచ్చదు. పొట్టిబట్టలు వేసుకునే చిన్నారులని చూసినా నచ్చదు. ఈ విషయం ఈ మధ్యనే టి.వి. ఛానెళ్ళ చర్చా కార్యక్రమంలో బయటపడింది.

**కాని ఎద్దుల్లాగా పెరిగిన ఆడవాళ్ళు బికినీలతో కనిపించడమే కాకుండా, సినిమాలలో అశ్లీల సన్నివేశాలలో నటిస్తూ ఉంటే ఇదే మీడియావారు 'ఫలానా హీరోయిన్ ఫలానా విధంగా అందాలను ఆరబోసింది' అంటూ సిగ్గులేకుండా వర్ణించడం జరుగుతుంది.**

మీడియా నీతి నిజాయితీలను వదిలేసి, వ్యాపార కోణంతో పనిచేస్తుందనేది నేటి బహిరంగ రహస్యం. 24గంటలపాటు ఏదో ఒకటి చూపాలి కాబట్టి, ఆ వార్త సంచలనంగా అనిపిస్తే చాలు, అదే న్యూస్‌ని చూపిందే చూపించి, చెప్పినదే చెప్పడం చేస్తూ, ప్రేక్షకుల మనశ్శాంతిని దూరం చేస్తున్నారు.

చిన్నారి 'వైష్ణవి'ని కాల్చి బూడిద చేసిన సంఘటన తరువాత, టి.వి. ఛానెళ్ళు కూడా భగ్గుమన్నాయి. భగ్గుమన్న ఆ మీడియా మంటలలో హంతకులు మాడి మసై పోతారనుకున్నాం. కాని ఆ తరువాత ఆ సంఘటనే మీడియాలో మసిబారిపోయింది.

కొన్ని రోజుల పాటు ఆ సంఘటన మీడియాకు ఆహారమైంది. అంతే! ఆ తరువాత అందరూ మర్చిపోతారని టి.వి. ప్రేక్షకులకు తెలిసిన విషయమే!

హైదరాబాద్‌లో తీవ్రవాద దాడులు జరిగే అవకాశముందని ఇంటెలిజెన్స్ హెచ్చరికలకు అనుగుణంగా, పోలీస్ డిపార్ట్‌మెంట్ అప్రమత్తమైంది. ఇక మీడియాలో స్లీపర్ సెల్స్ గురించి క్లాసులు పీకారు. మీ ప్రక్కనున్న వాడే బాంబులు పేల్చవచ్చు. తస్మాత్ జాగ్రత్త అని చెబుతున్నారు. అంటే తోటి ముస్లిమ్ సోదరులనందరినీ అనుమానించాలనా? ఎవరో దుర్మార్గుడు మానవత్వం లేకుండా చేస్తే, వాడు చేసే పనికి అమాయక ముస్లిమ్‌లను అవమానించాలా?

ఆ మధ్య పశ్చిమగోదావరి జిల్లాలో ఓ నక్సలైట్ అద్దెకుండే ఇంటి పోర్షన్‌లో ఆయుధ సామాగ్రి భారీస్థాయిలో కనుగొన్నారు. అతను చాలా సైలెంట్‌గా, మర్యాద పూర్వకంగా ఉండేవాడని చుట్టుప్రక్కలవారు చెప్పారు. **అతను ముస్లిమ్ కాదు.** మరి అతని మతానికి చెందిన కొత్త వ్యక్తులకు ఇండ్లు అద్దెకిచ్చేటప్పుడు తస్మాత్ జాగ్రత్త అని చెబుతారా? **చెప్పరు.** ఈ తస్మాత్ జాగ్రత్తలు ముస్లిముల కొరకు మాత్రమేనా?

**ముస్లిమ్‌లపై జరుగుతున్న ఈ మానసిక హింస ఇంకెన్నాళ్ళు?**

ఓ టి.వి. ఛానెల్‌వారు ఈ విషయమై డిస్‌ప్లే చేసిన కాప్షన్ : ''ఇస్లామిక్ ఉగ్రవాదులు విధ్వంసానికి పాల్పడే అవకాశాలు''

ఇస్లామ్ (శాంతి ధర్మం) మరియు తీవ్రవాద పరస్పర విరుద్ధమైనవని మీడియా వారికి నిజంగా తెలియదా? తెలుసుకోగలిగే జ్ఞానం వారికుంది. కాని తెలుసుకోవడానికి ప్రయత్నించరు. ఒకవేళ నిజం తెలిసినా చెప్పరు. పాకిస్తాన్ భారతదేశానికి శతృదేశం కాబట్టి, ఆ దేశంలో మెజార్టీ ప్రజలు ముస్లిములు గనుక ముస్లిములనందరినీ శతృవులుగా చూపిస్తూ, ఇటువంటి మత దురభిమానపు కాప్షన్‌లు వేస్తున్నారు. **మీడియాలో పనిచేసే ముస్లిమ్‌లకు గాని, సమాజంలో పేరూ పలుకుబడి ఉన్న ముస్లిమ్ లాయర్లకుగాని, ముస్లిమ్ సమాజంలోని వివిధ జమియత్‌ల నాయకులకు గాని ఇవేమీ పట్టవు.**

పాకిస్తాన్ మనకు శతృదేశమైనప్పుడు, పాకిస్తాన్‌కి మిత్రదేశం మరియు ఆ దేశానికి ఆర్థిక సహకారాన్ని అందించే అమెరికా మనకు శతృదేశమవుతుందా? లేక మిత్రదేశమవుతుందా? తీవ్రవాదంపై యుద్ధం చేస్తున్నామని చెబుతున్న అమెరికా పాకిస్తాన్‌తో ఎందుకు స్నేహాన్ని కొనసాగిస్తుంది? అప్పుడు అమెరికా కూడా పరోక్షంగా మనకు శతృదేశమే కదా! **తాలిబాన్లు బిన్‌లాడెన్‌ని అప్పగించలేదని సాకుతో ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దాడిచేస్తే సమర్థించిన మీడియా, హెడ్లీని భారత్‌కి అప్పగించమని చెబుతున్న అమెరికాపై మనదేశం ఏమి చేయవలసి ఉందో ఎందుకు చెప్పడం లేదు?**

మీడియా నిష్పక్షపాతి కాదు. ద్వంద్వవైఖరిని అవలంభిస్తుందని చెబితే, అందులో కొత్తదనం లేకపోవచ్చుగాని, తరచుగా మీడియా యొక్క ద్వంద్వవైఖరిని ప్రజలకు జ్ఞాపకం చేస్తూ ఉంటే, ప్రజలలో కొందరైనా మీడియాలో వచ్చే ప్రతీ విషయాన్ని గుడ్డిగా నమ్మరని మా నమ్మకం.

**- శాంతిబాట టీమ్**



# అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

**8**

## ఖుర్'ఆన్ తఫ్సీర్

(గత సంచిక తరువాయి)

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ❷

**అల్‌హమ్‌దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్**

### అల్‌హమ్‌దు

**'హమ్ద్'** అనే పదానికి 'పొగడ్త' మరియు 'కృతజ్ఞతతో కూడిన ప్రశంస' అనే అర్థాలున్నాయి. సాధారణంగా ప్రజలు తమకు నచ్చిన సృష్టితాలని పొగుడుతారు. వాస్తవానికి వాటిని సృష్టించిన సృష్టికర్తనే పొగడాలి. ఉదాహరణకు వీరోచితంగా పోరాడే ధైర్యశాలిని చూసినా లేదా ఓ అందమైన స్త్రీని చూచినా, వారికి ఆ ధైర్యాన్ని, అందాన్ని ఇచ్చిందెవరు? అని ఆలోచించాలి. వారికి అవి ఇచ్చినది అల్లాహ్‌యే! కాబట్టి పొగడ్తలకు అర్హుడు అంత చక్కగా సృష్టించిన అల్లాహ్‌యే!

అయితే మానవుని ప్రధాన శతృవు షైతాన్, మనిషిలో గర్వాన్ని కలుగజేసి, స్వయంగా తనను తానే పొగడుకునేలా చేస్తాడు. లేదా 'అల్లాహ్'ని కాకుండా వేరొకరిని పొగిడేలా కూడా చేస్తాడు. వ్యక్తి పూజ (Hero-worship) వైపు మరలేలా చేస్తాడు.

ఎవరైనా చిన్న సహాయం చేస్తేనే మనం వెంటనే కృతజ్ఞత తెలియజేస్తాం కదా! మరి ఈ భూమి మీద మనం బ్రతికే ప్రతీ క్షణం అల్లాహ్ యొక్క కరుణపైనే ఆధారపడి ఉన్నప్పుడు, మనం అల్లాహ్‌కి ఎంత కృతజ్ఞులుగా ఉండాలి! మనం పీల్చేగాలి, తినే ఆహారం, వేసుకునే బట్టలు అంతా కూడా అల్లాహ్ దయవల్లనే సాధ్యమవడం జరిగింది.

కాబట్టి పొగడ్తలు మరియు కృతజ్ఞతలు కేవలం అల్లాహ్ కొరకే! ఇక 'హమ్ద్' అనే అరబీ పదానికి 'అల్' అనే పదం కలిస్తే 'అన్ని రకాల లేదా సకల' అనే అర్థాన్నిస్తుంది.

**అల్-హమ్‌దు** = సకల (అన్ని రకాల) పొగడ్తలు మరియు కృతజ్ఞతలు
**లిల్లాహి** = అల్లాహ్ కొరకే

అయితే పాఠకులకు ఓ సందేహం రావచ్చు. అదేమిటంటే - 'ఒక పదానికి రెండు లేదా మూడు అర్థాలున్నప్పుడు, సందర్భానికి సరిపోయే ఏదో ఒక అర్థాన్ని తీసుకుంటే సరిపోతుంది కదా! పదానికి ఉన్న అర్థాలన్నింటిని ఎందుకు తీసుకోవాలి' అని.

ఇది అర్థం కావడానికి, **సూరహ్ అలఖ్**‌లోని రెండవ వాక్యం (خَلَقَ الْاِنْسَانَ مِنْ عَلَقٍ) యొక్క అర్థాన్ని ఇక్కడ ఉదాహరిస్తున్నాము :

**"ఆయన పేరుకుపోయిన నెత్తుటి ముద్దతో మానవుణ్ణి సృష్టించాడు"**
(దివ్య ఖుర్'ఆన్ - హమీదుల్లా షరీఫ్)

**"కరుడుగట్టిన నెత్తుటి ముద్దతో మానవుణ్ణి పుట్టించాడు"**
(ఖుర్'ఆన్ అవగాహనం - ఎస్.ఎమ్. మలిక్)

**"ఆయనే మానవుణ్ణి రక్తపు ముద్దతో సృష్టించాడు"**
(దివ్యఖుర్'ఆన్ సందేశం - డా. అబ్దుర్రహీమ్)

"**Created man from a clinging substance**"
*(The Quran - Sahee International)*

"**Created man, out of a (mere) clot of congealed blood**"
*(The Holy Qur'an - Abdullah Yusuf Ali)*

"**He has created man from a clot (a piece of thick coagulated blood)**"
*(The Noble Qur'an - Dr. Taqi-ud-Din Al-Hilali & Dr. Muhsin Khan)*

పై వాక్యంలో అలఖ్ (عَلَق) అనే అరబీ పదానికి, పైన తెలిపిన అనువాదాలలో వివరించినట్లు **రక్తపు ముద్ద** అనే అర్థమొస్తుంది. అయితే ఇదే పదానికి 'అంటిపెట్టుకుని ఉన్న పదార్థం' (clinging substance) అనే అర్థం కూడా ఉంది. ఈ పదానికే ఉన్న మరో అర్థం జలగ. ఈ 3 అర్థాలు వేర్వేరుగా, భిన్నంగా ఒకదానితో మరొకటి పొంతన లేనట్లు కనిపిస్తున్నాయి కదా!

కాబట్టి అలఖ్ అంటే - 'పేరుకుపోయిన రక్తపు ముద్ద, అంటి పెట్టుకుని ఉండే పదార్థం, జలగ'. మానవ పిండం యొక్క తొలి దశ రక్తపుముద్దలా ఉంటుంది. ఆ ముద్ద తల్లి గర్భాశయ గోడలకి అంటిపెట్టుకుని తల్లి నుండి జలగ వలె రక్తాన్ని పీల్చుకుంటుంది.

అంటే తల్లి గర్భాన్ని అంటిపెట్టుకుని, తల్లి నుండి తనకవసరమైన దానిని జలగలా పీల్చే రక్తపుముద్దగా చెప్పుకోవచ్చు. కాబట్టి ఈ విధంగా ఖుర్'ఆన్‌లోని ఏదైనా ఓ అరబీ పదానికి ఉన్న అర్థాలు వేర్వేరుగా

కనిపించినప్పటికిని, చాలా సందర్భాలలో అవి సరిపోయేలా ఉంటాయి.

అదే విధంగా, 'హమ్ద్'కు ఉన్న రెండు అర్థాలైన 'పొగడ్తలు (స్తోత్రాలు) మరియు కృతజ్ఞతలు' రెండింటినీ ఇక్కడ తీసుకోవాలి. అలాగే ఇక్కడ కృతజ్ఞత అంటే - ప్రశంసతో కూడిన కృతజ్ఞత.

ఇక అల్‌హమ్‌దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్‌లోని రెండవ భాగం - **'రబ్బిల్ ఆలమీన్'**.

'**రబ్**'కు భాషాపరమైన అర్థమేమిటంటే పెంచేవాడు, పోషించేవాడు, శిక్షణనిచ్చేవాడు, పరిపూర్ణమయ్యేవరకూ అభివృద్ధి చేసేవాడు. ఈ 'రబ్' పదానికి 'అల్' కలిపితే (అల్ + రబ్ = అర్రబ్) అవుతుంది. అల్లాహ్ యొక్క గుణాలను తెలిపే గొప్పపేర్లలో ఇది కూడా ఒకటి.

'**ఆలమ్**' = లోకం.

**ఆలమీన్** = లోకాలు  **అల్-ఆలమీన్** = సకల లోకాలు

'**ఆలమ్**' అంటే అల్లాహ్ సృష్టించిన ప్రతీది కూడా 'ఆలమ్' అవుతుంది. ఇహలోకంలోనూ, పరలోకంలోనూ కూడా అల్లాహ్ సృష్టించిన ప్రతీది కూడా 'ఆలమ్' అనబడుతుంది (అల్-ఖుర్తుబి వ్యాఖ్యానం).

ఉదాహరణకు 26వ సూరహ్‌లోని 23, 24 ఆయత్‌లను గమనించండి:

> (ఫిర్‌ఔన్) అడిగాడు : "అయితే, ఈ సర్వలోకాల ప్రభువు (రబ్బుల్ ఆలమీన్) అంటే ఏమిటి?
>
> (మూసా) జవాబిచ్చాడు : "మీరు నమ్మేవారు అయితే! (ఆయనే) ఆకాశాలకూ మరియు భూమికీ మరియు వాటి మధ్యనున్న సమస్తానికీ ప్రభువు!"

**"సకల పొగడ్తలు మరియు కృతజ్ఞతలు సర్వలోకాలకు ప్రభువు మరియు పోషకుడైన అల్లాహ్ కొరకే"**

---

❸ الرَّحْمٰنِ الرَّحِيمِ అర్రహ్మా నిర్రహీమ్

**అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు.** ఈ ఆయత్ గురించి క్రిందటి సంచికలో చాలా వివరంగా చెప్పడం జరిగింది.

---

❹ مٰلِكِ يَوْمِ الدِّيْنِ మాలికి యౌమిద్దీన్

తీర్పుదినానికి యజమాని

ఈ ఆయత్ యొక్క మరికొన్ని అనువాదాలు :

"**The Master of the Day of Judgment**" *(Maariful Qur'an)*
తీర్పుదినానికి స్వామి (దివ్య ఖుర్‌ఆన్ సందేశం)

"**Sovereign of the Day of Recompense**" *(Sahee International)*
ప్రతిఫల దినానికి స్వామి (ఖుర్‌ఆన్ అవగాహనం)

"**The only Owner (and the only Ruling Judge) of the Day of Recompense (i.e. the Day Resurrection)**" *(The Noble Qur'an)*

ఈ సృష్టిలో జన్మించిన ప్రతీఒక్కరూ మరణించక తప్పదు. ఈ సృష్టి అంతమయ్యాక ఓ రోజు అందరూ తిరిగి లేపబడతారు.

పై ఖుర్‌ఆన్ వాక్యంలో చెప్పిన 'తీర్పుదినం' లేదా 'ప్రతిఫల దినం' గురించి ఖుర్‌ఆన్‌లో చాలా చోట్ల ప్రస్తావించడం జరిగింది.

ఉదాహరణకు సూరహ్ గాఫిర్ (40 : 16,17) చూడండి.

> **"ఆ రోజు వారందరూ బయటికి వస్తారు. వారి ఏ విషయం కూడా అల్లాహ్ నుండి రహస్యంగా ఉండదు. ఆ రోజు విశ్వ సామ్రాజ్యాధికారం ఎవరిది? ఒక్కడు ప్రబలుడూ అయిన అల్లాహ్‌దే!"**
>
> **"ఆ రోజు ప్రతిప్రాణికి తాను సంపాదించిన దాని ప్రతిఫలం ఇవ్వ బడుతుంది. ఆ రోజు ఎవ్వరికీ అన్యాయం జరుగదు. నిశ్చయంగా, అల్లాహ్ లెక్క తీసుకోవటంలో అతి శీఘ్రుడు"**

తీర్పు చెప్పేది మరియు ప్రతిఫలాన్నిచ్చేది అల్లాహ్‌యే!

**యౌమ్** అంటే **రోజు, పీరియడ్** (కాలవ్యవధి)

**(అద్)దీన్** అంటే *reckoning* **('లెక్క తీసుకోవడం' 'ప్రతిఫలం(బహుమానం) లేదా శిక్ష')**

ఈ ఆయత్ మరింత స్పష్టం కావడానికి క్రింది ఖుర్‌ఆన్ వాక్యాలను కూడా గమనించండి :

> "ఆ రోజు! అల్లాహ్ వారికి, (వారి కర్మలకు) పూర్తి ప్రతిఫలము నిస్తాడు. మరియు నిశ్చయంగా, అల్లాహ్! ఆయనే పరమ సత్యమని తెలుసుకుంటారు" (ఖుర్‌ఆన్ 24:25)
>
> "ఏమీ? మనం చనిపోయి మట్టిగా ఎముకులుగా మారిపోయిన తరువాత కూడా నిశ్చయంగా, మనకు ప్రతిఫలమనేది ఉంటుందా? (ఖుర్‌ఆన్ 37:53)
>
> "ఆ రోజు మీరు (తీర్పు కొరకు) హాజరు చేయబడతారు. మీరు దాచిన ఏ రహస్యం కూడా (ఆ రోజు) దాగి ఉండదు. వారి నాలుకలు, వారి చేతులు మరియు వారి కాళ్ళు - వారు చేస్తూ ఉండిన కర్మలను గురించి - వారికి విరుద్ధంగా సాక్ష్యమిచ్చే రోజు! (ఖుర్‌ఆన్ 24:24)

**(ఖుర్‌ఆన్ గ్రంథ అధ్యయనాన్ని ప్రోత్సహించడం కొరకు అందిస్తున్న తఫ్సీర్‌లోని మరికొంత భాగం వచ్చే సంచికలో ...)**

**"ఇది ఒక దివ్య గ్రంథం**
**ఇందులో ఏ మాత్రం సందేహం లేదు.**
**దైవభీతిగలవారికి ఇది మార్గదర్శకత్వము."**
(ఖుర్‌ఆన్ 2:2)

## ఖుర్‌ఆన్ గ్రంథములోని కొంతభాగం ప్రతీరోజూ అర్థం చేసుకుంటూ చదవండి

## ఖుర్‌'ఆన్‌పై దుష్ప్రచారం - 3

తూర్పు గోదావరి జిల్లా 'పిట్టలదొర'గారి అజ్ఞానపు డెన్‌లోనుండి తప్పించుకుని బయటపడిన సోదరులు ఇలా చెబుతున్నారు : **'మేము ఆ సంస్థ వలన నష్టపోయాం, మాలాగ ఇతరులు కూడా నష్టపోకుండా ఉండాలంటే ఈ శీర్షికను కొనసాగించాలి'**. మన రాష్ట్రంలో దొంగ స్వాములు, దొంగ బాబాల గురించి నిజాలు బయటపడ్డాక, ఆలోచన గలవారు వారిని చీదరించుకుని బయటకు వస్తుంటే, కొందరు ఇంకనూ మూర్ఖంగా వారిని నమ్మడాన్ని చూస్తూనే ఉన్నాము.

నిజాలు బయటపెడుతున్న **'శాంతిబాట'**ను చదవవద్దని పిట్టలదొర అనుచరులు రాయలసీమ ప్రాంతంలో ప్రచారం చేస్తున్నారని మా పాఠకులు తెలియజేశారు. మరి వారి ముఖ్య స్థావరాన్ని కలిగిఉన్న తూ.గో.జిల్లాలో పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఇలాంటి పిట్టలదొరలు ఎన్ని అవాంతరాలు కల్పించినా, అల్లాహ్‌ తలిస్తే నిజాలు బయటకు వస్తూనే ఉంటాయి.

**1400 సంవత్సరాలు దాటినా సరే, అల్లాహ్‌ యొక్క వాగ్దానం మేరకు, ఒక్క అక్షరం కూడా మారని గ్రంథం - 'ఖుర్‌ఆన్‌'. 'సున్నీ'లకైనా, 'షియా'లకైనా ఖుర్‌'ఆన్‌ ఒక్కటే. ప్రపంచంలో ఒకే ఒక్క ప్రామాణిక దైవ గ్రంథాన్ని కలిగి ఉండటం, ఒక్క ఇస్లామ్‌లోనే సాధ్యమైంది.**

**అరబీ భాషనుండి వివిధ భాషల్లోకి అనువాదాలు జరిగాయి. వాటిని మరలా రివైజ్‌ చేస్తూనే ఉన్నారు. కాని ఆ అనువాదాలకి మూలమైన అరబీ వాక్యాలు ఎంత మాత్రం మారవు.**

కాబట్టి ఎవరు ఎన్ని వక్రీకరణలు చేసినా, ఒరిజినల్‌ సత్యగ్రంథమైన ఖుర్‌'ఆన్‌ ద్వారా ఆ వక్రీకరణలను ఖండించి, వక్రీకరణ చేసేవారి భాగోతాన్ని బయటపెట్టవచ్చు.

ఖుర్‌'ఆన్‌ గ్రంథం కూడా మారిపోయిందని నిరూపించాలని, ఓ అర్ధ శతాబ్దంపాటు ఎంతోమంది వేల ఖుర్‌'ఆన్‌ కాపీలపై పరిశోధన చేసి ఎంత కష్టపడినా, నిరూపించలేకపోయారు. చివరికి ఖుర్‌'ఆన్‌ గ్రంథంలో మార్పుల్లేవు అని చెప్పవలసి వచ్చింది.

అవతరించిన కాలానికి చెందిన రెండు ఒరిజినల్‌ కాపీలు ఇప్పటికీ భద్రపరచపడి ఉన్నాయి.

ఈ నిజం ప్రజలకు తెలియకూడదని, అన్ని గ్రంథాల వంటిదే ఖుర్‌'ఆన్‌ అని, ఖుర్‌ఆన్‌పై కూడా అనుమానాలు కలిగేలా, ఖుర్‌'ఆన్‌ గ్రంథంపై ఏ మాత్రం జ్ఞానంలేని ఈ పిట్టలదొర(లు) స్టేజి షోలిస్తున్నారు. వారి నైజం తెలిశాక కూడా ఈ వక్రీకరణ పనులను నిలదీయకపోతే అల్లాహ్‌ ముందు సంబంధిత వ్యక్తులందరూ సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది.

ఈ దుష్ప్రచారం కోసం వీరు ఎన్నుకున్నవి - సూరహ్‌ అల్‌హిజ్ర్‌లోని 90 మరియు 91 వాక్యాలు.

ఈ వాక్యాలకు ఒరిజినల్‌ అరబీ మూలం :

كَمَآ أَنزَلْنَا عَلَى ٱلْمُقْتَسِمِينَ (90)
ٱلَّذِينَ جَعَلُوا۟ ٱلْقُرْءَانَ عِضِينَ (91)

పై ఖుర్‌'ఆన్‌ వాక్యాలకు సంబంధించి కొన్ని అనువాదాలను ఇక్కడ అందిస్తున్నాము. **ఏ అనువాదకుడైనా ఎక్కడో ఒక చోట పొరపాటు చేయవచ్చు.** ఆ ఒక్క దోషాన్ని పట్టుకుని, మొత్తం అనువాదాన్నే తప్పు పట్టకూడదు. **అనువదించేవారు కూడా మానవమాత్రులే కదా!**

**ఏ అనువాదాలనయితే ఈ శీర్షికలో అందిస్తున్నామో, ఆ అనువాదాలు చేసిన వారందరిపై మాకు ప్రత్యేక గౌరవభావం ఉంది. అల్లాహ్‌ వారిపై శ్రేయో శుభాలను కలుగుజేయుగాక!** (ఆమీన్‌)

పిట్టలదొరలు తమ దుష్ప్రచారానికి అనుకూలంగా ఉండేవి మరియు కొంత అస్పష్టంగా ఉండే అనువాద వాక్యాలను ఎన్నుకుంటారు. ఎవరైనా వారిని గట్టిగా గద్దించి అడిగితే తప్పు వారిది కాదని, అనువాదకుడిది అని చెప్పి, వారి దుర్మార్గాన్ని అనువాదకులపై నెట్టివేస్తారు.

"మా టీచర్‌గారు ఇలాగే చెప్పారు కాబట్టి, తప్పు అయినా సరే నేను ఇలాగే వ్రాస్తాను" అని విద్యార్థి పరీక్ష వ్రాస్తే, నష్టపోయేది ఎవరు?

విద్యార్థే కదా!

పిట్టలదొర(లు) ఎన్నుకున్న అనువాదం :

> "ఇది **తమ ఖుర్‌'ఆన్‌ను తుత్తునియలుగా చేసిన** విభేదకారకుల వైపునకు మేము పంపిన హెచ్చరిక వంటిదే. కనుక నీ ప్రభువు సాక్షిగా మేము తప్పకుండా వారందరినీ 'మీరేమీ చేస్తూ ఉండేవారు?' అని అడుగుతాము" (15:90-92)
> (తెలుగు అనువాదకులు : గౌ. జనాబ్‌ హమీదుల్లా షరీఫ్‌)

పై అనువాదంలో పెద్ద పొరపాటు జరిగింది. అది అర్థం కావడానికి మరికొన్ని అనువాదాలను ఇక్కడ అందిస్తున్నాము.

అంతిమ దైవగ్రంథం (శాంతిమార్గం పబ్లికేషన్స్‌)

> ''ఎవరు ఈ దైవగ్రంథాన్ని ముక్కచెక్కలుగా చేశారో, ఆ విభజనకారులపై మేము పంపినటువంటిదే(ఇది). నీ ప్రభువు సాక్షిగా! మేమందరినీ తప్పకుండా నిలదీసి అడుగుతాము''

పై రెండు అనువాదాలలో **'తుత్తునియలు చేయడం'**, **'ముక్కలు చెక్కలుగా చేయడం'** వంటి పదాలను వాడేముందు అనువాదకులు కాస్త ఆలోచించి ఉంటే బావుండేది. ఇక్కడ తెలుగు పదప్రయోగం సవ్యంగా జరగలేదు.

ఈ అనువాదాలు రావడానికి ఓ 50 సంవత్సరాల క్రితమే, గౌ. జనాబ్‌ అబ్దుల్‌ గఫూర్‌గారి అనువాదం ప్రచురించబడింది.

కాబట్టి ఏ అనువాదకుడైనా, అప్పటికి అందుబాటులోనున్న అనువాదాలను కూడా పరిశీలిస్తే మరింత మెరుగైన అనువాదం ఇచ్చే అవకాశముంటుందనేది మా అభిప్రాయం.

అబ్దుల్‌ గఫూర్‌గారు 'దేవుని గ్రంథమును **అనేకభాగములుగా** చేసిన వారికి' అని అనువదించారు. అరబీ నుండి తెలుగులోకి అనువదించడంలో ఈయనది తొలి ప్రయత్నం. తొలి ప్రయత్నంలో సహజంగా పొరపాట్లు ఉండవచ్చు. కాని పొరపాట్లు దొర్లకుండా ఆయన చాలా శ్రద్ధ తీసుకున్నారు.

పూర్తిగా కాకపోయినా, దాదాపు అరబీ మూలానికి దగ్గరగా అనువదించబడిన మరో అనువాదం :

> **“ఏ విధంగానైతే మేము విభజించే వారిపై అవతరింపజేశామో! ఎవరైతే ఈ ఖుర్'ఆన్‌ను ముక్కలు ముక్కలుగా చేశారో! నీ ప్రభువు సాక్షిగా! నిశ్చయంగా, మేము వారందరినీ ప్రశ్నిస్తాము”**
>
> (తెలుగు అనువాదకులు : గౌ. జనాబ్ అబ్దుర్రహీమ్)

పై తెలుగు అనువాదంలో **‘ముక్కలు ముక్కలుగా’** అనే బదులు **‘అనేక భాగాలుగా’** అని అనువదించి ఉంటే అరబీ మూలానికి పై అనువాదం చక్కగా సరిపోయేది.

ఈ వాక్యాలపై విశ్లేషణ, వివరణ అందించే ముందు కొన్ని ఇంగ్లీష్ అనువాదాలు :

As we have sent down on the **Muqtasimin** (conspiring confederates) who have made the Qur'an into parts. So, by your Lord, we shall certainly call all of them to account
(15:90-92, *Tafsir Ibn Kathir*, Darussalam)

And Say : I am Indeed he that warns openly and without ambiguity (of just such wrath) as we sent down on those who divided (scripture into arbitrary parts), (so also on such)as one we have made Qur'an into shreds (as they please). Therefore, by the Lord, we will, of a surety, call them to account.
[15:89-92, *Abdullah Yusuf Ali* (1934)]

As we have sent down on the dividers (**Quraish Pagans or Jews and Christians**) who have made the Qur'an into parts (i.e. **believed in one part and disbelieved other**) [*Tafsir At-Tabari*]
(*The Noble Quran*, Darussalam)

As we sent down upon the schismatics who split the Qur'an into bits (*Maariful Qur'an* 15:90-91)

**క్రింది ఇంగ్లీష్ అనువాదంలో లోపం ఉంది.**

Even as we had sent warning on those who had divided their religions into fragments, Those who had split up their scripture [Qur'an] into pieces

(Towards understanding the Qur'an, సయ్యద్ అబుల్ అ'లా మౌదూది గారి తఫ్‌హీముల్ ఖుర్'ఆన్‌కి ఇంగ్లీష్ అనువాదం)

పై అనువాదంలో "Their Scripture" అంటే ‘వారి గ్రంథం’ అని అర్థం. ఒరిజినల్ అరబీలో ఆ పదాలు లేవు. ఒరిజినల్ అరబీ వాక్యంలో ‘ఖుర్ఆన్’ అని ఉంటే, ఆ ‘ఖుర్ఆన్’ అనే పదాన్ని పై ఇంగ్లీష్ అనువాదంలో బ్రాకెట్లో ఉంచారు.

**సూరహ్ హిజ్ర్‌లోని ఈ రెండు వాక్యాల విషయంలో అరబీ మూలానికి దగ్గరగానున్న సరియైన ఇంగ్లీష్ అనువాదం :**

**Just as we had revealed (scriptures) to the separators who have made the Qur'an into portions.**
(*The Qur'an*, Sahee International)

అందుబాటులో నున్న తఫ్సీర్‌లను, సహీహ్ హదీస్‌లను పరిశీలిస్తే, పైన చెప్పిన 90,91 వాక్యాలలో రెండు వర్గాల ప్రజల గురించి చెప్పబడింది. ఒక వర్గం గ్రంథ ప్రజలు. మరో వర్గం విగ్రహారాధుకులైన అరబ్బులు.

దైవాన్ని విశ్వసించని నాస్తికులని తప్పిస్తే, దైవం గురించి నమ్మకమున్న వారిలో ప్రపంచంలో ఎప్పుడూ ఉండేవి పైన చెప్పిన రెండు వర్గాలే (విగ్రహారాధకులు, గ్రంథాలను పొందిన ప్రజలు)

ఖుర్'ఆన్‌లో ఏదైనా ఓ వాక్యాన్ని అనువదించడంలో, అర్థం చేసుకోవడంలోగాని ఇబ్బంది ఎదురైతే, ఖుర్'ఆన్‌లోని మరో వాక్యం ఆ వాక్యానికి వివరణ నిస్తుంది. ఆ విధంగా కూడా స్పష్టం కాకపోతే, సహీహ్ హదీస్‌ల ద్వారా తెలుసుకోవచ్చు. ఈ విషయంలో ఇంకా ఏమేమి మూలాలు మనకు ఉన్నాయో వాటి గురించి శాంతిబాట 2వ సంచికలో వివరించడం జరిగింది.

“**తమ ఖుర్'ఆన్**” అని తెలుగు అనువాదంలో చెప్పడం గాని, ఆ మూలానికే సంబంధించిన ఇంగ్లీష్ అనువాదంలో 'their scripture' అని చెప్పడంగాని కరెక్ట్ కాదు. అరబీ పదాలకు తెలుగు పదానువాదాన్ని లేదా భావానువాదాన్ని తీసుకున్నా కూడా ‘**తమ ఖుర్'ఆన్**’గా చెప్పడం నిస్సందేహంగా పెద్ద పొరపాటే.

యూదుల, క్రైస్తవుల గ్రంథాల పేర్లు ‘తౌరాత్, ఇంజీల్’ అని ఖుర్'ఆన్ గ్రంథాన్ని చదివే సామాన్య ముస్లిమ్‌లకు కూడా తెలుసు. ఉదాహరణకు హైదరాబాద్‌లో ఒక వ్యక్తి నివశిస్తున్నాడు. విజయవాడలో ఒక వ్యక్తి నివశిస్తున్నాడు. ఇద్దరికీ చెరో ఊరు ఉంది. మీకు మీ ఊరు ఎలాగో మాకు మా ఊరు అలాగే అని చెప్పడం వరకు బాగానే ఉంటుందిగాని, హైదరాబాద్‌లో ఉంటున్న వ్యక్తిని ఉద్దేశించి చెబుతూ, ‘అతని విజయవాడ’ అని అంటే దానికి అర్థం లేదు కదా!

**సహీహ్ బుఖారీ**లో సూరహ్ హిజ్ర్ 90,91 ఆయత్‌లకు సంబంధించి రెండు హదీస్‌లు ఉన్నాయి (నెం. **4705** & **4706**, 65వ పుస్తకం - కితాబుత్తఫ్సీర్, సంపుటి 6, సూరహ్ 15, అధ్యాయం 4).

90వ వాక్యంలో అరబీ మూలంలో వాడిన పదం **‘అల్-ముఖ్తసిమీన్’**. (الْمُقْتَسِمِينَ) ఈ పదాన్ని తెలుగులో విబేధకారకులు, విభజించువారు అని అనువదించారు.

ఫతహ్ అల్-బారీ (8:233)ని బట్టి మరియు పైన తెలిపిన రెండు హదీస్‌లను బట్టి వారు గ్రంథ ప్రజలు. గ్రంథాన్ని వారు భాగాలుగా చేసి కొంత విశ్వసిస్తున్నారు మరియు కొంత భాగాన్ని తిరస్కరిస్తున్నారు.

ఇక్కడ ‘భాగాలు’ అంటే ముక్కలు ముక్కలుగా చింపివేయడమో, కత్తిరించడమో కాదు. ఉదాహరణకు ఓ ఇంటిలో రెండు పోర్షన్‌లు ఉన్నాయి. ఆ ఇంటి యజమాని తన ఇద్దరు కుమారులకు చెరొక భాగాన్ని ఇచ్చాడనుకోండి. దాని అర్థం ఆ ఇంటిని భౌతికంగా రెండు ముక్కలు చేసినట్లు కాదు. ఇక్కడ కూడా అంతే.

ఇక్కడ కూడా ఖుర్'ఆన్ గ్రంథాన్ని భాగాలుగా చేయడమంటే, అందులోని కొంత భాగాన్ని స్వీకరించడం, మరికొంత భాగాన్ని తిరస్కరించడం అని అర్థం. అంతేగాని ఖుర్'ఆన్‌ని భౌతికంగా ముక్కలు చేయడం కాదు. **‘ముక్కలు ముక్కలు’** అనే కంటే **‘అనేక భాగాలుగా’** అనడమే సమంజసంగా ఉంటుంది. మరో అనువాదంలో మరీ ఘోరంగా ‘ముక్కలు చెక్కలు’ అనే పదాన్ని ఉపయోగించారు.

> **“..... ఏమీ? మీరు గ్రంథంలోని కొన్ని విషయాలను విశ్వసించి, మరి కొన్నింటిని తిరస్కరిస్తారా? మీలో ఇలా చేసేవారికి ఇహలోక జీవితంలో అవమానమూ మరియు పునరుత్థాన దినమున మిమ్మల్ని కఠిన శిక్షకు గురిచేయటం తప్ప మరెలాంటి ప్రతిఫలం ఉంటుంది?....”**
>
> (ఖుర్'ఆన్ 2:85)

మక్కాలో ఉన్న 'కాబా'ని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చే యాత్రికులకు, విగ్రహారాధుకులైన అరబ్బులు ముహమ్మద్(స)వారి గురించి చెడుగా చెప్పేవారు. ఖుర్'ఆన్ గ్రంథాన్ని ఉద్దేశించి అందులో కొంతభాగం 'కవిత'అని, కొంత భాగం 'మాయాజాలం' అని, ఇంకా చాలా విధాలుగా చెప్పేవారు. ఆ విధంగా వీరు ఖుర్'ఆన్‌ను అవమానపరిచేవారు. ఈ విధంగా విగ్రహారాధకులు 'ఖుర్'ఆన్' గ్రంథాన్ని భాగాలుగా చేయడాన్ని తఫ్సీర్ ఇబ్నె కసీర్‌లో కూడా స్పష్టంగా వివరించడం జరిగింది.

1934లో ప్రచురితమైన అబ్దుల్లా యూసుఫ్ అలీ గారి ఇంగ్లీష్ అనువాదంతో పాటు, ఈ వాక్యాల కొరకు ఇచ్చిన వివరణ కూడా చాల స్పష్టంగా ఉంటుంది. సహీహ్ ఇంటర్నేషనల్ వారి **'ద ఖుర్'ఆన్'**లో కూడా సింపుల్‌గా చక్కగా వివరణనిచ్చారు. 1941లో ప్రచురితమైన అబ్దుల్ గఫూర్‌గారి **ఖురానె మజీద్**లో ఈ వాక్యాల యొక్క వ్యాఖ్యానంలో ఇలా ఉంది :

> "యూదులు, నస్రానీలు తమ తమ గ్రంథములను భాగములు, భాగములుగా జేసి కొన్నింటిని నమ్మి కొన్నింటిని తిరస్కరించి దేవుని శిక్షకు పాత్రులైరి. అటులే ఖుర్'ఆన్‌ను నమ్మని వారికి దేవుని శిక్ష కలుగును."

ఖుర్'ఆన్ గ్రంథంలోని కొన్ని వాక్యాలకు వివరణ సహీహ్ బుఖారీ గ్రంథంలోని కితాబుత్తఫ్సీర్‌లో (సంపుటి 6) ఉంటుంది. కనీసం ఆ హదీస్‌లను చదివినా కూడా స్పష్టంగా తెలిసుండేది. కాబట్టి 'తౌరాత్' గ్రంథం కూడా **'ఖుర్'ఆన్'** అని చెప్పడం కరెక్ట్ కాదు. ఈ రెండూ ఒక్కటేనని చెప్పడం ద్వారా తూ.గో.జిల్లా పిట్టలదొరకు ఖుర్'ఆన్ జ్ఞానం లేదని, ఖుర్'ఆన్ గ్రంథంపై కనీస అవగాహన కూడా లేదని స్పష్టమౌతుంది.

ఇలాంటివారి మాయమాటలలో పడి, ఖుర్'ఆన్ గ్రంథాన్ని అపార్థం చేసుకోవద్దని, అమాయక ముస్లిమ్ సోదరులను కోరుతున్నాము. "**అన్ని గ్రంథాలూ కూడా ఖుర్'ఆన్‌లే**" అని చెబుతున్న 'పిట్టలదొర'కు, వాళ్ళు చూపే కొన్ని వాక్యాలకు స్పష్టమైన వివరణ ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో అందిస్తాము.

---

**గమనిక :** 'ఖుర్'ఆన్' గ్రంథంపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ప్రామాణిక విషయాలతో ఋజువుచేయడమే మా ఉద్దేశ్యం. అంతేగాని, ఇతర గ్రంథాల వారిని చులకన చేయడం కాదు. తోటి మనిషిని ప్రేమగా చూడమని, గౌరవంగా పలకరించమని, మానవులందరూ ఆదమ్(అస) సంతానమేనని బోధించిన మహాప్రవక్త ముహమ్మద్(స)వారిని అనుసరించేవాళ్ళము మేము.

**- శాంతిబాట టీమ్**

---

## FORM IV

*Statement about ownership and other particulars of SAANTHIBAATA Monthly (Telugu)*

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | D.No. 2-8-31, Kota Bazar, SAMALKOT-533440<br>East Godavari District, Andhra Pradesh |
| 2. Periodicity of its publication | : | Monthly |
| 3. Printer's Name | : | Md. ATHAHARULLAH |
| Nationality | : | Indian |
| Address | : | D.No. 4-1-6, Kota Bazar, Samalkot-533440<br>East Godavari District, Andhra Pradesh |
| 4. Publisher's Name | : | Md. ATHAHARULLAH |
| Nationality | : | Indian |
| Address | : | D.No. 4-1-6, Kota Bazar, Samalkot-533440<br>East Godavari District, Andhra Pradesh |
| 5. Editor's Name | : | Md. ATHAHARULLAH |
| Nationality | : | Indian |
| Address | : | D.No. 4-1-6, Kota Bazar, Samalkot-533440<br>East Godavari District, Andhra Pradesh |
| 6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | : | VELUGUBAATA EDUCATIONAL SOCIETY<br>(Regd. No. 569/2008)<br>D.No. 2-8-31, Kota Bazar, SAMALKOT-533440<br>East Godavari District, Andhra Pradesh |

I, Md. Athaharullah, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date: 28th February, 2010
Samalkot

Sd/-
Md. ATHAHARULLAH
Publisher

ప్రపంచ శాంతి దూత

సన్మార్గ బోధకుడు
నాయకుడు
ఆదర్శనీయుడు

# ముహమ్మద్ (స) వారి

బోధనలు
ఆచరణలు

ప్రారంభ సంచికలో సుందర సమాజ స్థాపనలో 'విద్య' యొక్క ప్రాముఖ్యతను ముహమ్మద్(స) బోధనల ద్వారా వివరించడం జరిగింది. ఆ బోధనలను అర్థం చేసుకుని, ముస్లిములు తొలి యూనివర్శిటీ స్థాపకులుగా, ఆధునిక సైన్స్‌కి వ్యవస్థాపక శాస్త్రవేత్తలుగా ఉన్నతస్థితికి చేరుకున్నారు. ఆ పూర్వ వైభవం మరలా రావాలంటే హదీసు జ్ఞానమెంత అవసరమో తెలియజేయడం జరిగింది. తరువాయి రెండు సంచికలకు ఎన్నుకున్న విషయం 'వడ్డీ'. సమాజాన్ని సుందరంగా తీర్చిదిద్దడంలో 'విద్య'కు ఎంత ప్రాముఖ్యత ఉందో, సమాజాన్ని సర్వనాశనం చేయగల సామర్థ్యం అంతకంటే ఎక్కువగా 'వడ్డీ'కి ఉంది. సులభంగా ఆచరణకు సాధ్యమయ్యే చిన్న పనులద్వారా గొప్ప ఫలితాన్ని సాధించగలమనే శుభవార్తను మరియు కష్టం ద్వారా కూడా అల్లాహ్ యొక్క కరుణ లభిస్తుందన్న విషయాన్ని తెలియజేసే బోధనను, ముస్లిమ్ మహిళ వస్త్రధారణ గురించి వివరాలను గత సంచికలలో అందించాము.

8

## కష్టం - సుఖాలు

దివ్య ఖుర్‌ఆన్ గ్రంథంలో 94వ సూరహ్ అయిన అష్-షర్‌హ్‌లోని 5,6 వాక్యాలలో అల్లాహ్ ఇలా చెబుతున్నారు :

فَاِنَّ مَعَ الْعُسْرِ يُسْرًا   اِنَّ مَعَ الْعُسْرِ يُسْرًا

**నిశ్చయంగా కష్టంతోపాటు సుఖం** (ఉంటుంది)
**నిశ్చయంగా కష్టంతోపాటు సుఖం** (ఉంటుంది) (ఖుర్‌ఆన్ 94:5,6)

ఈ సూరహ్‌లోని ఈ ఆయత్ వెంటవెంటనే రెండుసార్లు రావడాన్ని బట్టి, ఈ వాక్యం యొక్క ప్రాధాన్యతను గుర్తించాలి. అయితే అరబీ గ్రామర్ ప్రకారంగా ఈ వాక్యాలను విశ్లేషిస్తే ఓ ఆసక్తికరమైన విషయం తెలుస్తుంది.

'అల్' అంటే అరబీ భాషలో డెఫినిట్ ఆర్టికల్ (the). ఈ 'అల్' గనుక నామవాచకానికి (nounకి) ముందు తగిలించి, మరలా అదే నామవాచకాన్ని మరొకసారి రిపీట్ చేస్తే, అప్పుడు అది ఒకటే అవుతుంది. అయితే అదే నామవాచకం 'అల్' అనే పదం లేకుండా రెండుసార్లు వస్తే, అప్పుడు ఆ రెండూ ఒకటి కాదు. వాటిని రెండింటిగా తీసుకోవాలి.

ఉదాహరణకు 'కష్టం' అనే నామవాచక పదం రెండుసార్లు వచ్చినప్పుడు, అవి రెండు రకాల కష్టాలను తెలియజేయవచ్చు లేదా ఒకే కష్టాన్ని తెలియజేయవచ్చు. వీటికి రెండుసార్లు కూడా 'అల్' తగిలిస్తే ఒకే కష్టం అవుతుంది. 'అల్' తగిలించకపోతే వేర్వేరు కష్టాలను సూచిస్తుంది.

పై అరబీ వాక్యాలలోని రెండు ముఖ్యమైన పదాలు :

1. عُسر (ఉస్ర్) = కష్టం   2. يُسرً (యుస్ర్) = సుఖం

పై రెండు వాక్యాలలో 'ఉస్ర్' (కష్టం) అనే పదం రెండుసార్లు రిపీట్ అయింది. అంతేకాకుండా రెండు పదాల ముందు కూడా 'అల్' ఉంది (الْعُسر). కాబట్టి ఇక్కడ ఆ వాక్యాలు ఒక కష్టాన్నే సూచిస్తున్నాయని తెలుస్తుంది.

అదే విధంగా 'యుస్ర్' (సుఖం) కూడా రెండుసార్లు రిపీట్ అయింది. కాని ఈ రెండు పదాల ముందు 'అల్' లేదు. కాబట్టి ఈ వాక్యాలలో చెప్పిన 'సుఖం' ఒకటి కాదు. ఈ సుఖాలు వేర్వేరు అని మరియు అవి ఒకటి కంటే ఎక్కువే అని తెలుసుకోవాలి.

అంటే **కష్టం ఒకటేగాని సుఖాలు మాత్రం రెండు.** అంటే దీనర్థం ఒక కష్టానికి ఖచ్చితంగా రెండు రెట్లే సుఖం పొందుతామని కాదు. పడిన కష్టం కంటే ఎక్కువ సుఖం పొందడం జరుగుతుందని అర్థం చేసుకోవాలి.

ఈ విశ్లేషణ ద్వారా అర్థమయ్యేదేమిటంటే, ఒక కష్టానికే ఎక్కువ సుఖాలను పొందే అవకాశం కూడా ఉంది. (పై విశ్లేషణ మారిపుల్ ఖుర్‌ఆన్ ఇంగ్లీష్ అనువాదం నుండి తీసుకోవడం జరిగింది.)

హసన్ అల్-బస్రీ(రజి) ఉల్లేఖనం ప్రకారం (సహీహ్ బుఖారీ, 65. కితాబుత్తఫ్సీర్, సూరహ్ 94, సంపుటి 6) తెలిసేది ఏమిటంటే ఒకసారి ప్రవక్త(స)వారు తన ఇంటి నుండి సంతోష స్థితిలో బయటకి వచ్చి ఈ ఆయత్ గురించి సంతోషకరమైన వార్తను తన అనుచరులకు తెలియజేశారు. అదేమిటంటే **"ఒక కష్టం రెట్టింపు సుఖాన్ని జయించ లేదు"** అంటే ఒక కష్టం, రెండు సుఖాల కంటే తక్కువే ఉంటుంది. పడిన కష్టంతో పోలిస్తే సుఖమే ఎక్కువ.

ప్రవక్త(స)వారు మరియు ఆయన(స) అనుచరులు అనుభవించిన కష్టాలకు మించి వారు తరువాతి కాలంలో ఎన్నిరెట్లు సుఖాలను పొందారో చరిత్ర తెలియజేస్తుంది.

**కష్టాలతో పాటు సుఖాలు ఉంటాయని చెప్పింది మరెవరో కాదు, మన సృష్టికర్తే. ఇక సందేహ పడటానికి అవకాశమే లేదు. అల్లాహ్‌ను విశ్వసించిన వారు కష్టాలలో ఉన్నప్పుడు, వారికి సుఖాలు సమీపంలోనే ఉన్నాయని తెలుసుకుంటారు.**

ఎన్నడూ అబద్ధమాడని వ్యక్తిగా, పరోపకారిగా, మానవోత్తముడిగా మక్కా నగరంలో అందరికీ సుపరిచితమైన ముహమ్మద్(స)వారిని **'ఆరాధ్యుడు**

**ఒక్కడే'** అనే సత్యాన్ని పలికినందుకు తీవ్రహింసలకు గురిచేశారు. దాదాపు 13 సంవత్సరాలపాటు ఈ హింసను భరిస్తూ, సహనంతో సత్యబోధ చేసిన ముహమ్మద్(స)వారికి తినడానికి తిండి దొరకని విధంగా 3 సంవత్సరాల పాటు బంధువులతో సహా వెలివేసినా కూడా ఓర్చుకున్న ముహమ్మద్(స), చివరకు ఖాళీ చేతులతో మక్కా వదిలి మదీనా నగరానికి వలస వెళ్ళవలసి వచ్చింది. కాని కొన్ని సంవత్సరాలకే 'మక్కా' ఆయన వశమైంది. సువిశాల అరేబియా భూభాగమంతా ఆయన అధికారం లోకి వచ్చింది.

మక్కాలో ఇస్లామ్ ప్రారంభకాలంలో కొద్దిమంది ముస్లిములు రహస్యంగా ఇంటిలో నమాజ్ చేసుకునే పరిస్థితి నుండి తండోప తండాలుగా ప్రజలు ఇస్లామ్ స్వీకరించే పరిస్థితిని అల్లాహ్ కలుగజేశారు. విశ్వాసులకు విజయాన్ని ప్రసాదించారు.

ఇది చరిత్ర చెప్పిన నిజం. నేటికీ సజీవమైన నిజం. భవిష్యత్తులో కూడా, ఇన్షా అల్లాహ్, ఇదే జరుగుతుంది.

హదీస్‌లపై కాస్త అవగాహన కలిగిన వారికి 'అబూహురైరా' (రజి) వారి గురించి బాగా తెలుస్తుంది. ఈయన ప్రవక్త(స)వారి అనుచరులలో అత్యధిక హదీస్‌లను (దాదాపు 5 వేలకు పైగా) అందించినవారు. ఈయన మొదట్లో తినడానికి తిండిలేక ఆకలితో సొమ్మసిల్లి పడిపోయేవారు. ఎంతో ఆత్మాభిమానం గలవారు. ఈయన గురించి క్లుప్తంగా తెలియజేసే హదీస్‌ను దిగువన అందిస్తున్నాము.

---

حـدَّثَنَا سُلَيمَانُ بنُ حَرْبٍ : حدَّثَنا حَمَّادٌ، عَنْ أيُّوب، عَنْ مُـحَـمَّـدٍ قال : كنَّا عِنْدَ أَبِي هُرَيْرَةَ وَعَلَيْهِ ثَوْبَانِ مُمَشَّقانِ مِـنْ كَتَّانٍ، فَتَمَخَّطَ فقَالَ : بَخٍ بَخٍ، أَبُو هُرَيْرَةَ يَتمَخَّطُ فِي الْـكَتَّـانِ؟ لَقَدْ رَأَيْتُنِي و إنِّي لَأَخِرُّ فِيمَا بَينَ مِنبَرِ رَسُولِ اللهِ ﷺ إلـى حُجْرَةِ عَائِشَةَ مَغْشِيّاً عَلَيَّ، فَيَجِيءُ الْجَائِي فَيَضَعُ رِجْلَهُ عَلى عُنُقِي ويُرَى أَنِّي مَجْنُونٌ وَمَا بِيْ جُنُون، مَا بِي إِلَّا الْجُوعُ.

ముహమ్మద్(రజి) ఉల్లేఖనం : ఎర్రమట్టితో రంగు అద్దిన రెండు నేత వస్త్రాలను ధరించియున్న అబూహురైరా(రజి)తో మేము ఉండగా, ఆయన తన వస్త్రంతో ముక్కు శుభ్రం చేసుకుంటూ చెప్పారు - అమోఘం! అమోఘం! అబూహురైరా నేత బట్టతో ముక్కు శుభ్రం చేసుకుంటున్నాడు. ఒకానొక కాలం వచ్చింది. (అప్పుడు) నేను అల్లాహ్ సందేశహరుల(స) యొక్క ఉపన్యాస పీఠము (మింబర్)నకు మరియు ఆయిషా(రజి)వారి కుటీరమునకు మధ్య స్పృహ లేకుండా పడి ఉన్నప్పుడు దారిన పోయేవాడు వచ్చి, నన్ను ఓ పిచ్చివాడనుకుని నా మెడపై అతని పాదాన్ని ఉంచేవాడు. కాని నిజానికి నాకు పిచ్చి ఏమీ లేదు. నేను పడిపోయింది మరిదేనితోనూ కాదు ఆకలితో.

**(సహీహ్ బుఖారీ, హదీస్ నెం. 7324, సంపుటి 9, పుస్తకం 96, అధ్యాయం 16)**

**అల్లాహ్ పేరుతో అబూహురైరా(రజి) కష్టాలను సహించారు. సహనం వహించారు. తరువాతి కాలంలో విజయాలను, సుఖాలను పొందారు. కష్టాలను తొలగించి సుఖాలను కలుగజేసేది అల్లాహ్‌యే! అయితే కష్టాలతో బాధపడుతున్న సోదరునిపై గాని, సోదరిపైగాని మన బాధ్యత ఉందా? లేదా? దీనికి సమాధానంగా క్రింది హదీస్‌ను చెప్పుకోవచ్చు.**

حَـدَّثَـنَا يَحْيَى ابْنُ يَحْيَىٰ التَّمِيمِيُّ وَأَبُو بَكْرِ بْنُ أَبِي شَيْبَةَ وَمُحَمَّدُ بْنُ الْـعَلاءِ الْهَـمْـدَانِـيُّ ـ وَالـلَّفْظُ لِيَحْيَىٰ ـ قَالَ يَحْيَىٰ : أَخْبَرَنا، وَقَالَ الْآخَرَانِ : حَدَّثَنَا ـ أَبُو مُعَاوِيَةَ عَنِ الْأَعْمَشِ، عَنْ أَبِي صَالِحٍ، عَنْ أَبِي هُـرَيْـرَةَ قَالَ : قَالَ رَسُولُ اللهِ ﷺ : ((مَـنْ نَـفَّـسَ عَنْ مُؤْمِنٍ كُرْبَةً مِنْ كُـرَبِ الـدُّنْيَـا نَـفَّـسَ اللهُ عَنْهُ كُرْبَةً مِنْ كُرَبِ يَوْمِ الْقِيَامَةِ، وَمَنْ يَسَّرَ عَـلَىٰ مُعْسِرٍ يَسَّرَ اللهُ عَلَيْهِ فِي الدُّنْيَا وَالْآخِرَةِ، وَمَنْ سَتَرَ مُسْلِمًا سَتَرَهُ اللهُ فِـي الدُّنْيَا وَالْآخِرَةِ، وَاللهُ فِـي عَـوْنِ الْـعَبْدِ مَا كَانَ الْعَبْدُ فِي عَوْنِ أَخِيهِ، وَمَـنْ سَـلَكَ طَرِيقًا يَلْتَمِسُ فِيهِ عِلْمًا سَهَّلَ اللهُ لَهُ بِهِ طَرِيقًا إِلَىٰ الْـجَـنَّةِ، وَمَـا اجْتَـمَـعَ قَوْمٌ فِي بَيْتٍ مِنْ بُيُوتِ اللهِ، يَتْلُونَ كِتَابَ اللهِ، وَيَتَـدَارَسُونَهُ بَيْنَهُمْ، إِلَّا نَزَلَتْ عَلَيْهِمُ السَّكِينَةُ، وَ غَشِيَتْهُمُ الرَّحْمَةُ وَ حَـفَّتْهُـمُ الْـمَلَائِكَةُ، وَذَكَرَهُمُ اللهُ فِيمَنْ، عِنْدَهُ، وَمَنْ بَطَّأَ بِهِ عَمَلُهُ لَمْ يُسْرِعْ بِهِ نَسَبُهُ)).

అబూహురైరా(రజి) ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) ఇలా చెప్పారు ఎవరైతే ప్రాపంచిక బాధలనుండి ఓ సోదరుని బాధను తగ్గిస్తారో, పునరుత్థాన దినపు బాధల నుండి అతని బాధను అల్లాహ్ తగ్గిస్తాడు మరియు కష్టాలతో ఉన్నవానికి ఎవరైతే ఉపశమనం కలిగిస్తారో అతనికి అల్లాహ్ ఇహలోకంలో మరియు పరలోకంలో విషయాలను సులభతరం చేస్తారు. మరియు ఎవరైతే ఓ ముస్లిమ్‌వి(పొరపాట్లను) దాస్తారో, అతను ఈ ప్రపంచంలో చేసిన పొరపాట్లను ఇహలోకంలో మరియు పరలోకంలో అల్లాహ్ దాస్తారు. అల్లాహ్ తన దాసునికి వెన్నంటే ఉంటాడు, ఆ దాసుడు తన సోదరునికి వెన్నంటి ఉన్నంత కాలం. మరియు ఎవరైతే జ్ఞానాన్ని వెతుకుతూ (అంటే జ్ఞానాన్ని పొందడానికి) బాటలో నడుస్తారో, అల్లాహ్ అతనిని స్వర్గానికి గొనిపోయే మార్గాన్ని సులభతరం చేస్తారు. మరియు ఏ వ్యక్తులైతే అల్లాహ్ గృహాల (మస్‌జిద్‌ల)లోని ఓ గృహం (మస్‌జిద్)లో చేరి, అల్లాహ్ గ్రంథాన్ని చదువుతూ మరియు ఒకరికొకరు బోధిస్తూ ఉంటారో, వారిపైకి **ప్రశాంతత** దింపబడుతుంది. మరియు వారిని **కరుణ** కప్పివేస్తుంది. మరియు **దైవదూతలు** వారి చుట్టూ చేరతారు మరియు వారి గురించి అల్లాహ్ తనకి సమీప సమక్షంలోనున్న వారికి చెబుతారు మరియు ఎవరైతే మంచి పనులు చేయడానికి బద్ధకిస్తారో, అతని పతనం అతనిని ముందుకు పోనివ్వదు

**(సహీహ్ ముస్లిమ్, నెం. 6853, పుస్తకం 48, సంపుటి 7)**

ఒక విశ్వాసికి కష్టమొచ్చినా, ఆందోళనకి గురియైనా, ఆఖరికి అతనికి ముల్లు గుచ్చుకున్నా కూడా, విశ్వాసి చేసిన పాపాలలో కొన్నింటిని అల్లాహుతాలా తొలగిస్తారని 'శాంతిబాట' 4వ సంచికలో చెప్పుకున్నాము.

అయితే ఓ సోదరి కష్టాన్ని గాని, ఓ సోదరుని కష్టాన్నిగాని తగ్గించడానికి అల్లాహ్ పేరుతో మనం ప్రయత్నిస్తే, మన ద్వారా అల్లాహ్ ఆ పని జరిపిస్తే, కష్టాన్ని పొందినవానికే కాకుండా, ఆ కష్టాన్ని తగ్గించడానికి కృషి చేసిన సోదరునికి కూడా పరలోకంలో మేలు జరుగుతుంది.

అందుకే విశ్వాసులంతా ఐక్యంగా ఉండి, ఒకరి కష్టాలను మరొకరు తొలగించడానికి ప్రయత్నిస్తే పరలోకంలో లాభపడతారు.

కష్టాలు ఇహలోకంలో సుఖాలనే కాకుండా, పరలోకంలో కూడా ప్రయోజనాన్ని కలిగిస్తాయి. అందుకే అల్లాహ్‌పై పరిపూర్ణ విశ్వాసం గల వారికి కష్టాలు మరియు సుఖాలు ఒకే విధంగా కనిపిస్తాయి.

ఏ విశ్వాసిపైనయినా అల్లాహ్ అతను మోయలేనంత బరువును మోపడు. **అల్లాహ్ అనంత కరుణామయుడు.** విశ్వాసులకు ఎన్నో విధాల అల్లాహుతాలా పరీక్షకు గురిచేస్తారని చదివి, కొందరు అమాయకులు కష్టాలు ఎదుర్కోవలసి వస్తుందని భయపడటాన్ని చూశాము.

చదువుమీద ఆసక్తి ఉండి, బాగా చదువుకున్నవాడికి 'పరీక్ష' అంటే భయం ఉండదు. అలాగే అల్లాహ్‌పై విశ్వాసం ఉన్నవారికి భయపడ వలసిన అవసరం ఎంతమాత్రం లేదు. పరీక్ష అనేది తప్పనిసరిగా ఉండాలి. అది మనకు మరింత మనోబలాన్ని ఇస్తుంది.

10వ తరగతి చదివే వానికి, ఆ తరగతి సిలబస్‌తోనే పరీక్ష పేపర్ ఇస్తారు గాని, వారికి ఇంజినీరింగ్ విద్యార్థులు వ్రాయవలసిన పరీక్ష పేపరును ఇవ్వరు కదా! కాబట్టి ఎంత చెట్టుకు అంతగాలి అన్నట్లు, ఎంత విశ్వాసం ఉంటే అంత పరీక్ష ఉంటుంది. బాగా కష్టపడి చదివిన వాడికి నూటికి నూరు మార్కులు వచ్చి ప్రథమ స్థానాన్ని పొందుతాడు. కొద్దిగా తక్కువ కష్టపడిన వానికి 90 రావచ్చు. మరికొందరికి 80, .... ఇలా వారి స్థాయి ఏమిటో, వారికి పెట్టిన పరీక్షే తెలియజేస్తుంది.

వారు సాధించిన ఫలితాలు, వారి ఆత్మస్థైర్యాన్ని పెంచి ఇంకా ఉన్నత స్థానానికి చేరుకోవడానికి కష్టపడేలా ప్రోత్సహిస్తాయి. కాబట్టి ఉన్నత శిఖరాలకు చేరాలనుకునేవాడు పరీక్షలను తప్పక ఆహ్వానిస్తాడు.

అల్లాహ్‌పై పరిపూర్ణ విశ్వాసముంటే కష్టంలోనూ, సుఖంలోనూ సంతోషంగా జీవించవచ్చు. **అల్లాహ్ అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు.**

ఆయన పెట్టే పరీక్షలలో, తన దాసుడు సఫలం అయ్యేలా సహాయం చేసేది కూడా అల్లాహ్‌యే. కాబట్టి కష్టాలను చూచి భయపడకండి. అల్లాహ్‌ను వేడుకోండి. సమీపంలోనే సుఖాలున్నాయని తెలుసుకోండి.

## హదీస్‌లపై అపోహలు 5

**విశ్వాసుల మాతృమూర్తి ఆయిషా(రజి)వారు కాపురానికి వెళ్ళే సమయానికి ఆమె వయస్సు 9 సంవత్సరాలని సహీహ్ బుఖారీ హదీస్ వలన తెలుస్తుంది. కాని ఓ సోదరుడు ఆ వయస్సును 18 అని నిరూపించడం కోసం 24 ఆధారాలను చూపించారు. ఈయన హాఫిజ్ మరియు ఆలిమ్ అని అతని పుస్తకాన్ని బట్టి తెలుస్తుంది. ముహమ్మద్(స) వారిపై బురద చల్లుతున్నారని, వారి నోటిని మూయాలనే సంకల్పంతో, వివేకంతో సమాధానం చెప్పడానికి బదులు, ఈ ఆలిమ్‌గారు ఆవేశానికి లోనయ్యారు. ఆవేశం ఆలోచనను చంపేస్తుంది కదా!**

**ఒక అపనిందను తొలగించాలనే ప్రయత్నంలో ఈ విద్వాంసుడు హదీస్ గ్రంథాలపై బురద చల్లడానికి ప్రయత్నించాడనే విషయాన్ని గమనించ లేకపోయాడు. ఈయన ఉర్దూలో వ్రాసిన పుస్తకాన్ని అనువదించి, తెలుగులో ప్రచురించారు. ఇప్పటికే వేల కాపీలు అమ్ముడయ్యాయి. ఈ పుస్తకం చదివిన వారు హదీస్ గ్రంథాలపై అనుమానపడే అవకాశముంది. అందుకని పత్రికాముఖంగా ఆ పుస్తకంపై సద్విమర్శ చేయవలసి వచ్చింది. ఆయన ఆధారాలుగా చూపినవి కేవలం అతని అనుమానాలేనని ఆ పుస్తకాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశాక తెలిసింది.**

**అతడు చూపిన 7 ఆధారాలను తప్పని రుజువు చేస్తూ గత సంచికలలో వివరించడం జరిగింది. 8వ ఆధారంపై ఈ సంచికలో వివరిస్తున్నాము.**

### ఆధారం - 8:

**ఉమ్ముల్ మోమినీన్ సెలవిచ్చారు : " నాకు బుద్ధి తెలిసినప్పటినుండి నా తల్లిదండ్రుల్ని ఇస్లామ్ ధర్మంలో చూశాను. దైవప్రవక్త(స) ఉదయం, సాయంత్రం మా ఇంటికి రాని రోజంటూ లేదు"**

ఒక హదీస్‌ను తప్పు అని నిరూపించడానికి 24 ఆధారాలను చూపినట్లు రచయిత భావిస్తున్నాడేగాని, ఆధారాల గురించి మాట్లాడేటప్పుడు ఆ హదీస్‌ల ప్రామాణికత, వాటి నంబర్లు మొ॥వి స్పష్టంగా చెప్పాలి. దీనిని బట్టి రచయితకు సరియైన విధానం తెలియదని స్పష్టమౌతుంది.

పై వాక్యాలు చెప్పిన తరువాత అబూబకర్ సిద్దీఖ్(రజి)వారు అబిసీనియాకు చేసిన హిజ్రత్ ప్రయత్నం గురించి ఓ సంఘటనను రచయిత వివరించారు గాని, ఆ సంఘటన ఈ ఆధారం కొరకు ఏ విధంగానూ ఉపయోగపడలేదు. ఆ సంఘటనను ఆయిషా(రజి) కళ్ళారా చూసినట్లు వ్రాశారుగాని, స్పష్టమైన ఆధారాన్ని చూపలేదు. ఆ వాదనలో విషయం కూడా స్పష్టంగా లేదు.

రచయిత ఇలా అంటున్నారు :

**"ఈ హదీస్‌లో ప్రవక్త పదవి లభించినప్పుడు నేను (యుక్త వయస్సు) బుద్దీ జ్ఞానం ఎరిగిన వయసులో ఉన్నానని, ఆ సమయంలో జరుగుతున్నదంతా నా కళ్ళ ఎదుట జరుగుతుంది అని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తున్నారు. కాని మన ఉలమాలు, హుష్షామ్ ఉల్లేఖనం ద్వారా రుజువు అవుతుంది కాబట్టి, కాపురానికి వచ్చినప్పుడు ఆమె వయస్సు తొమ్మిదేళ్ళు. కనుక ఈ సంఘటనల్ని ఉమ్ముల్ మోమినీన్ ఇతరుల నుండి విని ఉండవచ్చు అని అంటున్నారు"**

రచయిత తెలిపిన హదీస్‌లో 'యుక్త వయస్సు, బుద్దీ జ్ఞానం' అనే పదాలు ఎక్కడ ఉన్నాయి? లేనివి ఉన్నట్లు ఊహించి చెబుతున్నారు: 'బుద్ధి తెలిసినప్పటినుండి' అంటే 'తనకు ఊహ తెలిసి నప్పటినుండి' అనే అర్థాన్నిస్తుంది. కాని యుక్త వయస్సు అని ఎలా వ్రాయగలిగారు. నిర్ద్వంద్వంగా ప్రకటించడ మేమిటి?

రచయిత యొక్క ఊహే ఇదంతా. స్పష్టంగా ఉంటేనే 'నిర్ద్వంద్వంగా' వంటి పదాలు వాడాలి. ప్రెజెంటేషన్‌లో స్పష్టత అస్సలు లేదు. వాదనలో కూడా అర్థం లేదు.

రచయిత ఇంకనూ ఇలా చెబుతున్నారు :

**"ఈ సంభాషణ యావత్తూ, ప్రవక్త పదవి నాటికి ఉమ్ముల్ మోమినీన్ ఆయిషా(రజి) ఒక స్పృహ కలిగిన బాలిక అంటే కనీసం ఆరేళ్ళ బాలిక. తన ఇంటికి ఎవరు వచ్చి పోతున్నారో, తల్లిదండ్రులు మక్కా వారికి భిన్నంగా ఏమి చేస్తున్నారో గుర్తుంచుకోగల వయస్సు గలది.ఈ వయస్సులోని పిల్లలు ప్రతీ విషయాన్ని అర్థం చేసుకుని, ఇలా ఎందుకు అవుతుందీ, ఎలా అవుతుందీ అని ఆరాతీస్తారు"**

పై విధంగా అడ్డదిడ్డంగా వాదిస్తూ కాపురానికి వచ్చేనాటికి ఆమె వయస్సు పందొమ్మిది సంవత్సరాలు ఉండవచ్చని చెబుతున్న రచయితకు, హదీస్‌లపై గాని, ప్రాపంచిక జ్ఞానంపైగాని సరియైన అవగాహన లేదనిపిస్తుంది. కోర్సు పూర్తి చేసుకుని పాసయ్యి ఆలిమ్ అయివుండవచ్చుగాని, ఇలాంటి వాదనలకు అతనికి కనీస అర్హత లేదని అతను వ్రాసిన విధానమే తెలియజేస్తుంది.

తన తల్లిదండ్రులు నమాజ్ చేస్తుండగా 3 సంవత్సరాల వయస్సులోనే చూసి, వారు ఇస్లాంలో ఉన్నారనుకోవడం కూడా ఆయిషా(రజి)వారికి సాధ్యమే కదా! స్పృహ కలిగిన బాలిక అంటే 6 సంవత్సరాలు అని రచయితలు భావించడం ఎంతవరకు సబబు? ఏ ప్రమాణం ద్వారా ఇలా నిర్ణయించ గలిగారు? 3 లేక 4 సంవత్సరాల పిల్లలకు స్పృహ ఉండదా?

'శాంతిబాట టీమ్'లోని ఒకరి పాపను రెండున్నర సంవత్సరాల వయస్సులో, ఓ ప్లే స్కూల్‌లో జాయిన్ చేశారు. కొన్నాళ్ళే అక్కడ ఉన్నప్పటికీ, తను ఏ ప్లేస్కూల్‌లో చదివిందో, అది ఎక్కడుందో ఇప్పటికీ చెప్పగలదు. ఆ స్థలాన్ని కూడా చూపిస్తుంది. అప్పటి పిల్లలను ఇప్పటి వారితో పోల్చడం తగునా? అయినా అరబ్బుల అమోఘ జ్ఞాపకశక్తి గురించి రచయితకు తెలియదా? వేల సంఖ్యలోని హదీస్‌లను బుఖారీ(ర) చిన్నతనంలోనే కంఠస్తం చేశారు కదా! ఈ రోజున అదే వయస్సుగల పిల్లలు ఆ విధంగా కంఠస్థం చేయగలరా?

**ఉమ్ముల్ మోమినీన్(రజి) కారణజన్మురాలు. అమోఘ తెలివితేటలు, జ్ఞాపకశక్తి ఆమెకున్నాయి. పోల్చేటప్పుడు వివేకంతో ఆలోచించాలి.**

ప్రవక్త పదవికి పూర్వం కాకుండా, ప్రవక్త పదవి వచ్చిన తరువాతనే ఆయిషా(రజి) పుట్టినా కూడా, పై హదీస్‌లో ఆమె ఉల్లేఖించిన విషయాలు కరెక్టే అవుతాయి.

## శుభవార్త

### 'ముహమ్మద్(స)వారిపై ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న దుష్ప్రచారం'

పుస్తకాన్ని ఇన్షాఅల్లాహ్ ఈ సంచిక అందిన కొన్ని వారాలకే అందించడానికి ప్రయత్నిస్తున్నాము. ఈ సంచికను పోస్ట్ చేసిన వారం, పది రోజులలో బుక్ ప్రింటింగ్ ఇన్షా అల్లాహ్ ప్రారంభమౌతుంది.

దాదాపు 200 పేజీలు కలిగిన ఈ పుస్తకం ఏదైనా కారణం వలన పోస్టల్ ద్వారా అందకపోతే, మా ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా మరోసారి పంపించలేము. పల్లెటూర్లకు తప్ప, మిగతా పట్టణాలలో కొందరు సోదరులను రిక్వెస్ట్ చేసి మా చందాదారులకు వారి చేత పుస్తకాలను అందించే ఏర్పాటు ఇన్షాఅల్లాహ్ చేస్తాము. పల్లెటూర్లకు మరియు తక్కువ చందాదారులు ఉన్న ప్రాంతాలకు మాత్రమే పోస్ట్ చేయడం జరుగుతుంది.

# తొలి పరిశోధనాత్మక

## ఇస్లామీయ మాసపత్రిక

# శాంతిబాట

## చదవండి! చదివించండి!!

**శాంతిబాట పత్రికలో ఇచ్చే ప్రతీ హదీస్‌ను ప్రామాణిక హదీస్ గ్రంథాల ద్వారా ప్రామాణికమైనదని నిర్ధారించుకున్న తరువాతనే స్వీకరించడం జరుగుతుంది.**

---

**కొన్ని విషయాలను పరిశోధించేటప్పుడు, ఎక్కువ సమయం ఆ విషయాలకు కేటాయించవలసి రావడంతో సహజంగానే ఆలస్యం జరుగుతుంది. ఈ ఆలస్యాన్ని నిర్లక్ష్యంగా భావించవద్దని మనవి చేసుకుంటున్నాము.**

---

**ఖుర్‌ఆన్ మరియు ముహమ్మద్(స)వారి బోధనల పరిమళాన్ని అందరికీ చేరవేయాలనే లక్ష్యంతో, ముస్లిముల స్వర్ణయుగ చరిత్రను, అధ్యయనం ద్వారా నిజాలను వెలికితీసి అపోహలను రూపుమాపడంలోనూ అందరినీ ఎడ్యుకేట్ చేయలనే మా సంకల్పాన్ని అర్థం చేసుకున్న పాఠకులు, స్వయంగా వారే చందాదారులను చేర్పిస్తూ, ఈ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లో వారి వంతు సహకారాన్ని వారు అందిస్తున్నారు. వారికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము. జజాకల్లాహు ఖైర్.**

**స్థలాభావం వలన రెండు శీర్షికలను ఈ సంచికలో అందించలేకపోతున్నాము**

# తిరిగి గూటికి

ప్రారంభంలో చెప్పుకున్నట్లు, దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ప్రస్తుతం అమెరికాలో ప్రతీ సంవత్సరం సగటున 20,000 మంది ఇస్లాం ధర్మంలో ప్రవేశిస్తున్నారు. మన దేశంలో, మన రాష్ట్రంలో కూడా ఈ దైవ ధర్మాన్ని చాలామంది తెలుసుకుని, ఈ ధర్మంలో ప్రవేశిస్తున్నారు. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం లాంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు లేదా నౌ ముస్లింలుగా అభిమానంతో తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో దైవధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా దైవధర్మంలోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవితంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి మరికొందరికి సమయం పడుతుంది. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకావస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది.

---

తాలిబన్ల చెరలో 11 రోజులు గడిపిన ప్రముఖ అంతర్జాతీయ మహిళా రిపోర్టర్

## YVONNE RIDLEY
## యోన్ రిడ్లీ

**సకల లోకాలకు కారుణ్యంగా పంపబడిన 'శాంతిదూత' ముహమ్మద్(స) వారిపై ఈ సోదరి తన ప్రేమను ఇలా వ్యక్తం చేశారు :**

**"మీకు తెలుసా? 5 సంవత్సరాలకు పూర్వం నేనెప్పుడూ ప్రవక్త(స)గారి గురించి వినలేదు. కాని నేడు ఆయన పేరును, ఆయన యొక్క గౌరవాన్ని, ఆయన జ్ఞాపకాలను రక్షించడానికి నా రక్తంలోని చివరబొట్టు వరకూ ఇస్తాను"**

(2006 సంవత్సరంలో లండన్‌లో జరిగిన ప్రపంచ శాంతి మరియు సమైక్యతా సమావేశంలో సోదరి చేసిన ప్రసంగం నుండి...)

**"విశ్వాసులకు దైవప్రవక్త స్వయంగా తమకంటే కూడా ముఖ్యుడు ..."** (ఖుర్'ఆన్ 33:6)

ఈ సోదరి 2003వ సంవత్సరంలో ఇస్లామ్ స్వీకరించారు. ముహమ్మద్(స)వారిపై ఈ సోదరికి ఎంత ప్రేమ ఉందో పై మాటలు తెలియజేస్తున్నాయి. మహోన్నత శీలం గల 'శాంతిదూత' ముహమ్మద్(స) వారిపై, ఆయన శీలంపై ఈ రాష్ట్రంలో బురద చల్లుతుంటే, నోరు విప్పి తమ నిరసనను కూడా తెలియజేయలేని ముస్లిమ్‌లను ఈ సోదరి మాటలు కాస్తయినా కదిలిస్తాయేమోనని ఆశిస్తున్నాము.

సోదరి రిడ్లీ 1959లో ఇంగ్లాండ్‌లో జన్మించారు. ఈమె బ్రిటిష్ జర్నలిస్ట్. యుద్ధ విషయాల రిపోర్టర్. ధైర్యశాలి. ఈమెకు చిన్నతనం నుండి జర్నలిస్ట్ కావాలని కోరిక ఉండేది. 14 సం॥ల వయస్సులో ఈమె వ్రాసిన లెటర్ న్యూకేసిల్‌లోని 'Evening Chronicle' అనే పేపర్‌లో ప్రచురితమైంది. 16 సం॥లు వయస్సు వచ్చేసరికి, యునైటెడ్ కింగ్‌డమ్‌లోని దాదాపు ప్రతీపేపర్‌కి కూడా సోదరి వ్రాశారు. జర్నలిస్ట్ కావాలని ధృడంగా నిర్ణయించుకున్నారు. 'లండన్ కాలేజ్ ఆఫ్ ప్రింటింగ్'లో జర్నలిజమ్ కోర్సు పూర్తి చేశారు.

అప్పటి నుండి 'సండే టైమ్స్', 'ఇండిపెండెంట్ ఆన్ సండే', 'ద అబ్జర్వర్', 'ద మిర్రర్' మొదలైన వాటి కొరకు వ్రాసేవారు. Wales on Sundayకి డిప్యూటీ ఎడిటర్‌గా కూడా కొంతకాలం పనిచేశారు. ఆ తరువాత Sunday Express టేబ్లాయిడ్‌లో జాయిన్ అయ్యారు. అమెరికాలో 9/11 దాడి తరువాత వారు ఈమెను ఆఫ్ఘనిస్తాన్ పంపారు.

అప్పటికి ఆమె 'సండే ఎక్స్‌ప్రెస్'కి చీఫ్ రిపోర్టర్. ఈమె BBC టివి మరియు రేడియో, CNN, ITN మరియు కార్ల్‌టన్ టి.వి.లో బ్రాడ్‌కాస్టర్‌గా, కొన్ని ప్రోగ్రాములకు నిర్మాతగా మరియు సమర్పకురాలిగా పనిచేస్తూ ఆఫ్ఘనిస్తాన్, ఇరాఖ్ మరియు పాలస్తీనాలోని గాజా మరియు వెస్ట్ బ్యాంక్ ఏరియాల్లో ప్రయాణించారు.

**Women in Journalism** స్థాపక సభ్యురాలు.

ఈమె తన తీరిక సమయంలో UK అంతటా మరియు ఎన్నో దేశాలలో పర్యటిస్తూ - 'శాంతి'ని ప్రోత్సహించడం మరియు యుద్ధాలకి వ్యతిరేకంగా సందేశాన్నిచ్చేవారు. ఈమె రెండు పుస్తకాలను వ్రాశారు. ''ఇన్ ది హేండ్స్ ఆఫ్ ది తాలిబన్'' (తాలిబన్ల చేతులలో) మరియు 'టికెట్ టు పారడైజ్' (స్వర్గానికి టికెట్). ఒసామా బిన్ లాడెన్ జీవితంపై పుస్తకం వ్రాయడానికి పరిశోధన జరుపుతున్నారని తెలిసింది.

ఆమె మొదటి భర్త PLO ఆఫీసర్, దావూద్ జారేరా. వారికి 1992లో డైజీ అనే కూతురు పుట్టింది.

ఈమె గురించి ప్రపంచమంతా తెలిసింది ఎప్పుడంటే 28 సెప్టెంబర్ 2001 తేదీన.

''**సండే ఎక్స్‌ప్రెస్** కొరకు వర్క్ చేస్తున్నప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌లో తాలిబన్లు ఈమెను పట్టుకున్నారు. ఆఫ్ఘనిస్తాన్‌లో ప్రవేశించడానికి వీసా కొరకు అప్లై చేస్తే, ప్రతీసారి తిరస్కరించేవారు. అంతకు పూర్వం BBC రిపోర్టర్ 'జాన్ సిమ్‌సన్' బురఖాలో సరిహద్దు దాటి ఆఫ్ఘనిస్తాన్‌లోకి ఎలా ప్రవేశించాడో, అలాగే ప్రవేశించాలని ఈ సోదరి కూడా నిర్ణయించుకున్నారు.

ఆఫ్ఘన్ శరణార్థులైన నగీబుల్లాహ్ ముహమ్మద్ మరియు పాకిస్తాని జాన్ అలీ, ఆమెకు గైడ్స్‌గా వ్యవహరించారు. ఓ ఆఫ్ఘన్ స్త్రీ వలే డ్రెస్ చేసుకుని సరిహద్దు దాటి ఆఫ్ఘనిస్తాన్‌లో అడుగుపెట్టారు. అయితే ఆమె అక్కడి చట్టానికి వ్యతిరేకంగా ఫొటోలు తీస్తుండగా పట్టుబడ్డారు.

ఆ తరువాత వీరు సెక్యూరిటీ బలగాలకు అప్పగించబడ్డారు. గూఢచర్యం అభియోగంపై దర్యాప్తు చేయడానికి జలాలాబాద్‌కు తీసుకువెళ్ళారు. అంతకు కొన్ని రోజుల పూర్వమే తాలిబన్లు విదేశీయులనందరినీ ఆఫ్ఘనిస్తాన్ విడిచి వెళ్ళిపొమ్మన్నారు. అంతేకాకుండా జర్నలిస్ట్‌లకు వీసాలు కూడా ఇవ్వబోమని చెప్పడం జరిగింది.

ఎవరైనా శాటిలైట్ ఫోన్‌ను ఉపయోగిస్తే ఉరి తీస్తామని హెచ్చరించారు.

తాలిబన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి ముల్లా అబ్దుర్రహ్మాన్ జహీద్ 'ఆఫ్ఘాన్ ఇస్లామిక్ ప్రెస్'కు తెలియజేసిన దాని ప్రకారం ఆమె దేశంలోకి చట్ట వ్యతిరేకంగా ప్రవేశించినందుకు ప్రాసిక్యూట్ చేయబడుతుందని. ఆమె బ్రిటిష్ SASకి చెందిన మిలటరీ స్పెషల్ ఫోర్సెస్‌లో సభ్యురాలై ఉండవచ్చని తాలిబన్ సమాచారశాఖా మంత్రి ఖుద్రతుల్లాహ్ జమాల్ అనుమానం వ్యక్తం చేశారు.

ఇతర పాశ్చాత్యులతో కలిపి ఆమెను హోస్టేజ్‌గా ఉంచమని సూచించారు.

ఆమెను త్వరగా విడుదల చేసే విషయంలో పాకిస్తాన్‌లోని బ్రిటిష్ హై కమీషనర్, ఇస్లామాబాద్‌లోని తాలిబన్ రాయబారి ద్వారా తమ రాజీ ప్రయత్నాలు ప్రారంభించారు.

అయితే తాలిబన్లు మానవతా ధృక్పథంతో ఆమెను విడుదల చేయడం జరిగింది.

తాలిబన్ల కస్టడీలో ఉన్నంతకాలం అక్కడ ఆమె నిరాహార దీక్ష చేశారు. కాని ఆమెపై భౌతికంగా ఏ విధమైన దాడి/హాని జరుగలేదని సోదరి చెప్పారు.

విడుదలయ్యాక ఆమె చెబుతున్నారు, వారి చెరలో ఉన్నప్పుడు ఒక మహిళ ఆమెను ఇస్లామ్ స్వీకరించమని కోరారు. ఆమె తిరస్కరించారు. అయినప్పటికీ విడుదల అయ్యాక ఖుర్ఆన్ చదువుతానని ఆమెకు 'సోదరి రిడ్లీ' మాట ఇచ్చారు.

**ఒక స్త్రీ పట్ల తాలిబన్లు వ్యవహరించిన విధానాన్ని చూసాక, ఆమెకు ఖుర్ఆన్ చదవాలనిపించింది.**

చదివారు. అది ఆమె జీవితాన్నే మార్చేసింది.

**ఇస్లామ్** యొక్క పవిత్ర గ్రంథమైన ఖుర్ఆన్‌ను స్త్రీల కొరకు **'మేగ్నా కార్టా'** వంటిదని ఆమె వర్ణించారు.

(మేగ్నా కార్టా అంటే 1215లో జాన్ రాజునుండి ఇంగ్లీష్‌వారు సాధించిన రాజకీయ స్వాతంత్ర్య మహాపత్రం)

**ఇస్లాం స్త్రీకి స్వాతంత్ర్య మిచ్చిందని సోదరి తెలుసుకున్నారు. 2003వ సంవత్సరం వేసవి కాలంలో ఆమె ఇస్లాం స్వీకరించారు.**

తాలిబన్ల వద్ద 11 రోజుల పాటు చెరలో ఉన్నప్పుడు భౌతికంగా ఆమెపై ఎటువంటి అన్యాయానికి పూనుకోలేదు. అమెరికా కస్టడీలో ఉన్న 'ఆఫియా సిద్దీఖీ' వంటి ముస్లిమ్ మహిళా ఖైదీలతో అమెరికన్లు వ్యవహరించిన విధానంతో తనను పోల్చుకుని, మహిళా ఖైదీలతో తాలిబన్లు వ్యవహరించిన తీరును ''సోదరి రిడ్లీ'' మెచ్చుకున్నారు.

తాలిబన్ల కస్టడీలో ఉన్నప్పుడు, ఈ సోదరి లోపలి నుండి తాళం వేసుకోవడానికి తను ఉండే గది (సెల్) యొక్క తాళం చెవిని (key)

కూడా ఆమెకే ఇచ్చివేశారు, ఆమె లోపలి నుండి తాళం వేసుకోవడానికి. ఆమె ఏకాంతానికి భంగం లేకుండా ఆమెను స్వేచ్ఛగా ఉంచడం జరిగింది.

ఇస్లామ్ వైపు ఆమె జరిపిన పయనాన్ని 2004లో BBC వారి యొక్క రెలీజియన్ సైట్‌లో వివరించారు.

ఆఫ్ఘనిస్తాన్‌లో జరిపే యుద్ధంపై ప్రజల మద్దతు పెంచుకోవడానికి ఇజ్రాయేలీ సీక్రెట్ సర్వీస్ (మొసాద్) డిశంబర్ 2001లో ఈ సోదరిని చంపడానికి పథకం పన్నారని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

**ప్రస్తుతం పాశ్చాత్య దేశాలపై తీవ్ర విమర్శలు చేసే విమర్శకురాలిగా ఈమెకు మంచి పేరు ఉంది.**

"**How I came to love the veil**" వ్యాసంలో సోదరి మాటలలో కొన్నింటిని ఇక్కడ యధాతధంగా అందిస్తున్నాము.

> **"ఇస్లామ్‌లో స్త్రీలు అణిచివేయబడుతున్నారని చెబుతూ, ఆ పరదా వెనుక ఉన్న ముస్లిమ్ స్త్రీతో కనీసం ఓ మాట కూడా మాట్లాడకుండానే, వ్రాసేయడమంటే రాజకీయ నాయకులకు మరియు జర్నలిస్ట్‌లకు చాలా ఇష్టం".**

**"1400 సం॥ల క్రితం స్థాపించిన ఇస్లామీయ నిర్మాణంలో ముస్లిమ్ మహిళలు ఎలా రక్షింపబడుతున్నారో, ఎలా గౌరవించబడుతున్నారో నిజంగా వారి (రాజకీయ నాయకులకు, జర్నలిస్ట్‌ల)కేమీ తెలియదు".**

"మహిళలపై హింస అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న విషయమే! హింసకు పాల్పడే పురుషులు ఒక ప్రత్యేక మతం నుండో, సాంస్కృతిక వర్గం నుండో రారు. వాస్తవమేమిటంటే, ప్రపంచంలోని ప్రతీ ముగ్గురు మహిళలలో ఒక మహిళ తన జీవితంలో దెబ్బలు తినడం, బలాత్కరించబడటం లేదా అవమానపడటం జరుగుతుంది."

"మహిళలపై హింస అనేది మతాలకు, ఐశ్వర్యానికి, స్థాయికి, శరీర రంగు మరియు నాగరికతకు అతీతమైన విషయం."

"ఏమైనాగాని, ప్రపంచంలో ఇస్లామ్ సీన్‌లోకి వచ్చేవరకూ, మహిళలను తక్కువస్థాయి జీవులతో వ్యవహరించినట్లు వారితో వ్యవహరించారు. నిజానికి ఈ పాశ్చాత్య దేశాలలో మన మహిళలకు ఇంకనూ సమస్య ఉంది. ఎందుకంటే ఇక్కడి పురుషులు తామే అధికులమని భావిస్తున్నారు. ఉద్యోగాల ప్రమోషన్లలోగాని, జీతాలలో గాని ఇది స్పష్టంగా కనిపిస్తూనే ఉంది."

"ఎక్కడైతే సెక్స్‌పరమైన బానిసత్వం పెరిగిందో, ఎక్కడైతే స్త్రీల శరీరాలతో ఎడ్వర్‌టైజ్‌మెంట్ ప్రపంచంలో వ్యాపారం చేయబడుతుందో అక్కడ పాశ్చాత్య మహిళలను ఇంకా వర్తకపు సరుకులుగానే చూస్తున్నారు." సోదరి పాశ్చాత్య సమాజం గురించి ఇలా చెబుతున్నారు:

"ఇది ఎలాంటి సమాజమంటే ఇక్కడ స్త్రీలపై మానభంగం, సెక్స్ పరమైన దౌర్జన్యం, హింస అనేది ముఖ్యాంశం. ఇదెలాంటి సొసైటీ అంటే **ఇక్కడ స్త్రీ, పురుషుల మధ్య సమానత్వమనేది ఓ భ్రమ.** ఇది ఎటువంటి సమాజమంటే ఇక్కడ స్త్రీల యొక్క అధికారం, ప్రభావం సాధారణంగా వారి యొక్క ఎద సైజుల మీద ఆధారపడి ఉంటుంది".

> ఒకప్పుడు బురఖాలో ఉన్న స్త్రీలను 'అణిచివేయబడిన జీవులుగా' చూసేదాన్ని. నేడు వారిని ఎన్నో రకాల నైపుణ్యాన్ని కలిగి ఉన్న మరియు ఎన్నో రకాల టాలెంట్స్ ఉన్న స్ట్రాంగ్ స్త్రీలుగా చూస్తున్నాను మరియు వారిలోని **సోదరీభావం**తో గనుక పాశ్చాత్య దేశాలలోని **స్త్రీ స్వాతంత్ర్యవాదా**న్ని పోలిస్తే, ఆ ఫెమినిజమ్ ప్రాధాన్యత కోల్పోయి వెలిసిపోతుంది.

బురఖా ధరించి ఆఫ్ఘనిస్తాన్‌లో సెప్టెంబర్ 2001లో చొరబడి, అరెస్ట్ కాబడిన భయంకర అనుభవం తరువాత నా ఆలోచనలు మారాయి. నా పదిరోజుల కస్టడీలో, వారు నన్ను విడుదల చేస్తే ఖుర్ఆన్ చదువుతానని మరియు ఇస్లామ్‌ను అధ్యయనం చేస్తానని వారితో ఒప్పందానికి వచ్చాను. ఏమైతేనేం అది పనిచేసింది. నేను విడుదల కాబడ్డాను. దానికి బదులుగా నా మాట నిలబెట్టుకున్నాను.

స్పష్టమైన **జీవన విధానమైన ఈ ధర్మం గురించి నా జ్ఞానాన్ని పెంచుకోవలసిన అవసరముందని తెలుసుకున్నాను.**

ఖుర్ఆన్ చదవడమంటే సులభమైన విద్యా విషయంగానే భావించాను. **స్త్రీలకు ఆధ్యాత్మిక, విద్య మరియు విలువలో సమాన హోదా ఉందని చాలా స్పష్టంగా ఈ గ్రంథంలో చెప్పడాన్ని కనుగొన్నాక నేను ఆశ్చర్యపోయాను.** పిల్లలను కనడం, వారిని పెంచడం స్త్రీ యొక్క బహుమతిగా, అది వారి యొక్క సుగుణంగా, శీలంగా ఇస్లామ్‌లో గుర్తించబడింది.

**" మేము ఇంటిని చూసుకునే వాళ్లము, ఇల్లాల్లము" అని ముస్లిమ్ మహిళలు గర్వంతో చెప్పుకోవాలి.**

70లలో స్త్రీ స్వాతంత్ర్యవాదులు వేటికోసమైతే పోరాడారో, అవన్నీ 1400 సం॥ల క్రితమే ముస్లిమ్ మహిళలకు అందుబాటులో ఉండేవి.

ఇంకనూ ఎన్నో విషయాలపై సోదరి మాట్లాడిన మాటలు ఆమెకు ఇస్లామ్‌పైనున్న అవగాహనను తెలియజేస్తున్నాయి. స్థలాభావం వలన అన్ని విషయాలనూ ఇక్కడ అందించలేక పోతున్నాము. ఏదైనా వ్యాసంలో వీలైతే ఇన్షాఅల్లాహ్ అందిస్తాము.

ఆమె ప్రసంగంలో చివరిగా ఆమె ఏమి కోరుతున్నారంటే,

> ముస్లిమ్ యువతలో ప్రేరణ కలిగించి వారిని ముందుకు తీసుకెళ్ళ వలసిన బాధ్యత మన ఉమ్మత్‌పై ఉంది. ఎలా అయితే ముహమ్మద్(స) మిలియన్ల ప్రజలలో ప్రేరణ కలిగించి ముందుకు నడిపించారో అదే విధంగా మన ముస్లిమ్ యువతకు మనం నేర్పవలసిన తొలి పాఠం : **"ఎవరికీ భయపడకు, అల్లాహ్‌కు తప్ప"**

**అల్లాహ్‌కు భయపడినవారే, చెడును నిరోధించి, మంచిని చేయమని ఆదేశించగలుగుతారు. అల్లాహ్‌కు భయపడనివారు అందరికీ భయపడుతూనే ఉంటారు. - శాంతిబాట టీమ్**

7వ శతాబ్దం - 12వ శతాబ్దం : ముస్లిములకు స్వర్ణయుగం
యూరోపియన్లకు అది అంధకార యుగం

# ప్రపంచపు తొలి సైంటిస్ట్ - అబూ అల్-హాసన్ ఇబ్న్ అల్-హైతమ్

**(965 - 1040 CE)**

(గత సంచిక తరువాయి)

## The First True Scientist

BBC న్యూస్, సైన్స్ మరియు ఎన్విరాన్‌మెంట్ సెక్షన్‌లో 'యూనివర్శిటీ ఆఫ్ సర్రీ'కు చెందిన జిమ్ అల్-ఖలీలి 'ఇబ్న్ అల్-హైతమ్'ని The First True Scientist గా అభివర్ణించి, దానికి గల కారణాలను ఆయన సహేతుకంగా వివరించారు. యునెస్కో (United Nations Educational, Scientific & Cultural Organisation) వారి '**ద యునెస్కో కొరియర్**' 7వ సంచిక(2009)లో 'ఇబ్న్ అల్-హైతమ్' యొక్క ప్రయోగాల గురించి, భవిష్య ఖగోళశాస్త్రంపై ఆయన ప్రభావం గురించి యోర్క్ ఆస్ట్రానోమికల్ సొసైటీ సభ్యుడొకరు చక్కగా వివరించారు.

ఎప్పటికీ గొప్ప భౌతిక శాస్త్రవేత్త ఎవరని అడిగితే, విన్నవారు తడుము కోకుండా 'ఐజాక్ న్యూటన్' అనే చెబుతారు. ఆప్టిక్స్ (కాంతిశాస్త్రం)కు పితామహుడు ఎవరంటే కూడా 'న్యూటన్' పేరే చెబుతారు. మనందరికీ స్కూల్స్‌లో న్యూటన్ యొక్క prisms (పట్టకాలు), పరావర్తనం, వక్రీభవనం, లెన్సెస్ (కటకాల)కు సంబంధించిన ప్రఖ్యాత ప్రయోగాల గురించి చెబుతారు. మన పాఠ్య పుస్తకాలలో ఈ విధంగానే ఉంటుంది.

కాని నిజం మాత్రం అది కాదు. న్యూటన్ కంటే 700 సంవత్సరాలకు ముందే **ఇబ్న్ అల్-హైతమ్** ఈ సబ్జక్టులో విస్తృతమైన ప్రయోగాలు చేశారు. పాశ్చాత్య దేశాలలోని చాలా మంది ఈ పేరును విని ఉండరు. అంతవరకూ ఎందుకూ? ఈ వ్యాసం అందించేవారిలో ఒకరు బి.యస్.సి. డిగ్రీ చేసినప్పుడు 'భౌతికశాస్త్రమే' మెయిన్ సబ్జక్టుగా ఉన్నా కూడా, ఆ గొప్ప సైంటిస్ట్ పేరును ఏనాడూ వినలేదు. ఇక హైస్కూల్ ఎడ్యుకేషన్‌తో చదువు ఆపేసిన వారికి, ఇటువంటి సైంటిస్ట్ గురించి తెలియక పోవడంలో ఆశ్చర్యమేముంటుంది?

Science History (శాస్త్రవిజ్ఞాన చరిత్ర) తెలియజేసేది ఏమిటంటే **ప్రాచీన గ్రీకులకు** మరియు **యూరోపియన్ పునరుద్ధరణకు** మధ్య కాలంలో గొప్ప అభివృద్ధి ఏమీ జరగలేదని. కాని నిజానికి ఆ కాలంలోనే ప్రపంచంలో ఎన్నడూ లేనంత గొప్ప అభివృద్ధి జరిగింది. ఆ అభివృద్ధి జరిగిన కాలంలో యూరప్ చీకట్లలో ఉంది కాబట్టి, ప్రపంచమంతా చీకట్లలోనే ఉండేదని యూరోపియన్ల భావన. పచ్చ కామెర్లవాడికి లోకమంతా పచ్చగానే కనిపిస్తుందట.

**గ్రీకులకు మరియు యూరోపియన్ల పునరుద్ధరణకు మధ్య కాలంలో శాస్త్రీయ విజ్ఞానాన్ని అరబ్బులు అమోఘమైన స్థాయిలో అభివృద్ధి చేయడం వలన, ఆ కాలం వారికి స్వర్ణయుగం అయింది. ఆధునిక సైన్స్‌కి ప్రయోగాల ద్వారా పునాది వేసిందే అరబ్ ముస్లిమ్‌లు!**

Mathematics, Astronomy, Medicine, Physics, Chemistry, Philosophy మొదలైన రంగాలలో విశేష అభివృద్ధి ఆ కాలంలోనే జరిగింది. ఆ కాలానికి చెందిన చాలామంది అరబ్ మేధావులందరిలో అగ్రగణ్యుడు **ఇబ్న్ అల్-హైతమ్.**

**ఆధునిక సైంటిఫిక్ విధానానికి పితామహుడు ఆయన.**

ఏ సైంటిస్ట్ అయినా సరే అంతవరకూ ఉన్న సైంటిఫిక్ పరిశీలనలను అధ్యయనం చేస్తాడు. వాటిలో దోషాలుంటే సరిచేయడం (లేక) ఆ విషయాలు కరెక్ట్ అయితే, వాటిని అభివృద్ధి చేయడం, పరిశోధన ద్వారా కొత్త జ్ఞానాన్ని పొందడం, పరిశీలనలు మరియు ప్రయోగాల ద్వారా సమాచారాన్ని సేకరించి, వాటిని ఫార్ములేట్ చేసి, ఆ ఫార్ములాలను పరీక్షించడం మొదలైన పద్ధతులతో శాస్త్రీయ విజ్ఞాన అభివృద్ధికి తోడ్పడతాడు.

పైన చెప్పినటువంటి ''**సైంటిఫిక్ మెథడ్**''ని మొట్టమొదట పరిచయం చేసినవారు - ఇబ్న్ అల్-హైతమ్.

వాస్తవానికి ఆలోచించేవారికి ఇది ఇస్లామీయ విధానమేనని తెలుస్తుంది. కాని ఈ వాస్తవానికి బదులు ప్రపంచంలో ప్రచారం ఎలా జరిగిందంటే, ఈ శాస్త్రీయ విధానం 17వ శతాబ్దం వరకూ ఎవరికీ తెలియదని, ఈ విధానాన్ని ఫ్రాన్సిస్ బేకన్ మరియు రెనె డెస్‌కార్టెస్ ప్రవేశపెట్టారని.

ఇబ్న్ అల్-హైతమ్ experimental data (ప్రయోగాల ద్వారా పొందిన సమాచారం) మరియు reproducibility of results (అదే ప్రయోగాన్ని చేయడం ద్వారా మరలా అటువంటి ఫలితాలనే పొందడం)కి ప్రాముఖ్యత నిచ్చేవారు. అందువలననే తరచుగా ఆయనను '**ప్రపంచపు తొలి వాస్తవ సైంటిస్ట్**'గా చెప్పడం జరిగింది. ఒక ప్రయోగాన్ని ఒక విధానంలో ఎవరు చేసినా, అదే ఫలితం రావాలి.

**"It is incredible that we are only now uncovering the debt that today's physicists owe to an ARAB who lived 1000 years ago"**

***- Prof. Jim Al-Khalili***

**"నమ్మలేని ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, నేటి భౌతిక శాస్త్రజ్ఞులు 1000 సంవత్సరాలకు పూర్వం జీవించిన ఓ అరబ్ సైంటిస్ట్‌కు ఋణపడిన ఆ బాకీని ఇప్పుడిప్పుడే మనం బహిరంగ పరుస్తున్నాము."**

- ప్రొఫెసర్ జిమ్ అల్-ఖలీలి

ఒక వస్తువు మన కంటికి ఎలా కనిపిస్తుంది అనే విషయంపై గ్రీకు తత్వవేత్తలు ఎంత తప్పుగా ఆలోచించారో మరియు **ఇబ్న్ అల్-హైతమ్** కాంతి పరావర్తనం చెందడం దగ్గర నుండి కనిపించే ఆ వస్తువు దృశ్యం మెదడులో ఏర్పడే వరకు ఏం జరుగుతుందో చక్కగా వివరించారో మొదలైన విషయాలను క్రిందటి సంచికలో అందించాము.

అంతేకాకుండా ఆ కాలం వరకూ ఏ సైంటిస్ట్ కూడా ఈ ప్రక్రియను వర్ణించడానికి, నిరూపించడానికి గణితశాస్త్రాన్ని ఉపయోగించలేదు. కాబట్టి ఆ విధంగా తొలి థీరిటికల్ ఫిజిసిస్ట్ కూడా ఇబ్న్ అల్-హైతమ్.

పిన్‌హోల్ కెమెరా కనుగొన్నది, refraction laws (వక్రీభవన నియమాలు) కనుగొన్నది ఈయనే.

కాంతి తన constituent colour లో disperse కావడంపై, నీడలపై, ఇంద్రధనుస్సు, గ్రహణాలపై తొలి ప్రయోగాలు ఈయనే చేశారు.

వాతావరణం ద్వారా sunlight diffraction (సూర్యకాంతిని అనేక రకాలుగా విశ్లేషించి) వాతావరణం యొక్క మందాన్ని కొలవగలిగారు. ఆ విధంగా వాతావరణ మందాన్ని ఆయన ఆనాడు కనుగొన్నది సుమారు 100 కి.మీ.

ఫిజిక్స్ (భౌతికశాస్త్రం) మరియు మేథ్స్ (గణితశాస్త్రం)పై 100కి పైగా విశిష్ఠమైన పనులు ఇబ్న్ అల్-హైతమ్ చేయడం జరిగింది.

ప్రొఫెసర్ అల్-ఖలీలి, BBC Four కొరకు Science and Islam ఫిల్మ్ చిత్రీకరించడానికి మిడిల్ ఈస్ట్‌లో ప్రయాణం చేస్తున్నప్పుడు, అక్కడి ఓ నిపుణిడిని ఇంటర్వ్యూ చేశారు. **"ఖగోళశాస్త్రంపై ఇబ్న్ అల్-హైతమ్ చేసిన వర్క్"**ని ఇటీవలి కాలంలో వారు కనుగొన్నది ప్రొఫెసర్ అల్-ఖలీలి గారికి చూపించాడాయన.

దానిని బట్టి Celestial mechanicsని అభివృద్ధి చేసినది కూడా **ఇబ్న్ అల్-హైతమ్** అని తెలుస్తుంది. అవి గ్రహాల కక్ష్యల వివరాలు. ఇవే యూరోపియన్ శాస్త్రవేత్తలైన కోపర్నికస్, గెలీలియో, కెప్లర్ మరియు న్యూటన్‌లను నడిపించాయి.

**చంద్రయానానికి** సంబంధించిన **'ది అపోలో 11 మిషన్'** క్రిందటి సంవత్సరానికి 40 సంవత్సరాలు పూర్తిచేసుకుంది. అదేవిధంగా చంద్రునిపై గెలీలియో అబ్జర్వేషన్స్‌కి కూడా 400 సం॥లు నిండాయి.

ఇటాలియన్ చరిత్రకారుడు మరియు సైంటిస్ట్ లియొనార్డో డావిన్సి తన Codex Leicesterలో చంద్రునిపై కాంతివంతంగా కనిపించేదంతా నీరు అని చెప్పారు. గెలీలియో తన టెలిస్కోప్ ద్వారా చూచి చంద్రునిపై సముద్రాలున్నాయని తప్పుగా భావించారు.

ప్రక్కనే ఉన్న చంద్రుని ఫొటోను చూడండి. చంద్రుడు పూర్తిగా కాంతివంతంగా ఎందుకు లేడు. కొంత భాగం నల్లగా కనిపిస్తుంది, ప్రకాశవంతంగా ఉండదు. దానికి కారణమేమిటి?

చంద్రుని రూపంపై ఎన్నో గ్రీకు సిద్ధాంతాలున్నాయి. వాటన్నింటిని తప్పని ఖండించి, Modern Optics కు పితామహుడైన ఇబ్నె అల్-హైతమ్ optics ద్వారా చెప్పినదే కరెక్ట్ అని నేడు నిరూపితమైంది.



**చంద్రుడు**

చంద్రుని రూపానికి శాస్త్రీయ వివరణ సాధ్యం కాదు అని భావించే వారికి, ఓ 400 సంవత్సరాల క్రితం గెలీలియో తన టెలిస్కోప్‌తో రాత్రిపూట ఆకాశంవైపు తిప్పేవరకూ అది సాధ్యమేనన్న విషయం తెలియలేదు అంటారు. కాని 1000 సంవత్సరాలకు పూర్వమే ఇరాఖీ శాస్త్రవేత్త 'ఇబ్న్ అల్-హైతమ్', అప్పటికే ఎన్నో సంవత్సరాల నుండి ఆసక్తి రేకెత్తించే ఆ ప్రశ్నకు శాస్త్రీయ వివరణను ఇచ్చారు.

**ఆ విషయాల గురించి సవివరంగా వచ్చే సంచికలో ఇన్షాఅల్లాహ్ అందిస్తాము.**

మా ట్రూవిజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ప్రస్తుతం విశాఖపట్నంలో నిర్వహిస్తున్న 'ఖుర్‌ఆన్ మరియు సున్నత్' సమ్మర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌కి, మా ఆహ్వానాన్ని మన్నించి జనాబ్ హఫీజుర్రహ్మాన్ ఉమ్రీ మదనీ గారు క్లాసులు బోధించడానికి ఉమ్రాబాద్ నుండి వచ్చారు. ఓ సందర్భంలో ఆయన చెప్పిన ఉదాహరణ ఇక్కడ సరిపోతుందని అందిస్తున్నాము.

"ఈ రోజున ఆరోగ్యం కొరకు తీసుకునే 'తేనె' మన శరీరానికి ఆరోగ్యం కలిగించడం లేదు. త్రాగే పాలు శక్తినివ్వడం లేదు. ఆత్మహత్య చేసుకోవడానికి విషం త్రాగినవారు చావడం లేదు. నిజానికి అవి 'తేనె, పాలు, విషం' అని పిలవబడుతున్నాయి గాని, అవి ఒరిజినల్ కాదు. అదే విధంగా కొందరు ముసిమ్‌లున్నారు. కాని వారు ముస్లిమ్‌లు కారు.

**ఆనాడు ఇబ్న్ అల్-హైతమ్ వంటివారు ఖుర్'ఆన్ మరియు హదీస్‌లను బాగా అధ్యయనం చేసి, నిజమైన ముస్లిమ్‌లుగా జీవిస్తూ, ప్రపంచం అబ్బురపడే విధంగా ఎన్నో ప్రయోగాలు చేసి సైన్స్‌లోని ఎన్నో రంగాలను అభివృద్ధి చేశారు.**

ఈనాడు కూడా ఖుర్'ఆన్ చదివే వారున్నారు. హదీస్‌లను చదివేవారున్నారు. మరి నేడు **'ఇబ్న్ అల్-హైతమ్', 'అల్-ఖ్వారిజ్మీ'** వంటివారు ముస్లిమ్‌లలో ఎందుకు లేరు? ఓసారి ఆలోచించండి! లోపమెక్కడుంది? ప్రతీ ముస్లిమ్ 'తను నిజంగా ముస్లిమేనా?' అని స్వయంగా ప్రశ్నించు కోవాల్సిన అవసరముంది. నిజమైన ముస్లిములు అవుదాం. శాస్త్రీయ విజ్ఞానానికి నైతిక విలువలను కలిపి, ప్రపంచాన్ని నిజమైన అభివృద్ధి పథంలోకి తీసుకెళ్ళడానికి అల్లాహ్ పేరుతో ప్రయత్నిద్దాం.

**(ఇంకా ఉంది)**

| జ్ఞానం | నాస్తికుల / హేతువాదుల (అ)జ్ఞానం పై ప్రత్యేక శీర్షిక | అజ్ఞానం |
|---|---|---|

జ్ఞానులుగా పిలిపించుకోబడే, స్వయంగా తాము జ్ఞానులమని తలపోసే వారిలోని అజ్ఞానాన్ని ప్రజల ముందుంచడానికే ఈ శీర్షికను ప్రారంభించామని తొలి సంచికలో తెలియజేసి, కొందరి జ్ఞానులలో నున్న అజ్ఞానాన్ని బయట పెట్టడం జరిగింది. నిజమైన జ్ఞానులెవరో, అజ్ఞానంతో నున్న జ్ఞానులెవరో ఉదాహరణ పూర్వకంగా వివరించడం జరిగింది. 'ఇస్లాం' పై కనీస జ్ఞానం లేకుండా ఇస్లాంపై విషపూరితాలతో కూడిన ఓ పుస్తకాన్ని హేతువాది ఒకరు పబ్లిష్ చేశారు. పుస్తకంలోని అజ్ఞానాన్ని ఈ నెల మీ ముందుంచుతున్నాము.

పుస్తకం పేరు :

## ప్రపంచ ముస్లిం మేధావుల దృష్టిలో ఇస్లాం అంటే ...

సంకలనం, అనువాదం : **క్రాంతికార్**

ఈ హేతువాదిగారి ఎడ్రస్ : 11-1-88, లెనిన్ నగర్, **ఖమ్మం** - 507001

ఫోన్ నంబర్ : (08742) - 223788

**పబ్లిషర్స్ :** హిమకర్ పబ్లికేషన్స్, 79-2-3, ప్రశాంతి ఎస్టేట్, తిలక్ రోడ్
**రాజమండ్రి** - 533 103,
ఫోన్స్: 0883-2466075, 2449846

**(గత సంచిక తరువాయి)**

క్రాంతికార్, తను పూర్తి మానసిక ఆరోగ్యంతో ఉన్నట్లు తనే స్వయంగా సర్టిఫై చేసుకున్నారు. ఈయన వ్రాసే పుస్తకాలు చదివితే, ఇతనికి మానసిక వైకల్యమైనా ఉండి ఉండాలి లేదా తనకు జ్ఞానం ఉందన్న అపోహ లోనైనా అతను ఉండిఉంటాడని తెలుస్తుంది.

"హేతువాదం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, శాస్త్రీయ విజ్ఞానం"పై సరియైన అవగాహన లేకుండా, కనీసం వాటి అర్థాలు కూడా తెలియని క్రాంతికార్, ఈయనవంటి అజ్ఞానులు వ్రాసిన కొన్ని వ్యాసాలను ఇంటర్‌నెట్ నుండి సేకరించి, వాటిని అనువదించి ప్రచురించి తన మూర్ఖత్వాన్ని చాటిచెప్పుకున్నారు.

క్రాంతికార్ పుస్తకంలో ప్రచురితమైన ఓ అజ్ఞాని యొక్కవ్యాసాన్ని విశ్లేషిస్తూ ఈ నెల మీ ముందుంచుతున్నాము. ఆలోచించండి! వారి మూర్ఖత్వపు స్థాయి ఏమిటో మీరే నిర్ణయించండి.

వ్యాసం పేరు : **ఇస్లాం – విమర్శనాత్మక పరిశీలన**

వ్యాసం వ్రాసిన వ్యక్తి పేరు : **సయ్యద్ కమ్రాన్ మీర్జా**

ఆ వ్యాసంలోని ప్రారంభపు పేరా :

**ఇస్లాం నేడు ప్రపంచవ్యాప్తంగా మున్నెన్నడూ లేని రీతిలో విమర్శనాత్మక మైన పరిశీలననూ, సమగ్రమైన పరిశోధనను ఎదుర్కొంటోంది. ఇది నిజంగా అత్యంతావశ్యకమైన, సకాలంలో చేపట్టాల్సిన చర్య. పాశ్చాత్యుల పట్ల ముస్లిమ్‌ల కెందుకంత ద్వేషభావం ఉందో, వారెందుకంత శతృత్వం వహిస్తున్నారో, వాటి మూలకారణం, వనరు ఏమిటో వారు తెలుసుకోవాలనుకుంటున్నారు. 2001 సెప్టెంబర్ 11 ఉదంతం (ప్రపంచ వాణిజ్య సంస్థపై దాడి) తర్వాత పాశ్చాత్య దేశాల్లో ఖుర్‌ఆన్ పుస్తకాలు అమ్ముడుపోయాయి. అలాంటి వెర్రెత్తిన సాహసంతో ప్రాణాలకు తెగించి, అంతటి విధ్వంసకాండ జరపటానికి వారిని ప్రేరేపించిన అంశాలు, ఖుర్‌ఆన్‌లో ఏమున్నాయో తెలుసుకోవడానికి వారు ఆరాటపడుతున్నారు"**

చదివారు కదా!

ఖుర్‌ఆన్‌లో ఏమున్నాయో తెలుసుకోవడానికి అమెరికన్లు ఆరాటపడటమే కాదు, చాలామంది అమెరికన్లు ఖుర్‌ఆన్ గ్రంథాన్ని చదివారు. క్రాంతికార్ వలే మూర్ఖంగా అపోహలను వారు నమ్మలేదు. చదివి నిజం తెలుసు కోవాలనుకున్నారు. ఈ ఇంగితజ్ఞానం క్రాంతికార్ గారికి లేకపోయింది. ఖుర్‌ఆన్ చదివిన తర్వాత ఏమేమి జరిగాయో వ్యాసం వ్రాసిన మీర్జాగారికి తెలియదా? పరదేశానికి వలసపోయిన ఈ మీర్జాగారు, ఏ దేశానికి వలసపోయారో ఆయన వ్యాసం ద్వారా మాత్రం తెలియలేదు. బహుశా ఆయన అమెరికాకే వలస వెళ్ళి ఉండవచ్చని అనుకుంటున్నాము.

ఖుర్‌ఆన్ గ్రంథాన్ని అమెరికన్లు చదవడం మొదలుపెట్టిన తరువాత, నిజాన్ని అర్థం చేసుకుని ఇస్లామ్ ధర్మాన్ని స్వీకరించడం మొదలుపెట్టారు. ప్రముఖ అమెరికన్ టి.వి. ఛానెల్స్ యొక్క రిపోర్ట్ ప్రకారం ప్రతీయేటా సగటున 20,000 మంది అమెరికన్లు ఇస్లాం స్వీకరిస్తున్నారని, అందులో 16,000 మంది స్త్రీలేనని చెప్పారు. ఇస్లాం స్వీకరించినవారి ఇంటర్వ్యూలను ప్రచారం చేశారు. (ఇంటర్‌నెట్‌లో కూడా ఈ టి.వి. క్లిప్పింగ్స్ అందుబాటులో ఉన్నాయి).

**ఇస్లామ్‌లోకి వచ్చిన ఈ స్త్రీలు, తమకు మనశ్శాంతి ఇస్లామ్‌లోనే ఉందని వారు చెప్పడాన్ని కూడా మీరు ఈ ఇంటర్వ్యూలలో చూడవచ్చు. ఇటువంటి రిపోర్ట్‌నే 2007 రమదాన్ నెలలోగాని, లేదా 2008 రమదాన్ నెలలో గాని టివి9 చానెల్ వారు మన రాష్ట్రంలో ప్రసారం చేశారు.**

కాబట్టి పై వాస్తవాల ద్వారా స్పష్టమైన దేమిటంటే, **ఖుర్‌ఆన్ గ్రంథం విధ్వంసకాండను ప్రేరేపించడం లేదని, నిజమైన మనశ్శాంతిని కలుగజేసే ఏకైక గ్రంథంగా ఖుర్‌ఆన్ గ్రంథాన్ని చదివిన అమెరికన్లు తెలుసుకున్నారు.**

మన రాష్ట్రంలో అందరికీ తెలిసిన విషయం ఒకటి చెప్పాలి. అదేమిటంటే, ఓ మతంలోకి మారితే డబ్బు ఇస్తారు. డబ్బుకు ఆశపడి మతాలు మార్చుకున్నవారు చాలామందే ఉన్నారు. కాని ఇస్లామ్‌లో అటువంటి అవకాశం లేదు. ముస్లిమ్‌ల నందరినీ టెర్రరిస్ట్‌లుగా ప్రచారం చేస్తూ, వారిని అవమానించే అమెరికాలోనే, ట్విన్ టవర్స్ కూల్చబడిన సంవత్సరంలోనే అమెరికన్లు ఇస్లాం స్వీకరించారంటే, వారు కేవలం మనశ్శాంతి కోసం, సన్మార్గాన్ని అవలంబించడం కోసమే ఇస్లామ్‌ని ఎన్నుకున్నారని, ఇంగిత జ్ఞానమున్న వారెవరికైనా స్పష్టంగా అర్థమౌతుంది.

ముస్లిమ్ అయితే చాలు అమెరికా అనుమానిస్తుందని తెలిసి కూడా, వారు ఇస్లాం స్వీకరించారంటే వారికి 'ఇస్లామ్'పై ఎంత విశ్వాసం ఏర్పడిందో అర్థమౌతుంది.

మరి అమెరికన్లకు అర్థమైన విషయం క్రాంతికార్‌కి గాని, కమ్రాన్ మీర్జాకిగాని ఎందుకు అర్థం కాలేదు? అంటే వీరు విమర్శనాత్మకమైన పరిశీలననూ, సమగ్రమైన పరిశోధననూ చేయలేకపోయారా? వీరు జ్ఞానులా? అజ్ఞానులా?

వీరు ఎటువంటి వారో మా పూర్తి విశ్లేషణ చదివాక, ఇన్షా అల్లాహ్, మీకే అర్థమవుతుంది.

క్రాంతికార్ పుస్తకం 27వ పేజీలోని ఒక పేరా :

**"ఇస్లామ్‌ను విమర్శనాత్మకమైన దృష్టితో పరిశీలించటం వల్ల, దాని తాత్వికతను లోతుగా పరీక్షకు గురిచేయడం ద్వారా, నిజానిజాలను తార్కికంగా తెలుసుకోవడం ద్వారా - అందరికంటే ముస్లిమ్‌లే మరింత ప్రయోజనం పొందుతారు. కాని ఈనాడెంతో అసహనం ముస్లింల్లో పెరిగిందంటే ముస్లిమ్‌కానీ, లేక ముస్లిమేతరుడుకాని ఇస్లామ్‌ని, ఖుర్‌ఆన్‌ను విమర్శిస్తే - చాలామంది హింసాత్మకంగా ప్రతిస్పందిస్తారు".**

నిజనిజాలను తార్కికంగా తెలుసుకోవడం ద్వారా ముస్లిమ్‌లే ప్రయోజనం పొందుతారు అంటున్న కమ్రాన్ గారు నిజాలను తెలుసు కోవాలంటే ఖుర్‌ఆన్ గ్రంథాన్ని చదవాలని, అలా కాకుండా కేవలం కొందరు ముస్లిమ్‌లను చూచి ఇస్లామ్‌ను అంచనా వేయడం మూర్ఖత్వమని తెలుసుకోలేక పోయారు. అంతటి జ్ఞాని ఆయన! అందువల్లనే క్రాంతికార్‌గారి పుస్తకంలో ఆయన వ్యాసానికి చోటు లభించింది.

'ఇస్లామ్‌ని, ఖుర్‌ఆన్‌ని' విమర్శిస్తే చాలామంది హింసాత్మకంగా ప్రతిస్పందిస్తారట. చాలామంది అంటే ఎంతమంది? ప్రపంచంలో 150 కోట్ల మంది ముస్లిమ్‌లున్నారు కదా, చాలామంది అంటే 75 కోట్లమందా? లేక 50 కోట్ల జనమా? ఎంతమంది?

ఖమ్మం పట్టణంలోని ముస్లిములు 'క్రాంతికార్'పై హింసకు పాల్పడ్డారా? ఇప్పుడు క్రాంతికార్‌కి అర్థమై ఉంటుంది - తాను నిజంగా అజ్ఞాన వ్యాసాలనే సేకరించాడని. ముస్లిమ్‌లు హింసక పాల్పడక పోవడాన్ని చూసి సిగ్గుతో పశ్చాత్తాప పడాలి.

**నిజానికి ఇస్లామ్‌ని ఎందుకు విమర్శిస్తున్నారు?**

ఇస్లామ్‌ని విమర్శిస్తే యూరప్ దేశాలలో రెడ్‌కార్పెట్ పరచి అక్కడివారు స్వాగతం పలుకుతారు.

ఎందుకని?

ఆ విధంగా 'ఇస్లామ్'ను విమర్శించిన వాడు దొంగైనా సరే, దుర్మార్గుడైనా సరే, పిచ్చివాడైనా సరే వారు పట్టించుకోరు. ఇస్లామ్‌ని విమర్శిస్తే చాలు. ఇంకేమీ అవసరం లేదు.

**ఎవరికైనా యూరప్ దేశాలు వెళ్లడానికి 'వీసా' లభించకపోతే, ప్రస్తుతం మన రైల్వేవారు ప్రవేశపెట్టిన 'తత్కాల్' వంటి పరిష్కారం ఏమిటంటే ఇస్లామ్‌కి వ్యతిరేకంగాగాని, ముస్లిమ్‌లకు వ్యతిరేకంగా గాని ఓ పుస్తకం వ్రాస్తే చాలు. వెంటనే వీసా ఇచ్చేస్తారు. బోలెడు డబ్బు కూడా సంపాదించు కోవచ్చు.**

'తస్లీమా నస్రీన్' రచనలు ఏ స్థాయిలో ఉంటాయో ఎవరికైనా తెలుసా? చాలా తక్కువ స్థాయి రచనలు ఆమెవి. కాని ఆమెకు అవార్డు లిచ్చారు.

ఇస్లామ్‌పై విమర్శలు చేయడం కేవలం ఫ్రీ లాడ్జింగ్, బోర్డింగ్ కోసం, డబ్బుకోసం, చేస్తున్నారుగాని, దాని వెనుక మరో ఆలోచన ఏమీ లేదు.

తూర్పుగోదావరి జిల్లాలో అసత్య సందేశాలనిస్తూ, ఖుర్‌ఆన్ వాక్యాలను వక్రీకరిస్తూ, తన జీవనోపాధి కోసం తన కుటుంబ పోషణకోసం ఏ పనీ చేయకుండా ఓ పిట్టలదొర దర్జాగా బ్రతుకుతున్నాడు. ఇతను కూడా త్వరలో యూరప్ దేశాలలో జీవిస్తాడేమో! అమెరికా మరియు యూరప్ దేశాలకు వెళ్లడానికి ఇంతకంటే షార్ట్‌కట్ రూట్ మరొకటి లేదని సల్మాన్ రష్దీ, తస్లీమా నస్రీన్‌లు ప్రపంచానికి సంకేతాలు పంపారు.

ముస్లిమ్‌లు హింసాత్మకంగా ప్రతిస్పందిస్తారట.

'ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఇవ్వకండి' అని క్రాంతికార్ గారు తెలంగాణా ప్రాంతంలో చెప్పి చూడాలి. అలా ఓ పుస్తకాన్ని వ్రాస్తే, ప్రతిస్పందన ఏ రూపంలో ఉంటుందో ఆయనకు తెలుస్తుంది! వారు హింసాత్మకంగా ప్రతిస్పందిస్తారో లేక సౌమ్యంగా ప్రతిస్పందిస్తారో!

'క్రాంతికార్' చేసిన పనికి, అతను భారతీయుడు కనుక భారతదేశాన్ని ఎవరైనా విమర్శిస్తారా? ఎక్కడో ఎవరో చేసిన పనిని ఇస్లామ్‌కి ఆపాదించడం హేయమైన పని.

ఇస్లామ్‌ను పరిచయం చేయాలని ముహమ్మద్(స)వారు తాయిఫ్ నగరం వెళ్ళినప్పుడు వారి స్పందన ఎలా ఉందో, ఆ తరువాత ముహమ్మద్(స)వారి స్పందన ఎలా ఉందో తెలుసుకోవాలంటే క్రింద ఇచ్చిన వాస్తవ సంఘటనను చదవండి.

ఒకసారి దైవప్రవక్త ముహమ్మద్(స)వారు తన దత్తపుత్రుడైన జైద్ బిన్ హారిస(రజి)ని వెంటబెట్టుకుని మక్కాకు అరవై మైళ్ళ దూరంలో ఉన్న తాయిఫ్ పట్టణానికి ప్రయాణమయ్యారు. ఆ పట్టణానికి సంబంధించిన ముగ్గురు పెద్దలు కూడా ముహమ్మద్(స) వారు అందజేసిన **'ఆరాధ్యుడు ఒక్కడే'**నన్న దైవ సందేశాన్ని తిరస్కరించడమే కాకుండా అహంకారంతో దుర్భాషలాడి ఆయన హృదయాన్ని తీవ్రంగా బాధపెట్టారు. ముహమ్మద్(స)వారు సహనమే వహించారు.

అంతేకాదు అక్కడి వారు తమ బానిసలను, అల్లరి పిల్లలను దైవ ప్రవక్త(స) పైకి ఉసిగొల్పారు. వాళ్లు రాళ్లు విసురుతూ దాదాపు 3 మైళ్ళ వరకూ ఆయన వెనుకపడ్డారు. మహాప్రవక్త(స) దేహంపై రక్తం. ఆ రక్తం చెప్పుల్లోకి పోయి గడ్డకట్టి కాళ్లు చెప్పులకు అంటుకు పోవడం జరిగింది. పట్నం వెలుపల ఓ పండ్లతోట నీడలో కూర్చుని, బాధతో ఆకాశం వైపు చూస్తూ అల్లాహ్‌ను ప్రార్థించారు.

సర్వలోకాలకు కారుణ్యంగా పంపబడిన ముహమ్మద్(స)వారి ప్రార్థనపై అనంత కరుణామయుడైన అల్లాహ్ స్పందన ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాలా!

తాయిఫ్ పట్టణానికి ఇరువైపులా రెండు కొండలు ఉన్నాయి. ఆ కొండల పర్యవేక్షకుడైన దైవదూతను తీసుకుని దైవదూత జిబ్రయీల్ (అస) వచ్చారు. ఆ దూత ఇలా విన్నవించుకున్నాడు.

"ముహమ్మద్ (స)! విశ్వ ప్రభువు మీ ప్రార్థన ఆలకించాడు. మీ కోసమే ఆయన నన్ను పంపాడు. మీరు ఆజ్ఞాపిస్తే తాయిఫ్ పట్టణానికి ఇరువైపుల ఉన్న రెండు కొండలను కలిపేసి పట్టణాన్ని నుగ్గు నుగ్గు చేస్తాను. పట్నంలో ఉన్నవారు తృటిలో సర్వనాశనమవుతారు".

కాని సర్వలోకాలకు కారుణ్యంగా పంపబడిన దైవప్రవక్త (స) దానికి అంగీకరించలేదు.

**"వద్దు వద్దు. ఆ పనిచేయకండి. ఈనాడు వీళ్ళు ఇస్లాం స్వీకరించకపోతే, రేపు వీరి సంతానమయినా స్వీకరించవచ్చని నాకు ఆశ ఉంది. భవిష్యత్తులో వారి సంతానము ముస్లిములు కావచ్చు. అందుచేత వీళ్ళను అంతమొందించడం నాకిష్టం లేదు" అన్నారు ఆయన.**

స్పృహ తప్పేలా కొట్టిన వారిని, రక్తం కారి చెప్పుల్లో గడ్డకట్టేలా, అతి ఘోరంగా రాళ్లతో కొట్టినా సరే, వారిని శిక్షించవద్దని వారిలో కొందరైనా సన్మార్గం వైపు వస్తారేమోనన్న ఆశాభావాన్నే వ్యక్తం చేసిన కారుణ్యమూర్తి మరియు సహనశీలి - ముహమ్మద్(స).

శాంతిధర్మం గురించి ఆ మహనీయుడు తెలియజేస్తే, రాళ్ళతో కొట్టి తమ ప్రతిస్పందన తెలియజేశారు.

కాని ముస్లిమైన ముహమ్మద్(స)వారు ప్రతిస్పందన ఏమిటంటే, ఈ నగరంతో సహా మక్కా పూర్తిగా ముహమ్మద్(స)వారి వశమైనప్పుడు అందరినీ క్షమించడమే! వీరిపై ప్రతీకారానికిగాని, హింసకుగాని పాల్పడమని తనవారికి చెప్పలేదు.

**చారిత్రక సత్యాలు గురించి తెలుసుకుని విమర్శించాలి.**

ఇలాంటి మానవోత్తముడిపై చెడుగా పుస్తకాన్ని వ్రాసిన క్రాంతికార్ ఎటువంటి వాడై ఉంటాడు!

వీరి దృష్టిలో ముస్లిమ్ అంటే కేవలం తాలిబన్లు మాత్రమేనా? ప్రపంచంలో ఎంతమంది తాలిబన్లు ఉన్నారో తెలుసా? ప్రపంచ ముస్లిమ్‌లలో వారి శాతం తెలుసుకోండి. 2008 సంవత్సరంలో వేసిన అంచనాల ప్రకారం తాలిబన్ల సంఖ్య : కేవలం 11,000. ప్రపంచంలో ముస్లిముల సంఖ్య 150,00,00,000 (150 కోట్లు).

తాలిబన్ల గురించి అమెరికా మీడియా ఏమి చెప్పిందో మరియు చెబుతుందో, అది మాత్రమే ప్రజలకు తెలుస్తుంది. నిజంగా వారు ఎటువంటి వారో మనకి తెలియదు. వీరి గురించి తాలిబన్ల చెరలో 11రోజులు గడిపిన 'సోదరి రిడ్లీ' అభిప్రాయాన్ని ఇక్కడ అందిస్తున్నాము.

11 రోజుల చెరలో ఏనాడూ తనను భౌతికంగా ఏ విధంగానూ తాలిబన్లు గాయపరచలేదని చెప్పారు. అమెరికా కస్టడీలో ఉన్న ఆఫియా సిద్దీఖీ వంటి మహిళా ఖైదీలతో అమెరికన్లు వ్యవహరించిన విధానంతో, తనను పోల్చుకుని, మహిళా ఖైదీలతో తాలిబన్ల ట్రీట్‌మెంట్‌ని మెచ్చుకున్నారు. తాలిబన్ల కస్టడీలో తను ఉండే గది (సెల్) యొక్క తాళం చెవిని కూడా తనకే ఇచ్చారు లోపలినుండి తాళం వేసుకోవడానికి. తన ఏకాంతానికి భంగం లేకుండా స్వేచ్ఛనివ్వడం జరిగిందని చెప్పారు.

సోదరి రిడ్లీ గురించి క్లుప్తంగా ఈ సంచికలోనే 'తిరిగిగూటికి' వ్యాసంలో చూడండి.

కాబట్టి నిజం తెలియకుండా మాట్లాడకూడదు. ఒకవేళ తాలిబన్లు దుర్మార్గులే అయినా సరే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిములను వారి వంకతో విమర్శించడం అజ్ఞానం కాక మరేమిటి?

మనదేశంలో కొన్ని ముస్లిమ్ సమావేశాలకు వచ్చే వేరే మతాలకు చెందిన రాజకీయ నాయకులు టోపీలు పెట్టుకుంటారు. అంతమాత్రాన వారు ముస్లిములు అయిపోయినట్లా?

అల్-ఖైదా, తాలిబన్లు పేరుతో ఇస్లామ్‌కి వ్యతిరేకంగా ఏమైనా జరిగితే, అమెరికా ప్రభుత్వమే వాటిని చేయించి ఉండవచ్చని అనుమానించండి. గుడ్డిగా నమ్మకండి. 'శాంతిబాట'లో టెర్రరిజమ్ శీర్షికలో గత 7 నెలలుగా ఎన్నో వాస్తవాలను అందించాము. అవి చదవండి.

కళ్ళుండి కూడా మేధా దృష్టి లోపంతో నిజాలను చూడలేని క్రాంతికార్ లాంటి ఎందరో అజ్ఞానుల లోపాలను సరిచేసి, వారికి నిజాలను చూపించే మా ఈ వ్యాసంలోని మరికొంత భాగం **ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ....**

### పత్రిక అందని వారికి మనవి

**మా పాఠకులలో కొందరు శాంతిబాట అందలేదని ఫోన్ చేసిన తరువాత మరలా కాపీలను పంపడం జరిగింది. అయితే ఆ తరువాత వారే మాకు ఫోన్ చేసి, ముందు పంపిన కాపీ కూడా అందిందని, పోస్ట్‌లో అందిన తరువాత వాటిని ఇంటివారు ఎక్కడో పెట్టివేయడంతో, మేము పంపలేదని అనుకున్నామని చెప్పడం జరిగింది. కాబట్టి ఎవరైనా అందలేదని భావించేవారు, దయచేసి ఒకసారి ఇంటిలో మరియు ఆ తరువాత మీ ఏరియా పోస్ట్‌మేన్ గారిని సంప్రదించమని కోరుతున్నాము.**

### 6 నెలల చందాకట్టిన వారికి మనవి

**మా పాఠకులలో కొందరు 6 నెలలకు మాత్రమే చందా కట్టిన వారున్నారు. దయచేసి మిగిలిన 6 నెలలకు M.O. ద్వారా చందా పంపించమని కోరుతున్నాము.**

**కాకినాడ పోస్టల్ డిపార్ట్‌మెంట్‌వారు, మా పాఠకులలోని 50 మందికి లెటర్లు పంపారు. వాటిలోని 10 లెటర్లకే సమాధానాలు వచ్చాయని తెలిసింది. మిగతా 40మంది కూడా వారికి పంపిన ఫార్మ్‌లను త్వరగా పూర్తిచేసి పంపితే, మాకు పోస్టల్ రిజిస్ట్రేషన్ వస్తుంది. ఆ ఫార్మ్ విషయంలో ఏమైనా సందేహాలుంటే మాకు ఫోన్‌లో తెలియజేయండి.**

# ధర్మ సందేశ ప్రచారం - 5

'శాంతిబాట' మాసపత్రికలోని విషయాలు ధర్మసందేశ ప్రచారంలో బాగా ఉపయోగపడుతున్నాయని చెబుతూ, 'శాంతిబాట టీమ్'ని ప్రోత్సహిస్తూ 'దావత్'పై ప్రత్యేకమైన శీర్షికను కూడా అందివ్వమని కొందరు సోదరులు కోరారు. 'శాంతిబాట'లోని విషయాలు - ప్రపంచంలోని ఎంతో మంది ముస్లిం సోదరులు చేసిన కృషికి ఫలితం. వారందరికీ అల్లాహ్ శ్రేయోశుభాలను అనుగ్రహించు గాక! (ఆమీన్). నేడు సందేశ ప్రచారంలో ఎన్నో కొత్త పోకడలు వచ్చాయి. ప్రవక్త(స)వారి సాంప్రదాయానికి దూరంగా ఈ కార్యక్రమాలు పోతుండటం చూసి, ఆవేదనతో ఈ శీర్షికను ప్రారంభించాము.

## వ్యక్తి పూజ (HERO WORSHIP) దిశగా సాగుతున్న 'దావత్' కార్యక్రమాలు

ప్రస్తుతం ముస్లిమ్ సమాజంలో రెండు విభిన్న పరిస్థితులు పెనవేసుకుని ఉన్నాయి. అందులో ఒకటి సంతోషించదగినది అయితే, మరొకటి ప్రమాదకరమైనది. ధార్మిక విషయాలు నేర్చుకోవాలని వాటిని ఇతరులకు బోధించాలనుకోవడం సంతోషదగిన పరిణామం. ఇక ప్రమాదకరమైన పరిస్థితి ఏమిటంటే, అది సగటు ముస్లిమ్‌ని జ్ఞానానికి దూరం చేయడమే కాకుండా, అజ్ఞానం వైపు పరుగులు తీసేలా చేస్తుంది.

ఈ పరిస్థితి గురించి తోటి ముస్లిమ్‌లకు తెలియజేసి, వారు జాగ్రత్త పడేలా చేయాలనేది మా సంకల్పం. స్టూడెంట్‌ని టీచర్ మందలిస్తే, ఆ సమయంలో స్టూడెంట్ బాధపడవచ్చు. అలాగే పిల్లలను తల్లిదండ్రులు మందలించినపుడు కూడా అదే పరిస్థితికి పిల్లలు కూడా లోను కావచ్చు.

కాని ఆ తరువాతి కాలంలో వారు చేసిన ఆ మందలింపు తన శ్రేయస్సు కొరకేనని అర్థం చేసుకున్నాక, ఆ టీచర్‌పైగాని తమ తల్లిదండ్రులపై గాని అపారమైన గౌరవం కలుగుతుంది.

ఇదేవిధంగా అల్లాహ్ మాపై ఉంచిన బాధ్యతను, మంచి సంకల్పంతో పూర్తి చేయడానికి కొన్ని వాస్తవాలను పాఠకుల ముందు ఉంచుతున్నాము. కొందరికి ఈ వాస్తవాలు చేదుగా ఉన్నా సరే, ఒకసారి వీటి గురించి ఆలోచించమని కోరుతున్నాము.

### అల్లాహ్‌కే తెలుసు

మనం నమాజ్‌లు సరిగ్గా చేస్తున్నామా? లేదా?

ఉపవాసంలో ఏమీ తినకుండా ఉంటున్నామా? లేదా?

మన మనస్సులో అల్లాహ్‌పై సంపూర్ణ విశ్వాసం ఉందా? లేదా?

పై ప్రశ్నలకు సమాధానం అల్లాహ్‌కు మరియు మనకు మాత్రమే తెలుసు. మిగతావారికి మనం చెబితేనే తెలుస్తుంది.

అల్లాహ్ ఎవరిపై కరుణ చూపిస్తారో, వారికే సన్మార్గం లభిస్తుందని అందరికీ తెలిసిన విషయమే! ఆ సన్మార్గం పొందినవారు, దానికి బదులుగా కృతజ్ఞతతో 'అల్లాహ్ మార్గం వైపు ప్రజలను పిలుస్తార'ని క్రిందటి సంచికలో వివరించాము.

మనం చూపే ఈ కృతజ్ఞత గురించి అల్లాహ్‌కు తెలుసు. ఈ 'దావా' (దావత్) అల్లాహ్‌పై విశ్వాసంగల ప్రతీ ముస్లిమ్ చేస్తూనే ఉన్నాడు. ఆ విధంగా 'దావా' చేస్తున్నానని చెప్పుకోవడానికి ప్రతీ ముస్లిమ్ దగ్గర ఫొటోలు, వీడియోలతో కూడిన సాక్ష్యాలు ఉండకపోవచ్చు. కాని అల్లాహ్ దగ్గర ఆ విషయాలన్నీ రికార్డ్ అవుతూ ఉంటాయనే విషయం అతనికి తెలుసు. తీర్పుదినాన అవి స్పష్టమౌతాయి. అల్లాహ్ కొరకు చేసే ఏ పనికైనా సరే ఇహలోకంలో ఏ సాక్ష్యాలను మనం సేకరించు కోవలసిన అవసరం లేదు.

'అల్లాహ్ మార్గం వైపు ప్రజలను పిలుస్తూ' మనం చూపే ఈ కృతజ్ఞత - అల్లాహ్‌ను మెప్పించాలిగాని, అల్లాహ్‌కు బదులుగా ప్రజల మెప్పుకోసం చేస్తే, లేదా ఇహలోక సౌఖ్యాల కోసం చేస్తే అది కృతజ్ఞత అవుతుందా? నేటి యువకులు ఆలోచించాలి!

### అర్హత లేకుండా అందలం

కేవలం చదవడం, వ్రాయడం మాత్రమే తెలిసిన వ్యక్తికి కాలేజీలో లెక్చరర్‌గా పాఠాలు చెప్పాలని కోరిక ఉందనుకోండి. తన కోరిక తీర్చుకోవడానికి, ఏదైనా కాలేజీకి వెళ్ళి, ఏదో ఒక క్లాసుని ఎంచుకుని పాఠాలు బోధించేయగలడా?

అలా చెయ్యాలంటే, అతను తన చదువును కొనసాగించి కనీసం పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయాలి. ఈ విధంగా అవసరమైన జ్ఞానాన్ని సంపాదించుకుని లెక్చరర్ కావడానికి ప్రయత్నించవచ్చు.

పెద్దగా చదువుకోని వ్యక్తులు కాలేజీలో పాఠాలు చెబుతున్నట్లు వారి స్టైల్స్ చూసి వారు గొప్పవారు అనుకోవచ్చేమో గాని, వారికి ఎంత జ్ఞానం ఉందో విద్యార్థులకు మాత్రం స్పష్టంగా అర్థమౌతుంది.

ప్రస్తుతం ముస్లిమ్ సమాజ పరిస్థితి అలాగే ఉంది.

తోటివారికి మంచిని బోధించాలనుకోవడం సంతోషించదగిన విషయమే అయినప్పటికినీ, ఆ మంచి ఏమిటో తెలుసుకోకుండానే, తనకు చాలా జ్ఞానం ఉందని భ్రమిస్తూ తనకు తోచిన విధంగా బోధించడం ప్రమాదకరం.

ఇటువంటి ప్రమాదకర పరిస్థితిలో చిక్కుకున్న ముస్లిమ్ సమాజానికి శిక్షణ కావాలి. ముహమ్మద్(స)వారు తన అనుచరులకు ఇచ్చిన శిక్షణ వంటి శిక్షణను వారు పొందవలసి ఉంది. గ్రంథాల అధ్యయనం కూడా చేయవలసి ఉంది.

### గ్రంథాల అధ్యయనం

సంవత్సరం పొడవునా టీచర్ క్లాస్‌లో చెప్పింది వినకుండానూ,

''నిశ్చయంగా, అల్లాహ్ యొక్క దాసులలో **జ్ఞానం గలవారు మాత్రమే ఆయనకు భయపడతారు.** నిశ్చయంగా అల్లాహ్ సర్వశక్తిమంతుడు, క్షమాశీలుడు'' (ఖుర్‌ఆన్ 35:28)

చదవకుండానూ, తనకు ఏ మాత్రం అర్థం కాని ఏవో కొన్ని విషయాలను బట్టీపట్టి (కంఠస్థం చేసేసి) పరీక్ష పాసయి పోవచ్చేమోగాని, ఆ చదువు అతనికి జ్ఞానాన్నివ్వదు. ఇక ఇతరులకు అతను అర్థమయ్యేలా ఎలా బోధించ గలుగుతాడు?

'ఇస్లామ్' అనేది కొత్త జీవనవిధానం కాదని, ఈ ధర్మం తొలి మానవుని నుండి ఆచరణలో ఉంది అని తెలుసుకున్నవారు, ఈ చిట్టచివరి గ్రంథం (ఖుర్ఆన్) ముహమ్మద్(స)వారిపై ఎలా అవతరించిందో మొట్టమొదట తెలుసుకోవాలి. అందుకొరకు ముహమ్మద్(స)వారి జీవిత చరిత్రను క్షుణ్ణంగా తెలుసుకోవలసి ఉంది.

ముహమ్మద్(స)వారి గుణాల గురించి మరియు ఆయన యొక్క మహోన్నత శీలం గురించి తెలుసుకోకపోతే 'ఇస్లామ్'పై మనకు ఉన్న అవగాహనలో లోపం ఉన్నట్లే. అల్లాహ్ దయవలన అటువంటి పుస్తకాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రామాణిక ఆధారాలతో వ్రాసిన జీవిత చరిత్రను చదవండి. అల్లాహ్‌పై మరియు ముహమ్మద్(స)వారిపై ప్రేమలేని వారు ముస్లిమ్‌లవుతారా? కొత్తవారు ఇస్లాం స్వీకరించాక, మొట్టమొదట వారు తెలుసుకోవలసింది హరామ్ మరియు హలాల్ విషయాల గురించి. ఆ తరువాత ముహమ్మద్(స)వారి జీవిత చరిత్రను చదివితే ఖుర్ఆన్ అవగాహన సులభతరమౌతుంది.

ఖుర్ఆన్ వాక్యాలను వివరించే తఫ్సీర్ గ్రంథాలు ఈనాడు మనం ఖరీదు చేయగల ధరలో దొరుకుతున్నాయి. ఉదాహరణకు దారుస్సలామ్ వారి తఫ్సీర్ ఇబ్నె కసీర్ (10 వాల్యూమ్‌లు), మారిఫుల్ ఖుర్ఆన్ (ఇంగ్లీష్ 8 వాల్యూమ్‌లు సుమారు 6000 పేజీలు, ఉర్దూ 8 వాల్యూమ్‌లు) మొదలైనవి. ఇవి మాత్రమే కాకుండా ఎన్నో తఫ్సీర్ గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి.

వీటితోపాటు సహీహ్ హదీస్ గ్రంథాలు చదివితే, అవి మనకు జీవితంలోని ప్రతీ విషయంపై మంచి అవగాహన కలుగజేసి, మనకు స్పష్టమైన సన్మార్గాన్ని ప్రాక్టికల్‌గా అర్థమయ్యేలా చేస్తాయి.

**అందరికీ అందుబాటులో ఉన్నవి :**

సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిమ్, అబూదావూద్, తిర్మిదీ, నసాయీ, ఇబ్నెమాజా మొదలైనవి.

ఏదైనా ఓ ధార్మిక విషయంపై వివరణ కావాలనుకున్నప్పుడు, ఆ విషయానికి సంబంధించిన హదీస్‌ల నన్నింటినీ ఈ హదీస్ గ్రంథాలలో నుండి తీసుకుని, వాటిని అధ్యయనం చేస్తే అసలు విషయం స్పష్టమౌతుంది. కేవలం ఓ హదీస్‌ను తీసుకుని, దానిపై ఆధారపడి చెప్పేయడం సమంజసం కాదు.

ఉదాహరణకు, 'సాంబారు'ను నీటితో చేస్తామని చెబితే నవ్వుతారు. సాంబారును చింతపండుతో చేస్తారని, సాంబారును కందిపప్పుతో చేస్తారని, వివిధ కాయగూర ముక్కలతో కూడా చేస్తారని, వాటన్నింటి గురించి విడివిడిగా చెబితే, అది పరిపూర్ణం కాదు. అయితే అలా చెప్పడం తప్పు కూడా కాదు. కాని వీటన్నింటినీ కలిపి, 'సాంబారు' తయారు చేయబడుతుందని చెబితే, సాంబారు గురించి తెలియని వారికి కూడా ఆ మాట పరిపూర్ణంగా అర్థమౌతుంది.

ఖుర్ఆన్‌లో నుండి ఓ విషయాన్ని స్పష్టంగా తెలుసు కోవాలనుకున్నప్పుడు, ఉదాహరణకు గ్రంథప్రజల గురించి తెలుసు కోవాలనుకుంటే, గ్రంథ ప్రజల గురించి ఖుర్ఆన్‌లో చెప్పబడిన మొత్తం వాక్యాలను ఒక చోట వ్రాసుకుని, వాటన్నింటిని ఓ ఆర్డర్ (క్రమం)లో పెడితే గ్రంథ ప్రజల గురించి ఖుర్ఆన్ ఏమి చెప్పిందో స్పష్టంగా తెలుస్తుంది.

దురదృష్టకరమైన విషయమేమిటంటే, 'దావా'ను వృత్తిగానో, వ్యాపారంగానో చేసుకున్న కొందరికి ఈ హదీస్‌ల గురించే కాదు, ఈ హదీస్ గ్రంథాల పేర్లు కూడా తెలియదు. వారు అనుసరిస్తున్న దావా విధానమే కరెక్ట్ అని చెబుతారు. ముహమ్మద్(స)వారి విధానం ప్రకారం చేయాలని చెబితే వ్యతిరేకిస్తారు.

మరికొందరయితే, పూర్తి ఆయత్‌లనుగాని, పూర్తి హదీస్‌లని గాని తెలపకుండా, కేవలం తనకు అనుకూలంగా ఉండే కొన్ని హదీస్ భాగాలను గాని, ఆయత్ భాగాలను మాత్రమే చెబుతూ తప్పుదోవ పట్టిస్తున్నారు.

**అవగాహనా సదస్సులు**

దైవభీతి కలిగి ఖుర్ఆన్ మరియు హదీస్ జ్ఞానం గలవారి సమక్షంలో ఈ హదీస్‌లను ఎలా అధ్యయనం చేయవచ్చో నేర్చుకునే అవకాశముంది. ఈ రోజున 'దావా' ప్రోగ్రామ్స్ పేరుతో ఎన్నో సమావేశాలు జరుగుతున్నాయి. అయితే అవి జరిగే తీరుతెన్నులు చూస్తే, ఆ ప్రత్యేక ప్రోగ్రామ్స్ వలన కలిగే ప్రయోజనమేమిటో అర్థం కాదు. వాటి గురించి ఇక్కడ చర్చించడం కూడా అనవసరమే.

అందరూ చదువుకోవాలని పిలుపునిస్తూ, ప్రతీ ఒక్కరిని స్కూల్‌లో జాయిన్ చేసేసినంత మాత్రాన సరిపోతుందా? జాయిన్ చేసిన తరువాత వారు చదువుకునేలా చేయాలి కదా! వారి చేత అధ్యయనం చేయించాలి. అందుకొరకు బోధించే టీచర్లు కూడా కావాలి.

కాబట్టి 'కలిమా' చదివేసినంత మాత్రాన సరిపోదు. శిక్షణ తీసుకోవాలి. తదనుగుణంగా ఆచరించాలి.

(క్రింద ఇచ్చిన సమాచారం మేము పరిశోధనకు ఉపయోగించే గ్రంథాలలోనిది, గమనించగలరు.)

| గ్రంథం | వాల్యూమ్స్ | వివరాలు |
|---|---|---|
| **సహీహ్ బుఖారీ** | 9 వాల్యూమ్స్ | మొత్తం హదీస్‌లు 7,563 రిపీట్ అయినవి తీసివేస్తే 2,230 |
| **సహీహ్ ముస్లిమ్** | 7 వాల్యూమ్స్ | మొత్తం హదీస్‌లు 7,563 రిపీట్ అయినవి తీసివేస్తే 3,033 |
| **సునన్ అబూదావూద్** | 5 వాల్యూమ్స్ | మొత్తం హదీస్‌లు (దయీఫ్‌తో కలిపి) 5,274 |
| **జామి అత్-తిర్మిదీ** | 6 వాల్యూమ్స్ | మొత్తం హదీస్‌లు (దయీఫ్‌తో కలిపి) 3,956 |
| **సునన్ అన్-నసాయీ** | 6 వాల్యూమ్స్ | మొత్తం హదీస్‌లు (దయీఫ్‌తో కలిపి) 5,761 |
| **సునన్ ఇబ్నెమాజా** | 5 వాల్యూమ్స్ | మొత్తం హదీస్‌లు (దయీఫ్‌తో కలిపి) 4,341 |

స్కూలులో జాయిన్ అయిన ప్రతీ ఒక్కరూ గొప్పగా చదువుకుని, దాని ద్వారా లభించిన సంస్కారంతో, జ్ఞానంతో ఉత్తమంగా బ్రతికితే, వారిని చూసిన ప్రతీవారికి చదువు విలువ తెలుస్తుంది. అప్పుడు చదువు గురించి ప్రత్యేకంగా మన పిలుపు వినబడక ముందే, ప్రజలు తమ పిల్లలను స్కూలులో జాయిన్ చేస్తారు. ఇదే ప్రాక్టికల్ దావా.

ఆచరణ ద్వారా ఉన్నత విలువల గురించి సమాజానికి తెలియ జేయడం ముస్లిముల ప్రథమ కర్తవ్యం.

ఖుర్ఆన్ మరియు సున్నత్‌ల ప్రకారం ఉత్తమంగా జీవించిన ముస్లిమ్‌లను చూచి, ఆ కాలంలో ప్రజలు తండోపతండాలుగా ఇస్లామ్ స్వీకరించారు. నేడు అటువంటి ఆచరణ కల్గిన ముస్లిమ్‌ల సంఖ్య చాలా తక్కువ. అయినప్పటికీ వారి ప్రభావం సమాజంపై పడుతుంది.

ఈనాడు ప్రాక్టికల్ దావా అంటే, నైతిక అంశం ఏమాత్రంలేని ఖరీదైన సెట్టింగులు, ఖరీదైన అధునాతన డిజిటల్ కెమెరాలు, వీడియోలు, ఖరీదైన విందులు.

ఖుర్ఆన్ గ్రంథాన్ని, హదీస్ గ్రంథాలను చదవడం తగ్గిపోతుంది. మాటిమాటికి చదువవలసిన ఖుర్ఆన్ గ్రంథాన్ని సంవత్సరంలో ఎన్నిసార్లు చదువుతున్నారు? ఖుర్ఆన్ పఠనాన్ని తిరిగి అలవాటు చేసుకోవాలి.

## ఇస్లామ్ ప్రకారం సంస్కరణ

ఇస్లామ్‌లో పూజారి వ్యవస్థ, పాస్టర్ వ్యవస్థ, రబ్బీల వ్యవస్థల వంటి ప్రత్యేక వ్యవస్థ ఏదీ లేదు. ప్రతీ ముస్లిమ్ ప్రేమించవలసింది ప్రవక్త(స) వారి విధానాన్ని. కాని నేడు కొందరు వ్యక్తులను ఆదర్శంగా తీసుకుంటున్నారు. వారు ఖుర్ఆన్ మరియు సున్నత్‌లకు వ్యతిరేకంగా పనిచేస్తున్నా సరే, వారిని నిలదీయడం లేదు. ఇటువంటి పరిస్థితుల వల్లనే మునుపటి జాతులు అల్లాహ్ యొక్క మార్గాన్ని మార్చేసి నాశనమై పోయాయి.

అటువంటి పరిస్థితి ముస్లిమ్‌లకు రాకుండా, అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథాన్ని తన రక్షణలోనే ఉంచుకున్నారు. హదీస్ గ్రంథాలలోని ప్రామాణిక విషయాలు కూడా చాలా సురక్షితంగా ఉన్నాయి.

మనకు ఆదర్శం కేవలం ముహమ్మద్(స)వారు మాత్రమే!

ముహమ్మద్(స)వారి తొలి దావా ఆ మహనీయుని క్యారెక్టర్ ద్వారానే మొదలైంది. ముస్లిమ్‌కి కారెక్టర్ చాలా ముఖ్యమైనది. నిజమైన ముస్లిమ్ అబద్ధమాడలేడు. మోసం చేయలేడు. సౌమ్యంగా, సంస్కారంతో మాట్లాడుతాడు. మరి ముస్లిమ్‌లందరూ ఇలా ప్రవర్తిస్తూ చేసే దావా ఎంత గొప్పగా ఉంటుంది!

ముస్లిమ్ యువత మేలుకోవాలి. యువకులు/యువతులు వారి వారి ఏరియాల్లో గ్రూపులుగా మారి ఖుర్ఆన్ మరియు హదీస్ గ్రంథాలతో ఎవరో ఒకరి ఇంటిలో ఓ చిన్న గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసుకోండి. అందరూ కలిసి వారంలో ఒక్కరోజైనా సరే, మీకు అనుకూలంగా ఉండే కొంత సమయంలో వాటిని అధ్యయనం చేయండి. ఈ లైబ్రరీల మెయిన్‌టెనన్స్‌కి ఆర్థికంగా ఎవరిపై ఆధారపడకుండా ఉంటే మరీ మంచిది. ఇతర మతధర్మాల వారికి కూడా తప్పనిసరిగా ప్రవేశాన్ని కల్పించండి.

వారితో సౌమ్యంగా మాట్లాడటం, సున్నితంగా ప్రవర్తించడం చేయండి. **సౌమ్యం, సహనం, పరోపకారాలు ఇస్లామీయ జీవన విధానంలో ముఖ్యమైనవని** అందరూ అర్థం చేసుకునేలా ఆ లక్షణాలను అలవరచు కోవాలి.

## అల్లాహ్ యొక్క ప్రసంగం

అల్లాహ్ ప్రపంచ మానవాళి కోసం చేసిన ప్రసంగం, జిబ్రయీల్(అస) వారి ద్వారా ముహమ్మద్(స)వారికి, ఆ మహనీయుని ద్వారా ప్రపంచానికి అందింది.

నేటి బిజీ జీవితాల్లో మునిగిపోయిన వారు, దొరికిన కాస్త టైమ్‌లో కూడా టి.వి. చూడటం, వీడియోలు చూడటం చేస్తున్నారు. మరి అల్లాహ్ మనకోసం చేసిన ప్రసంగం మాటేమిటి?

ఆ ప్రసంగమే ఖుర్ఆన్ గ్రంథం రూపంలో మన ఇళ్ళల్లో ఉంది. ఖుర్ఆన్ అంటేనే మాటిమాటికి చదివే గ్రంథం. ముందుగా అల్లాహ్ ప్రసంగాన్నే చదువుదాం. ఆ తరువాతే ఏ ప్రసంగమైనా సరే. ఈ ప్రసంగం మానసిక ప్రశాంతతను కలుగజేస్తుంది. ఖుర్ఆన్ వాక్యాలు వింటున్నాము కదా అని ఆ గ్రంథాన్ని చదవడం మానవద్దు.

ఖుర్ఆన్ గ్రంథాన్ని ప్రతిరోజు చదవడం అలవాటు చేసుకుంటే ఓ గొప్ప అనుభూతి కలుగుతుంది. ఆ అదృష్టాన్ని దూరం చేసుకోవద్దు.

అల్లాహ్ యొక్క ప్రసంగం అందరినీ ఉద్దేశించింది. కాబట్టి ఏ మనిషికి ఎంతజ్ఞానం ఉందో, ఆ జ్ఞానానికి తగ్గట్టుగా ఖుర్ఆన్ అర్థమౌతుంది. అదే ఖుర్ఆన్ గ్రంథం యొక్క గొప్పతనం.

కొంతమందికి సందేహం రావచ్చు. ఏ సబ్జక్టు అయినా అంతే కదా! మనకున్న జ్ఞానాన్ని బట్టే అది అర్థమౌతుంది అని అనవచ్చు. 5వ తరగతి చదివే పిల్లలకు, వారి పుస్తకాలలోని విషయాలు వారి జ్ఞానానికి సరిపోయేలా ఉంటాయి. అయితే ఇవే విషయాలు, 10వ తరగతి చదివేవారికి చాలా సులభంగానూ, తక్కువ స్థాయి విషయాలుగా అనిపిస్తాయి. కాని మీరు జ్ఞానంలో ఎంత స్థాయికి ఎదిగినా సరే, ఆ స్థాయికంటే ఎక్కువగానే ఖుర్ఆన్ విషయాలు కనిపిస్తూ ఉంటాయి.

కాబట్టి తీరిక సమయాల్లో **ఖుర్ఆన్** ఎక్కువగా చదవండి. చదివిన ప్రతీసారి ఓ కొత్త అనుభవం ఇన్షాఅల్లాహ్ మీకు కలుగుతూనే ఉంటుంది.

## సవాళ్ళు

ఓ మతధర్మం వారు ఛాలెంజ్ చేస్తున్నారని, వారికి జవాబు చెప్పకపోతే మన గురించి తక్కువచేసి చెబుతారని, మన ప్రతిష్ఠ తగ్గిపోతుందని కొందరు సోదరులు భావిస్తున్నారు.

ఇస్లాం ప్రతిష్ఠ ఒకరి వలన తగ్గిపోయేది గాని, పెరిగిపోయేది గాని కాదు. ఇస్లాం సత్యమైనది మరియు తేజోవంతమైనది.

అయితే ఈ సవాళ్ళ కోసం, డిబేట్‌ల కోసం ఉవ్విళ్ళూరే వాళ్ళు నిజంగా ఖుర్‌ఆన్ గ్రంథాన్ని విశ్వసిస్తున్నారా?

నిజంగా విశ్వసిస్తే, ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఏమి ఆదేశించారో అలాగే ప్రవర్తించాలి కదా! క్రింది వాక్యం చూడండి :

**"ఎవరికైతే మేము గ్రంథాన్ని ప్రసాదించామో! వారు తమ పుత్రులను గుర్తించినట్లు, ఇతనిని (ముహమ్మద్-స) కూడా గుర్తిస్తారు. ఎవరైతే తమను తాము నష్టానికి గురిచేసుకుంటారో అలాంటివారే విశ్వసించరు"** (ఖుర్‌ఆన్ 6:20)

ఎవరైనా తమ పిల్లలను గుర్తించినంత సులభంగా మరెవరిని గుర్తు పట్టగలరు? ఆ విధంగా గ్రంథ జ్ఞానం కలవారు 'ముహమ్మద్(స)' వారిని అంత సులభంగా గుర్తుపడతారు.

మీమీ గ్రంథాలలో మా ప్రవక్త(స) వారి గురించి ఉంది అని చెప్పుకోవలసిన అవసరమేమిటి?

**'మీ గ్రంథంలో ముహమ్మద్(స)'** అంటూ మరోధర్మం వారితో డిబేట్స్ ఎందుకు? వారు ముహమ్మద్(స)వారిని గుర్తుపడతారని అల్లాహ్‌యే చెబుతున్నారు కదా! అల్లాహ్ మాటపై విశ్వాసం లేదా?

క్రింది ఖుర్‌ఆన్ వాక్యాన్ని గమనించండి :

**"ఎవరైతే ఈ సందేశహరుణ్ణి నిరక్షరాస్యుడైన ఈ ప్రవక్తను అనుసరిస్తారో! ఎవరి ప్రస్తావన వారి వద్దనున్న తౌరాత్ మరియు ఇంజీల్ గ్రంథాలలో వ్రాయబడి ఉన్నదో, అతను వారికి ధర్మమును ఆదేశిస్తాడు మరియు అధర్మము నుండి నిషేధిస్తాడు మరియు వారి కొరకు పరిశుద్ధమైన వస్తువులను ధర్మ సమ్మతం చేసి అపరిశుద్ధమైన వాటిని నిషేధిస్తాడు. వారిపై మోపబడిన భారాలను మరియు వారి నిర్బంధాలను తొలగిస్తాడు. కావున అతనిని సమర్థించి, అతనితో సహకరించి, అతనిపై అవతరింప జేయబడిన జ్యోతి (ఖుర్‌ఆన్)ని అనుసరించేవారు మాత్రమే సాఫల్యం పొందేవారు"** (ఖుర్‌ఆన్ 7:157)

పై వాక్యాలను బట్టి మన పని కేవలం చెప్పడం వరకే. ముహమ్మద్(స) గురించి మనం చెబితే, గ్రంథ జ్ఞానం కలవారు ఆయనను గుర్తిస్తారు. ఎవరు తమను తాము నష్టానికి గురిచేసుకుంటారో వారు విశ్వసించరు. అలా విశ్వసించనివారిని మనం విశ్వసింపజేయలేము కదా!

**"మీ గ్రంథంలో మా ప్రవక్త, మా గ్రంథంలో మీ ప్రవక్త"** అని డిబేట్‌లు పెట్టుకునేవారికి పై వాక్యాలు కళ్ళు తెరిపిస్తాయని ఆశిస్తున్నాము.

ఇక మరో డిబేట్ ఏమిటంటే **'ప్రవక్త ఆరాధ్యుడా?'** అనే విషయంపై

**"నిశ్చయంగా, అల్లాహ్ దృష్టిలో 'ఈసా ఉపమానం, ఆదం ఉపమానం వంటిదే. ఆయన (ఆదమ్‌ను) మట్టితో సృజించి : "అయిపో!" అని అన్నాడు. అంతే అతను అయిపోయాడు."**

**"ఈ సత్యం నీ ప్రభువు తరఫునుండి వచ్చింది, కావున నీవు శంకించే వారిలో చేరిన వాడవు కావద్దు"**

**"ఈ జ్ఞానం నీకు అందిన తరువాత కూడా ఎవడైనా నీతో అతనిని (ఈసా-అ) గురించి వివాదానికి దిగితే ఇలా అను : "రండి! మేము మరియు మీరు కలిసి, మా కుమారులను మరియు మీ కుమారులను, మా స్త్రీలను మరియు మీ స్త్రీలను పిలుచుకుని, అందరమూ కలిసి : 'అసత్యం పలికే వారిపై అల్లాహ్ శాపం పడుగాక! అని హృదయపూర్వకంగా ప్రార్థిద్దాము"**

(ఖుర్‌ఆన్ 3:59-61)

పై ఖుర్‌ఆన్ వాక్యంలో వివాదానికి దిగితే ఏం చేయాలో స్పష్టంగా అల్లాహ్‌తాలా చెప్పారు. "ఈ జ్ఞానం నీకు అందిన తరువాత" అని అన్నారు. ముస్లిమ్‌ల తరపున డిబేట్‌లో పాల్గొనే వ్యక్తి తన జీవితంలో ఒక్కసారైనా ఖుర్‌ఆన్ చదివి ఉంటాడు. మరి ఖుర్‌ఆన్ జ్ఞానం అందిన తరువాత, అల్లాహ్ చెప్పినట్లే చేయాలి కదా!

అల్లాహ్ చెప్పినట్లు చేస్తే ఏ డిబేట్ కూడా ఉండదు. పై ఖుర్‌ఆన్ ఆదేశాన్ని గౌరవించకుండా నిర్లక్ష్యం చేసి, డిబేట్స్ జరిపితే అలాంటి డిబేట్స్ కొన్ని వందల సంవత్సరాలపాటు జరుగుతూనే ఉంటాయి. వాటికి అంతం ఉండదు.

**వేరే ధర్మం వారి ఛాలెంజ్‌ని గౌరవిస్తున్నారో, లేక ఖుర్‌ఆన్ వాక్యాన్ని గౌరవిస్తున్నారో ఓసారి ఆలోచించుకోవాలి.**

ఈ డిబేట్లు ఎలా జరుగుతున్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. డిబేట్ అయిపోయిన తరువాత, "అతను సరిగ్గా చెప్పలేకపోయాడు. మా గురువుగారు ఉన్నారు. అతను గొప్ప జ్ఞాని. ఆయనను తీసుకు వస్తాము" అని చెబుతూ మరో డిబేట్ పెట్టుకుంటారు. వీటికి ముగింపు ఉండదు.

ప్రస్తుతం వ్యక్తిగత పేరూ ప్రతిష్ఠల కోసమో, ఆర్థిక వనరులు సమకూర్చు కోవడం కోసమో ప్రధానంగా ఈ డిబేట్స్ జరుగుతున్నాయి. వీటిలో మరీ బరితెగించిన విషయం ఏమిటంటే తూర్పుగోదావరి జిల్లా పిట్టలదొర వంటివారు వేరే మతధర్మం వారితో డిబేట్స్ పెట్టుకుని, ఆ మతధర్మం వారు ముహమ్మద్(స)పై నీచమైన నిందారోపణలు వేస్తే, సమాధానం చెప్పడానికి బదులు, ఆ మతస్థులను పొగుడుతాడు. ఇది వారితో చేసుకున్న ఓ పైశాచిక ఒప్పందమా అని అనుమానవ రాక మానదు.

ఖుర్‌ఆన్ మరియు హదీస్ జ్ఞానమున్నవారు, వీటిని చూసి కూడా ఆపడం లేదు. ఒకవేళ అది తప్పు అని ఎవరైనా ఖండిస్తే, మా గురువుగారి స్థాయి ఏమిటి? నీ స్థాయి ఏమిటి? అని చెబుతూ వ్యక్తి పూజ వైపు మరలిపోతున్న ఇలాంటి వ్యక్తులు తెలుసుకోవలసిన వాస్తవాలు చాలా ఉన్నాయి.

రెండవ ఖలీఫా ఉమర్(రజి)వారి గురించి ముహమ్మద్(స)వారు చెబుతూ, ఉమర్(రజి) ఒక వీధినుండి వస్తూ ఉంటే, షైతాన్ మరో వీధి గుండా పారిపోతాడని చెప్పడం జరిగింది. ఉమర్(రజి) ఆత్మాభిమానం, శౌర్యం ఎలాంటివో ఆయన జీవిత చరిత్ర చదివిన వారికి స్పష్టంగా తెలుస్తుంది.

అటువంటి ఖలీఫా, తన నౌకరును వాహనంపై కూర్చోబెట్టి, ఆ వాహనంతో పాటు నడిచి వెళుతున్నప్పుడు ఎవరు ఖలీఫాయో, ఎవరు నౌకరో తెలియని పరిస్థితి.

కాని నేడు కేవలం నోరు ఉంటే చాలు. కాస్త ఆపకుండా గట్టిగా మాట్లాడగలిగితే చాలు, అతనిని ఆకాశానికి ఎత్తేసి, అతని చుట్టూ మందీ మార్బలం చేరిపోవడం జరుగుతుంది.

ఖుర్'ఆన్ మరియు సున్నత్‌కు అత్యంత విలువనిచ్చే మరియు వాటి ప్రకారం ఆచరించే ఉమర్(రజి) వంటి విశ్వాసుల నాయకుడినే ఓ వృద్ధురాలు నిలదీసి అడగడం జరిగింది.

మరి నేటి ప్రసంగ నాయకులు, వారు ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్నా సరే ముస్లిమ్ సమాజం మౌనంగా ఉంది. అంటే ఖుర్'ఆన్ మరియు సున్నత్‌లకు ఈ సమాజం ఎంత దూరమైందో స్పష్టంగా తెలుస్తుంది.

ఈ మధ్యకాలంలో 'జ్ఞానానంద' మొదలైన దొంగస్వాముల బండారాలు బయటపడుతున్నాయి. అయినా సరే అటువంటి బాబాలకు, స్వాములకు ఆదరణ తగ్గడం లేదు. నేటి ప్రజలకు సత్యం అవసరం లేదు అనిపిస్తుంది.

ఇస్లాం ధర్మంలో ఇటువంటి పరిస్థితి రాకుండా ఖుర్'ఆన్ మరియు హదీస్ గ్రంథాలున్నాయి. ముస్లిమ్‌లు వాటికి దూరం అవుతున్న కొద్దీ, వారి గౌరవం దూరమవుతూ ఉంది. అలాగే అభివృద్ధికి కూడా వారు దూరమవుతూ ఉన్నారు. అంతేకాకుండా దావత్‌లో విపరీత పోకడలు చోటు చేసుకుంటున్నాయి.

### బహిరంగంగా మాట్లాడకపోతేనే మంచిది

సౌమ్యంగా సహనంతో మాట్లాడలేనివారు, బహిరంగంగా మాట్లాడక పోతేనే మంచిది. ఖుర్'ఆన్ మరియు సున్నత్ ప్రకారం దావత్ ఇవ్వలేని వారు, ఇవ్వకపోతేనే మంచిది. పరమత ధర్మాల వారిని రెచ్చగొట్టేలా మాట్లాడేవారు, ఎదుటి వ్యక్తుల మనస్సులను గాయపరిచేవారు దావత్ ఇస్తే, మేలు కంటే కీడే ఎక్కువ జరుగుతుంది.

### ఇతర గ్రంథాలతో దావా వద్దంటే .....

అల్లాహ్ మార్గం వైపు పిలవడానికి అల్లాహ్ గ్రంథంలోని సందేశాల తోనే పిలుద్దాం. ఇతర గ్రంథాలతో దావత్ ఇవ్వడం హాస్యాస్పదమని ఇది వరకే చెప్పుకున్నాం. ఇతర గ్రంథాలతో దావా చెయ్యవద్దంటే, దాని అర్థం ఇతర ధర్మాలవారిని శత్రువులుగా చూడమని కాదు. వారు కూడా ఆదమ్ సంతానమే! **వారిని కూడా ప్రేమగానూ గౌరవంగానే చూడాలి.**

### విశ్వసోదర భావానికి విఘాతం

ప్రవక్త(స)వారి విధానం సౌమ్యమైన, సహనంతో కూడిన విధానం. దాని ప్రకారం నడుచుకుంటే సమాజంలో గౌరవాన్ని పొందడమే కాకుండా, అల్లాహ్ యొక్క కరుణ మనపై ఉంటుంది. ఆ విధానం వదిలేసిన వారికి మిగిలేది అవమానమే. ఇస్లామ్ బోధించే 'విశ్వ సోదర భావాని'కి విఘాతం కలిగించే డిబేట్లను ప్రోత్సహించ వద్దు. వాటిని ఆపండి లేదా అల్లాహ్ పేరుతో వాటిని ఆపడానికైనా ప్రయత్నించండి.

### ఎవరిని అనుసరించాలి? ఎవరిని అనుసరించ కూడదు?

ఖుర్'ఆన్ గ్రంథంలో ఎన్నో చోట్ల సర్వమానవాళిని ఉద్దేశించి అల్లాహుతాలా, 'ముహమ్మద్(స)'వారిని అనుసరించమని చెప్పడం జరిగింది. క్రింది వాక్యాలను కూడా చదివి ఆలోచించండి.

> **"ఓ విశ్వసించిన ప్రజలారా! మీరు గ్రంథ ప్రజలలో కొందరి (మాటలు విని) వారిని అనుసరిస్తే, వారు మిమ్మల్ని, విశ్వసించిన తరువాత కూడా సత్యతిరస్కారులు (కాఫిర్లు)గా మార్చివేస్తారు.**
> (ఖుర్'ఆన్ 3:100)
>
> **"మరియు అల్లాహ్ సందేశాలు మీకు చదివి వినిపించబడుతూ ఉన్నప్పుడు మరియు ఆయన సందేశహరుడు మీలో ఉన్నప్పుడు, మీరు ఎలా సత్యతిరస్కారులు(కాఫిర్లు) కాగలరు? మరియు మీలో ఎవడు స్థిరంగా అల్లాహ్‌ను ఆశ్రయిస్తాడో, అతడు నిశ్చయంగా ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం పొందినవాడే!**
> (ఖుర్'ఆన్ 3:101)

పై వాక్యాలని బట్టి 'అల్లాహ్ సందేశాలను చదువుతూ, వింటూ సున్నత్ ప్రకారం ఆచరించేవాడు కాఫిర్ కాలేడు'. అల్లాహ్‌ను విశ్వసించిన తరువాత కూడా ఎవరిని అనుసరిస్తే కాఫిర్లు అయ్యే ప్రమాదం ఉందో కూడా చెప్పడం జరిగింది.

వాదనకు దిగితే ఏమి చేయమని అల్లాహుతాలా చెప్పారో, దానిని చేయకుండా వాదనకు రమ్మని వారు ఆహ్వానించినపుడు వారిని అనుసరిస్తే ఏమవుతుందో ఆలోచించండి.

### ఖుర్'ఆన్ గ్రంథంలో పేర్లు ఎలా ఉంటే అలాగే పలకండి :

1400 సం॥లు దాటినా ఒక్క అక్షరం కూడా మారని దివ్య సందేశం - ఖుర్'ఆన్. అందులోని పేర్లు ఎలా ఉన్నాయో అలాగే పలకండి. అవే సత్యమైనవి. అల్లాహ్ పేరుతో సహా, ప్రవక్తల పేర్లు కూడా చెప్పిన విధంగానే పలకాలి. హజ్రత్ 'మర్యమ్' పేరు మర్యమ్‌గానే పలకండి. యాకూబ్(అ) వారి పేరు యాకూబ్(అ)గానే పలకండి. ఇబ్రాహీమ్(అ) పేరును ఇబ్రాహీమ్(అస) అనే పలకండి. ఖుర్'ఆన్ గ్రంథంలో తెలిపిన ఈ pronounciation కరెక్ట్. ఈ విషయాలను మాచే ప్రచురించబడిన 'సృష్టికర్త పేరు ఏమిటి?' పుస్తకంలో వివరించాము. కొన్ని ముఖ్య విషయాలను వచ్చే సంచికలో అందిస్తాము, ఇన్షాఅల్లాహ్.

---

**దావత్ ప్రతీ ముస్లిమ్ స్త్రీ / పురుషుల యొక్క బాధ్యత అని మరచి పోవద్దు. మీకు స్పష్టంగా తెలిసిన విషయాన్నే తోటివారికి చెప్పండి. మంచిని బోధించండి. చెడును నిరోధించండి. మంచి సంకల్పంతో ఈ పనులు చేసేవారిపై అల్లాహ్ కరుణ ఉంటుంది.**

**మనకి 'అల్లాహ్'యే చాలు.**

**అల్లాహ్ మార్గం గురించి తెలిపేటప్పుడు, ఎవ్వరినీ విసిగించవద్దు. వారి మనస్సును గాయపరచవద్దు. ఖుర్'ఆన్ గ్రంథంలో అల్లాహ్ చెప్పిన మంచి శుభవార్తలను అందించండి. అదే విధంగా చెడు వలన కలిగే నష్టాన్ని వివేకంతో అర్థమయ్యేలా చెప్పండి.**

# బాలబాలికలకు ప్రత్యేకం

ప్రతీ స్త్రీ లేదా పురుషునికి తొలి బడి అమ్మ ఒడి. గొప్ప గొప్ప జ్ఞానులు, మేధావుల వెనుక తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంటుంది. తొలి గురువులు తల్లిదండ్రులే. ఆ తరువాతనే, పాఠశాలలో చేరిన దగ్గరనుండి, మిగిలిన గురువులు పరిచయమౌతారు. వీరందరినీ మీరు గౌరవించాలి. అయితే వీరందరికీ జ్ఞానాన్ని ఇచ్చిన సృష్టికర్తే విశ్వమంతటికీ గురువు - ఆయనే 'అల్లాహ్'. ఏ గురువు చెప్పినా అర్థం కాకపోయినా లేక మరేదైనా చెప్పుకోలేని సమస్య మీకొస్తే డైరెక్టుగా అల్లాహ్‌నే అడగండి. ఆయన వింటాడు. మీకు జవాబు కూడా వస్తుంది.

అయితే ఇక్కడ ఓ ముఖ్యవిషయాన్ని మీకు ఓ ఉదాహరణ ద్వారా చెబుతాను. సెల్‌ఫోన్‌లో మాట్లాడేటప్పుడు, మీ వైపు సిగ్నల్ సరిగ్గా లేకుంటే, అవతలి వ్యక్తి మాటలు మీ సెల్‌కు చేరవు కదా! అలాగే 'అల్లాహ్' ఇచ్చిన సమాధానం మీకు అర్థమవ్వాలంటే, మీ సిగ్నల్ బలంగా ఉండాలి. సెల్‌ఫోన్ సిగ్నల్ కాదు. అల్లాహ్‌పై మీ మనస్సులో ఉన్న విశ్వాసం చాలా బలంగా ఉండాలి. ఖుర్ఆన్‌ను, ముహమ్మద్(స) వారి బోధనలను (హదీసులను) అర్థం చేసుకుని, వాటి ప్రకారం మీరు ఆచరిస్తే, క్లాసులో మీరే టాప్ రేంకర్స్. విజయులు మీరే. అలా కాకపోతే అడగండి!

## మీకు స్కూలులో ఇలా నేర్పి ఉంటారు

1. *The Greeks were the developers of trigonometry.*

ట్రిగొనోమెట్రీ (త్రికోణమితి)ని గ్రీకులు అభివృద్ధి చేశారు.

2. *The use of decimal fractions in mathematics was first developed by a Dutchman, Simon Stevin, in 1589. He helped advance the mathematical sciences by replacing the cumbersome fractions, for instance, 1/2, with decimal fractions, for example, 0.5.*

గణితశాస్త్రంలో డెసిమల్ భిన్నాలను ఉపయోగించడాన్ని మొట్ట మొదట సైమన్ స్టెవిన్ అనే డచ్ దేశస్థుడు 16వ శతాబ్దం చివరిలో అభివృద్ధి చేశారు. ఇబ్బందితో కూడిన భిన్నాల స్థానంలో డెసిమల్ భిన్నాలను ఉపయోగించడం ద్వారా గణితశాస్త్రం అభివృద్ధి కావడంలో ఈయన సహకరించారు. ఉదాహరణకు 1/2 అనే భిన్నం ఉండే స్థానంలో 0.5 నుంచాలి.

## కాని మీరు తెలుసుకోవల్సిన అసలు నిజం ఏమిటంటే ..

1. *Trigonometry remained largely a theoretical science among the Greeks. It was developed to a level of modern perfection by Muslim scholars, although the weight of the credit must be given to al-Battani. The words describing the basic functions of this science, sine, cosine and tangent, are all derived from Arabic terms. Thus, original contributions by the Greeks in trigonometry were minimal.*

ట్రిగొనోమెట్రీ అనేది గ్రీకులలో చాలావరకూ ఓ సైద్ధాంతిక సైన్స్‌గానే మిగిలిపోయింది. దానిని నేటి ఆధునిక ఖచ్చితత్వానికి సరిపోయేలా అభివృద్ధి చేసింది ముస్లిమ్ విద్వాంసులే! అయితే ఆ క్రెడిట్‌ను 'అల్-బత్తాని' గారికి ఇవ్వాలి. ఈ 'సైన్స్‌కి సంబంధించిన ప్రాథమిక విధులను వర్ణించే 'సైన్, కొసైన్ మరియు టాంజెట్' పదాలు అరబీ పదాల నుండే ఉత్పన్నమయ్యాయి. ఆ విధంగా ట్రిగొనోమెట్రీలో గ్రీకుల తోడ్పాటు తక్కువే.

2. *Muslim mathematicians were the first to utilize decimals instead of fractions on a large scale. Al-Kashi's book, Key to Arithmetic, was written at the beginning of the 15th century and was the stimulus for the systematic application of decimals to whole numbers and fractions thereof. It is highly probable that Stevin imported the idea to Europe from al-Kashi's work.*

వాస్తవానికి మొట్టమొదటగా ముస్లిమ్ గణితశాస్త్రజ్ఞులు భిన్నాలకు బదులుగా పెద్దమొత్తంలో డెసిమల్స్‌ను ఉపయోగించారు. అల్-కాషి యొక్క పుస్తకం '*Key to Arithmetic*' 15వ శతాబ్దపు ప్రారంభంలోనే వ్రాయబడింది. క్రమబద్ధంగా డెసిమల్స్‌ను ఉపయోగించడానికి ప్రేరణ ఆ పుస్తకమే. అల్-కాషి వర్క్‌నే యూరప్‌కి తీసుకెళ్లింది స్టెవిన్ అయివుండవచ్చు.




సల్లల్లాహు అలైహి వసల్లమ్ (అల్లాహ్ నుండి మీపై శుభాశీస్సులు మరియు శాంతి కలుగుగాక!)

## సకల లోకాలకు కారుణ్యం (రహమతులిల్ ఆలమీన్)

ప్రతీ మనిషికి జీవితంలో ఓ లక్ష్యముంటుంది. ఆ లక్ష్య సాధన కోసం ఆత్మవిశ్వాసంతో కృషి చేయవలసి ఉంటుంది. ఈ లోకంలో ఏ పని అయినా సరే సులభంగా చేయగలగాలంటే, 'కష్టమొచ్చినా, సుఖమొచ్చినా' కూడా సంతోషంగా బ్రతకాలంటే అందరికీ కావలిసింది ఒక్కటే. అదేమిటంటే మనందరినీ సృష్టించిన ఆ సృష్టికర్త యొక్క కరుణ. సృష్టికర్త 'అల్లాహ్' యొక్క కరుణను మనం పొందాలి. ఎలా?

సారవంతమైన నేలపై వర్షం కురిస్తే పచ్చిక, గడ్డి మొలుస్తాయి. ఆ వర్షమే లేకపోతే ఎంతటి సారవంతమైన నేల అయినా సరే, పంటను ఇవ్వదు మరియు మానవుల కొరకు, పశువుల కొరకు నీటిని నిలిపి ఉంచలేదు. ఇదే విధంగా అల్లాహ్ యొక్క కరుణ మనపై కురవాలి. లేదంటే మన జీవితం కూడా వృథాయే!

తొలి మానవుడు ఈ భూమిపై అడుగుపెట్టినప్పటి నుండి అల్లాహ్ యొక్క కరుణ మానవులపై కురుస్తూ వచ్చింది. సుమారు 1,24,000 మందికి పైగా దైవప్రవక్తలను అల్లాహ్ పంపించారు. వారంతా అల్లాహ్ యొక్క కరుణను పొందే మార్గాన్ని ఆచరించి చూపారు. ఈ ప్రవక్తల పరంపరలో చిట్టచివరి ప్రవక్త మరియు సందేశహరులైన ముహమ్మద్(స) వారిని ఈ లోకం కొరకే కాక, సకల లోకాలకు 'కారుణ్యం'గా పంపించానని స్వయంగా 'అల్లాహ్'యే ఖుర్ఆన్ ద్వారా తెలియజేశారు.

మరి ఈ సకలలోకాలకు కారుణ్యమైన (రహమతులిల్ ఆలమీన్) ముహమ్మద్(స) గురించి ముస్లిములలో చాలా కొద్దిమందికే తెలుసు. ఇలా ఎందుకంటున్నామంటే, ఆ 'కారుణ్యమూర్తి' యొక్క మహోన్నత శీలంపై ఎందరో ప్రపంచవ్యాప్తంగా బురద చల్లుతుంటే అధికశాతం ముస్లిములు మౌనంగా ఉన్నారు. ఈ మౌనానికి కారణం, వారి దగ్గర చాలా వాటికి సమాధానాలు లేవు. ముహమ్మద్(స)వారి గురించి వారికి స్పష్టంగా తెలియదు.

ఆయన(స) జీవిత చరిత్రపై ఎన్నో పుస్తకాలు ప్రచురించబడ్డాయి. కొన్ని పుస్తకాలు ప్రామాణిక హదీసులపై ఆధారపడితే, మరికొన్ని పుస్తకాలు నవలా రూపంలో ప్రచురించబడ్డాయి.

ఇన్ని పుస్తకాలుండగా, మరలా కొత్తగా 'శాంతిబాట'లో ఎందుకు ప్రచురించాలి అనే సందేహం కొందరిలోనైనా కలుగుతుంది. అందుకని ముందుగానే వివరణ ఇవ్వడం మంచిదని భావించాము.

మన 'శాంతిబాట' ఆశయం : ఖుర్ఆన్ మరియు సున్నత్ ఆచరణల ద్వారా సంతోషమయ జీవితాన్ని ఎలా పొందవచ్చో ప్రాక్టికల్‌గా అర్థ మయ్యేటట్లు చెప్పి, ఆ గ్రంథాల అధ్యయనం వైపు ముస్లిములను ప్రోత్సహించడం. అంతేకాకుండా ఇస్లామ్‌పై జరగుచున్న దుష్ప్రచారాన్ని ఖండించడం.

ఈ రాష్ట్రంలో నెలకొని ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, ముస్లిములనే కాకుండా ముస్లిమేతరులను కూడా ఆలోచింప జేసేలా ఈ మహనీయుని జీవితచరిత్రను ప్రామాణిక ఆధారాలతో అందించాలని, అల్లాహ్ పేరుతో మేము చేస్తున్న ఈ ప్రయత్నం సఫలీకృతమయ్యేలా 'దువా' చేయమని మా పాఠకులకు మనవి చేసుకుంటున్నాము.

'ఇస్లామ్' సత్యధర్మం. ఇందులో నటనకు, అబద్ధాలకు, కల్పితాలకు అవకాశం లేదు. అందుకే ముహమ్మద్(స)వారిపై సినిమాలు రాలేదు. 'వ్యక్తి పూజ'ను నిషేధించిన ఇస్లామ్, అటువంటి పరిస్థితి ఈ జీవన విధానంలో ప్రవేశించకుండా, ప్రవక్త(స)వారి చిత్రాన్ని గీయడానికి కూడా అనుమతి నివ్వలేదు.

ముహమ్మద్(స)వారి ఫొటోలు, వీడియోలు లేకపోవచ్చుగాని, వీటికి మించి ఆయన(స) యొక్క ఆచరణలను, ప్రతీ ముస్లిమ్ అనకరిస్తూ ఉండటం వలన, ముహమ్మద్(స)వారి ఆచరణలు ప్రతీ ముస్లిమ్‌లో సజీవంగా కనిపిస్తూనే ఉన్నాయి.

ముహమ్మద్(స)వారి జీవిత చరిత్ర వాస్తవమైనది కనుక, నవలా రూపంలో కాకుండా, ఈ చరిత్రను వాస్తవ రూపంలో, ఇన్షాఅల్లాహ్, అందించాలనేది మా ప్రయత్నం.

### అరబ్బులు

ఈ జీవితచరిత్ర ప్రారంభంలో అరబ్బుల గురించి ప్రత్యేకంగా చెప్పడానికి ఓ ముఖ్య కారణముంది. అదేమిటంటే, అరబ్బుల విషయంలో చాలామంది ముస్లిమ్‌లలో కూడా ఓ అపోహ ఉంది. ముందుగా ఆ అపోహను తొలగించవలసి ఉంది.

ఇస్లామ్ పున:ప్రారంభానికి ముందు అరబ్బులు అనాగరికంగా, అజ్ఞాన అంధకారంలో ఉండేవారని, 'ఇస్లామ్' వారిని నాగరీకులుగా సంస్కరించి, ప్రపంచంలోని సగభాగానికి చక్రవర్తులుగా ఉన్నత స్థానానికి తీసుకెళ్ళింది అని చెప్పుకుంటాం.

---

నిజమే! అందులో ఎటువంటి సందేహం లేదు. కాని అరబ్బులు అన్నింటిలోనూ అనాగరికులు కాదు. అదే విధంగా వారి అజ్ఞానం కూడా కొన్ని విషయాలకే పరిమితం. అయితే ఆ కాలంలో ఇతర జాతులలో లేనటువంటి కొన్ని సుగుణాలు కూడా అరబ్బులలో ఉండేవి.

---

అరబ్బుల గురించి సరియైన విధంగా అర్థం చేసుకోకపోతే ప్రవక్త(స)వారి జీవితంలోని కొన్ని ముఖ్య ఘట్టాలు స్పష్టంగా మనకు అర్థం కావు.

**వర్గాలు :** అరబ్బులను 3 వర్గాలుగా చెప్పవచ్చు.

1. **అల్-బాయిదా అరబ్బులు** : వీరిలో దాదాపు 6 తెగలు (tribes) ఉండేవి. మక్కాలో 'ఇస్లామ్' పున:ప్రారంభానికి ముందే ఈ అల్-బాయిదా అరబ్బులు అంతరించి పోయారు.
2. **అల్-ఆరిబా అరబ్బులు** : వీరినే ధక్షిణ ప్రాంత అరబ్బులు అని కూడా అంటారు. యమన్ దేశపు రాజులు ఈ కోవకు చెందినవారే.
3. **అద్నానియ్య అరబ్బులు** : ఈ పేరు ఎలా వచ్చింది అంటే, వీరు 'అద్నాన్' వంశీయులు కనుక. దైవప్రవక్త ఇబ్రాహీమ్(అస)వారి కుమారులు 'ఇస్మాయీల్'(అస)వారి వంశీయుడే 'అద్నాన్'. వీరు అరబైజ్డ్ అరబ్బులు. అద్నానియ్య అరబ్బులు ఉత్తర ప్రాంతానికి చెందినవారు. వారి మాతృభూమి 'మక్కా'.

ఇబ్రాహీమ్(అస)వారు, తన సతీమణి హాజరాను మరియు తన కుమారుడు ఇస్మాయీల్(అస)ను మక్కాలో వదిలిపెట్టినప్పుడు, ఇస్మాయీల్(అస) 'జుర్హుమ్' అనే (అరబ్ తెగ) వారి మధ్యలో పెరిగి పెద్దవారయ్యారు. ఇస్మాయీల్(అస) అరబీ భాషను వారి నుండే నేర్చుకున్నారు. ఆ తెగకు చెందిన స్త్రీనే వివాహమాడారు. ఆ విధంగా ఆయన సంతానం అరబ్బులుగా పెరిగారు.

అయితే, ఇస్మాయీల్(అస)వారి ప్రారంభపు వారసులలోని ముఖ్యులు 'అద్నాన్'గారు. **వీరే ముహమ్మద్(స)వారి పూర్వీకులు.** ముఖ్యమైన అరబ్ తెగలను మరియు వాటి ఉపతెగలను కూడా 'అద్నాన్' తెగకే ఆపాదిస్తారు.

'అద్నాన్'గారి తరువాత మ'అద్, తరువాత నిజార్, ఆ తరువాత ఆయన కుమారులు **ముదర్, రబీఅహ్.**

1. **రబీఅహ్** వారసులు తూర్పు భాగంలో సెటిల్ అయ్యారు. 'అబ్దుల్ ఖైస్' బహ్రెయిన్ లోనూ, 'హనీఫా' యమామాలోనూ, బక్ర్ వాయిల్ వారి సంతానం బహ్రెయిన్ మరియు యమామా మధ్యభాగంలోనూ, 'తమీమ్' బస్రాలోని బాదియాలో, 'తగలబ్' (అరేబియా) ద్వీపకల్ప భూభాగంలో, దిజ్లా మరియు యూఫ్రేట్స్ మధ్యభాగంలో నివాశం ఏర్పరచుకున్నారు.
2. **ముదర్** వారసులలోని 'సలీమ్' అల్-మదీనాలో, 'తఖీఫ్' తాయిఫ్‌లో, 'హవాజిన్' మక్కా తూర్పుభాగంలో తూర్ప తైమా నుండి పశ్చిమ కూఫా వరకు అసద్ వారసులు, తైమా నుండి హవరాన్ వరకు గల ప్రాంతంలో ధుబ్యాన్ మరియు అబ్స్ నివాసమేర్పరచు కున్నారు.

వంశవృక్షాల గురించి చెప్పే ప్రముఖులు మరియు విద్వాంసులు, అరబ్బులను రెండు వర్గాలుగా వర్గీకరించారు. 1. ఖహ్తానియ్య 2. అద్నానియ్య.

అరబ్బులందరూ 'అద్నానియ్య'అని, 'ఖహ్తానియ్య'కూడా ఇస్మాయీల్(అస) వంశీయులేనని కొందరు విద్వాంసులు చెబుతారు.

ఈ విషయాన్ని ధృవీకరించడానికి డా. అలీ ముహమ్మద్ అస్సల్లాబీ గారు సహీహ్ బుఖారీలోని ఓ ఉల్లేఖనాన్ని ఆయన పుస్తకంలో పేర్కొన్నారు.

حَدَّثَنا مُسَدَّدٌ : حَدَّثَنا يَحْيَى، عَنْ يَزِيدَ بنِ أبي عُبَيْدٍ،
حَدَّثنا سَلَمَةُ رَضِيَ اللهُ عَنْهُ قالَ : ((خَرَجَ رَسُولُ اللهِ ﷺ
عَلى قَوْمٍ مِنْ أسْلَمَ يَتَناضَلُونَ بالسُّوقِ. فَقالَ : ((ارمُوا
بَني اسمَاعِيلَ فانَّ أباكُمْ كانَ رَامِياً، وأنا مَعَ بَني فُلانٍ،
لأحَدِ الفَرِيقَينِ)) فأمْسَكُوا بأيْدِيهِمْ. ((ما لهُمْ؟)) قالُوا:
وكَيْفَ نَرْمي وأنْتَ مَعَ بَني فُلانٍ؟ قالَ: ((ارمُوا وأنا
مَعَكُمْ كُلِّكُمْ)).

సలమహ్(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు కొందరి వద్దకు వెళ్ళారు. వారు ఆ సమయంలో ఒకరితో ఒకరు విలువిద్యలో పోటీ పడుతున్నారు. ప్రవక్త(స)వారు చెప్పారు, విసరండి (మీ బాణాలను), ఓ ఇస్మాయీల్ సంతానమా, మీ తండ్రీ విలుకాడే. నేను ఫలానా, ఫలానా సంతతి వారితో ఉన్నాను. ఆ రెండు వర్గాలలోని ఒక వర్గం వారు తమ చేతులను నిగ్రహించుకున్నారు (అంటే వారు బాణాలను విసరలేదు). (అది చూచి) ప్రవక్త(స) అన్నారు : ''వారికేమైంది?''. వారు సమాధానమిచ్చారు ''మీరు ఫలానా, ఫలానా సంతతి వారితో ఉంటే, మేము ఎలా బాణాలను విసురుతాం?''. ఆయన(స) చెప్పారు ''వేయండి, నేను మీ అందరితో ఉన్నాను''.

**(సహీహ్ బుఖారీ, నెం. 3507, సంపుటి 4, 61వ పుస్తకం, అధ్యా. 4)**

**ముహమ్మద్(స)వారు 'ముదర్' వారి వంశీయులు.** దీనికి సంబంధించి బుఖారీ గ్రంథంలో ఓ ఉల్లేఖనం ఉంది.

حَدَّثَنَا قَيْسُ بنُ حَفْصٍ : حَدَّثَنا عَبْدُ الواحِدِ : حَدَّثَنا
كُلَيْبُ بنُ وائِلٍ قالَ : حَدَّثَتْني رَبِيبَةُ النَّبِيِّ . زَيْنَبُ ابْنَةُ أبي
سَلَمَةَ قالَ : قُلْتُ لهَا : أرَأيْتِ النَّبِيَّ . أكانَ مِنْ مُضَرَ؟
قالَتْ : مِمَّنْ كانَ الَّا مَنْ مُضَرَ؟ مِنْ بَني النَّضْرِ بنِ كِنانَةَ.

కులైబ్ బిన్ వాయిల్(రజి) ఉల్లేఖనం. నేను జైనబ్ బిన్త్ అబీ సలమహ్(రజి)ను అడిగాను "ప్రవక్త(స)వారు **'ముదర్' నుండి అని మీరు అనుకుంటున్నారా?"** (అంటే ప్రవక్త(స)వారు ముదర్ వంశీయులేనా?) **ముదర్ నుండి కాక ఎవరు ఆయన(స)?** (అంటే ఖచ్చితంగా ఆయన ముదర్ వంశీయులేనని) ఆమె జవాబిచ్చారు. (ఆయన) అన్-నద్ర్ బిన్ **కినానహ్** సంతానము లో(ని వారు).
**(సహీహ్ బుఖారీ, నెం. 3491, సంపుటి 4, 61వ పుస్తకం, అధ్యా. 1)**

(అన్-నద్ర్ బిన్ కినానహ్ అంటే కినానహ్ కుమారుడు అన్-నద్ర్, జైనబ్ బిన్తె అబీ సలమహ్ అంటే అబీ సలమహ్ వారి కుమార్తె జైనబ్ అని అర్థం. **బిన్** మరియు **బిన్త్** పదాలు ఎక్కువగా వస్తుంటాయి. ఇవి లేకపోతే ఒకే పేరుగల వ్యక్తుల విషయంలో మనకు సందేహం వస్తుంది. ఉదాహరణకు జైద్ బిన్ హారిస్(రజి) మరియు జైద్ బిన్ సాబిత్(రజి) అని ఆ ఇద్దరి పేర్లు వారి తండ్రిపేరుతో సహా చెబితే, ఆ ఇద్దరూ వేర్వేరు అని తెలుస్తుంది. లేకపోతే ఇద్దరి పేరు 'జైద్' గనుక సందేహమొస్తుంది.)

పైన చెప్పిన 'కినానహ్' వారి సంతానమే 'ఖురైష్ తెగ'. వీటిలో ఉప తెగలున్నాయి. ఈ ఖురైష్ తెగకు చెందినవారు 'హాషిమ్'. హాషిమ్‌గారి కుమారులు అబ్దుల్ ముత్తలిబ్. అబ్దుల్ ముత్తలిబ్ గారి కుమారులు 'అబ్దుల్లా'.

**'అబ్దుల్లా' వారి కుమారులే మన ప్రియప్రవక్త ముహమ్మద్(స)వారు.**

## తొలి అరబ్బుల నాగరికత

**1. యమన్‌లో 'సబా' వారి నాగరికత :** ఈ జాతి ప్రజలు యమన్‌లో ఐశ్వర్యంతో జీవించారు. మంచి వర్షాలతో అల్లాహ్ వారిపై కరుణ చూపాడు. వారు ఎంతో ప్రయోజనాన్ని పొందారు. గొప్ప సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించి వారు ఆనకట్టలను నిర్మించారు. వాటిలో బాగా ప్రసిద్ధి చెందిన ఆనకట్ట మ'రిబ్ డామ్. ఆ విధంగా నీటిని ఆపి, పొలాలకు ఇరిగేషన్ ద్వారా నీరు అందించారు. ఫలాలిచ్చే వృక్షాలతో, వృక్ష సంపదతో అలరారుతుండేది. మీరు అల్లాహ్‌కు కృతజ్ఞత చూపలేదు. వారిని అల్లాహుతాలా ఓ పెద్ద వరదతో శిక్షించారు. వారి గురించి ఖుర్'ఆన్‌లో ఇలా చెప్పబడింది.

"వాస్తవంగా, 'సబా' వారి కొరకు వారి నివాస స్థలంలో ఒక సూచన ఉంది. దాని కుడి మరియు ఎడమ ప్రక్కలలో రెండు తోటలు ఉండేవి (వారితో): "మీ ప్రభువు ప్రసాదించిన ఆహారం తిని ఆయనకు కృతజ్ఞతలు తెలుపండి!" (అని చెప్పబడింది). ఇది చాలా మంచి దేశం మరియు మీ ప్రభువు క్షమాశీలుడు.

అయినా వారు విముఖులయ్యారు. కాబట్టి మేము వారిపైకి, కట్టను తెంచి వరదను పంపాము. మరియు వారి రెండు తోటలను చేదైన ఫలాలిచ్చే చెట్లు, ఝూపుక చెట్లు మరియు కొన్ని మాత్రమే రేగుచెట్లు ఉన్న తోటలుగా మార్చాము.

ఇది వారి కృతఘ్నతకు బదులుగా వారికిచ్చిన ప్రతిఫలం మరియు ఇలాంటి ప్రతిఫలం మేము కృతఘ్నులకు తప్ప, ఇతరులకు ఇవ్వము." **(ఖుర్'ఆన్ 34:15-17)**

ఖుర్'ఆన్‌లో సూచించినట్లు యమన్ నుండి అల్-హిజాజ్ (మక్కా, మదీనా, తాయిఫ్ మొ॥వి) వరకూ నగరాలు, పట్టణాలు ఉండేవని, అవి అష్-షామ్ (సిరియా మరియు చుట్టుప్రక్కల ప్రాంతాల) వరకూ వ్యాపించాయని తెలుస్తుంది. కాబట్టి ఈ ప్రాంతాల మధ్య ఎల్లప్పుడూ వర్తక బిడారాలు ప్రయాణిస్తూ ఉండేవి.

"మరియు మేము వారి మధ్య మరియు మేము శుభాలను ప్రసాదించిన నగరాల మధ్య, స్పష్టంగా కనిపించే నగరాలను స్థాపించి : "వాటి మధ్య సురక్షితంగా రేయింబవళ్ళు ప్రయాణిస్తూ ఉండండి" (అని అన్నాము)

"కాని వారు : "ఓ మా ప్రభూ! మా ప్రయాణ దూరాలను పొడిగించు" అని వేడుకుని, తమకు తామే అన్యాయం చేసుకున్నారు. కావున మేము వారిని కథలుగా మిగిల్చి, వారిని పూర్తిగా చెల్లాచెదురు చేశాము. నిశ్చయంగా, ఇందులో సహనశీలుడు, కృతజ్ఞుడు అయిన ప్రతి వ్యక్తికి సూచనలున్నాయి" **(ఖుర్'ఆన్ 34:18,19)**

**2. ఆద్ జాతి నాగరికత :** ఆద్ జాతి ప్రజలు హద్రమూంత్ ఉత్తర భాగంలో నివశించేవారు. వారు ఉన్నతమైన భవనాలలో నివశించేవారు. వారు వ్యాపారం చేయడంలో నిపుణులు. నీటి ధారలతో, పొలాలతో మరియు తోటలతో వారు అనుగ్రహించబడ్డారు. వారి వద్దకు అల్లాహ్ ప్రవక్తలను పంపారు. అల్లాహ్ చెబుతున్నారు :

"ఆద్ జాతి, దైవ సందేశహరులను అసత్యవాదులని తిరస్కరించింది. వారి సహోదరుడు (అంటే అదే జాతిలోని ఓ వ్యక్తి) 'హూద్' (ఆ జాతి)వారితో ఇలా అన్నప్పుడు : "ఏమీ, మీకు దైవభీతి లేదా? నిశ్చయంగా, నేను మీ వద్దకు పంపబడిన, విశ్వసనీయుడైన సందేశహరుడను. కావున మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి. నేను దానికొరకు మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్ని అడగటం లేదు. నా ప్రతిఫలం కేవలం సర్వలోకాల ప్రభువు వద్దనే ఉంది. ఏమీ, మీరు కేవలం ఆడంబరానికి ప్రతి ఎత్తైన స్థలం మీద ఒక స్మారకాన్ని నిర్మిస్తారా? మరియు మీరు శాశ్వతంగా ఇక్కడే ఉండి పోతారన్నట్లు పెద్ద పెద్ద కోటలు కడతారా? మరియు మీరు ఎవరినైనా పట్టుకుంటే, అతిక్రూరులై పట్టుకుంటారా? ఇకనైన మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి. మరియు మీకు తెలిసి వున్న (మంచి) వస్తువులను, మీకు విస్తారంగా ఇచ్చిన ఆయన (అల్లాహ్) యందు భయభక్తులు కలిగి ఉండండి. ఆయన విస్తారంగా మీకు పశువులను మరియు సంతానాన్ని అనుగ్రహించాడు. మరియు తోటలను మరియు చెలమలను". **(ఖుర్'ఆన్ 26:123-134)**

**3. సమూద్ జాతి నాగరికత :** అల్-హిజ్ర్ ప్రాంతంలో ఈ జాతి వారు నివశించేవారు. కొండలను తొలిచి ఇండ్లను నిర్మించుకునే శక్తి సామర్థ్యాలను అల్లాహుతాలా వారికిచ్చారు. ఆద్ జాతి వారికిచ్చినట్లే, ఈ జాతిని కూడా అల్లాహ్ నీటి చెలమలతో, తోటలతో అనుగ్రహించారు. అల్లాహ్ ఖుర్'ఆన్‌లో ఇలా చెబుతున్నారు.

''సమూద్ జాతి, సందేశహరులను అసత్యవాదులని తిరస్కరించింది. వారి సహోదరుడు 'సాలిహ్' వారితో ఇలా అన్నప్పుడు : ''ఏమీ, మీకు దైవభీతి లేదా? నిశ్చయంగా, నేను మీ వద్దకు పంపబడిన విశ్వసనీయుడైన దైవ సందేశహరుడను. కావున మీరు అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి. నేను దానికొరకు మీ నుండి ఎలాంటి ప్రతిఫలాన్ని అడగటం లేదు. నా ప్రతిఫలం కేవలం సర్వలోకాల ప్రభువు వద్దనే ఉంది. ఏమీ, మీరిప్పుడు ఇక్కడ ఉన్న స్థితిలోనే సుఖశాంతులలో ఎల్లప్పుడూ వదలి వేయబడతారని అనుకుంటున్నారా? తోటలలో మరియు చెలమలలో! మరియు ఈ పొలాలలో, మాగిన పండ్లగుత్తులు గల ఖర్జూరపు చెట్ల మధ్య, మరియు మీరు కొండలను తొలిచి ఎంతో నేర్పుతో గృహాలను నిర్మిస్తూ ఉంటారనీ! అలా కాదు, అల్లాహ్ యందు భయభక్తులు కలిగి ఉండండి మరియు నన్ను అనుసరించండి'' **(ఖుర్'ఆన్ 26:141-150)**

అంతేకాకుండా అల్లాహ్ మరో ఆయత్‌లో ఇలా చెబుతున్నారు :

''మరియు ఆయన, ఆద్‌జాతి వారి పిదప మిమ్మల్ని వారసులుగా చేసి మిమ్మల్ని భూమిపై స్థిరపరచిన విషయం జ్ఞాపకం చేసుకోండి. మీరు దాని మైదానాలలో కోటలను నిర్మించుకుంటున్నారు. మరియు కొండలను తొలచి గృహాలు నిర్మించుకుంటున్నారు. కావున అల్లాహ్ అనుగ్రహాన్ని జ్ఞాపకం చేసుకోండి. మరియు భూమిపై అనర్థాన్ని, కల్లోల్లాన్ని రేకెత్తించకండి!'' అని అన్నాడు (ఖుర్'ఆన్ 7:74)

ఆద్ మరియు సమూద్ జాతి ప్రజలు ఏనాడో నాశనమై పోయారు. వారికి సంబంధించిన శిధిలాలే మిగిలాయి. అన్నీ పోయాయి. వారి నీటి చెలమలు ఎండిపోయాయి. ఒకప్పటి అందమైన తోటలు మరియు పొలాలు నేడు లేవు. మిగిలినది వేరేమిటో కాదు బీడు భూమి మాత్రమే.


మంచి నాగరికత, నైపుణ్యంతో, అత్యున్నతంగా విలాసవంతంగా బ్రతికిన వీరు తమను అనుగ్రహించిన అల్లాహ్‌కు కృతజ్ఞత చూపనందుకు నాశనమైపోయారు.

ఈ జాతులకు పట్టిన గతి, నేటి వారికి కళ్ళు తెరిపిస్తుంది. పర్వతాలను తొలిచి ఇళ్ళు నిర్మించుకున్న ఈ శక్తిశాలురే దూది పింజల్లా ఎగిరి పోయారు.

**అరబ్బుల గురించి చెప్పవలసిన ముఖ్య సమాచారాన్ని వచ్చే సంచికలో, ఇన్షా అల్లాహ్, పూర్తి చేస్తాము. ముహమ్మద్(స)వారి మహోన్నత స్థానాన్ని అర్థం చేసుకోవడానికి, ఈ సమాచారం అత్యంత అవసరమైంది.**

**(29వ పేజీ తరువాయి భాగం)**

ఖుర్'ఆన్‌లో ఉన్న సమాచారానికి నేటి శాస్త్రజ్ఞులు ప్రభావితం కావడమే కాకుండా, ఖుర్'ఆన్‌లో గల ఆ **'జ్ఞానాని'**కి మూలం ఏదని వారిని అడిగితే, దైవమే అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. విలియమ్ హే అదే సమాధాన మిచ్చారు. ఇలాంటి ఎందరో డాక్టర్లు, శాస్త్రవేత్తలు నిష్పక్షపాతంగా తమ అభిప్రాయాలను తెలియజేశారు. ఇటువంటి విషయాలు అనేకం ఉన్నాయి. **ప్రస్తుత వ్యాసంలో స్పష్టం చేయవలసిన దేమిటంటే, ఖుర్'ఆన్‌లో తెలిపిన సైన్స్ స్థాయి అమోఘమైనదని, ఆ కాలంలోని సైన్స్ యొక్క స్థాయి చాలా తక్కువని.** పైన ఇచ్చిన వివరాలు ఆ విషయాన్ని స్పష్టం చేసేశాయి.




**పై పటంలో చూపించిన 'అలఖ్' గురించి ఇదే సంచికలోని మొదటి వ్యాసమైన ఖుర్'ఆన్ తఫ్సీర్‌లో వివరించడం జరిగింది.**

ఖుర్'ఆన్ గ్రంథంలో 96వ సూరహ్‌లోని మొదటి రెండు వాక్యాలలో చెప్పినట్లు పిండం తొలిదశలో 'జలగ'లాగ కనిపిస్తుందనే విషయం డా॥ కీత్‌మూర్ గారికి తెలియదు. దీనిని నిర్ధారించుకోవడం కోసం తన లేబ్‌లోని శక్తివంతమైన మైక్రోస్కోప్ క్రింద ఈ పిండం యొక్క తొలిదశను అధ్యయనం చేశారు. తరువాత దానిని 'జలగ' బొమ్మతో పోల్చి చూశాక, ఆయన ద్రిగ్భ్రాంతి చెందారు. ఈ రెండింటి మధ్య ఎంత ఖచ్చితమైన పోలిక!

ఖుర్'ఆన్ మరియు హదీసుల నుండి ఈ పిండోత్పత్తి శాస్త్రానికి సంబంధించిన వివరాల ప్రకారం, అడిగిన దాదాపు 80 ప్రశ్నలకు డా॥ కీత్‌మూర్ సమాధానాలు చెప్పారు. ఖుర్'ఆన్, హదీస్‌లలోని వివరాలు, ఇటీవల కాలంలో ఈ శాస్త్రంలో కనుగొన్న విషయాలతో పూర్తిగా ఏకీభవించడాన్ని గుర్తించిన డా॥ కీత్‌మూర్, 30 సం॥ల క్రితం కనుక మీరు నన్ను ఇవే ప్రశ్నలు అడిగి ఉన్నట్లయితే, శాస్త్రీయ వివరాలు లేకపోవడం వలన, అందులో సగం ప్రశ్నలకు నేను సమాధానం చెప్పలేకపోయేవాణ్ణి అని కూడా చెప్పారు.

**''ముహమ్మద్(స)వారు ఈ వాస్తవాలన్నీ దేవుని నుండి లేదా అల్లాహ్ నుండి ఖచ్చితంగా అంది ఉంటాయన్న విషయం నాకు స్పష్టమైంది. ఎందుకంటే ఈ జ్ఞానం చాలా శతాబ్దాల తరువాత వరకూ కనుగొనబడలేదు.....''** - డా. కీత్ మూర్

కాబట్టి ప్రియనాస్తిక సోదరా! ఇప్పుడు మీ ప్రశ్నకు సంపూర్ణ సమాధానం లభించింది కదా!

# నాస్తికుని ? ప్రశ్న

కొంత మందికి కొన్ని సమస్యలు ఎదురౌతాయి. వాటి పరిష్కారం తెలియదు. కొందరికి కొన్ని ప్రశ్నలుదయిస్తాయి. కాని వాటికి జవాబు స్ఫురించదు. అన్వేషించ గలిగే ఓపిక వారి కుండదు. వారి సందేహాలను ఎవరి ముందో ఉంచుతారు. వారు సరియైన విధంగా జవాబు చెప్పలేక పోవచ్చు. అలాంటి సందర్భాలే కొంతమందిని నాస్తికులుగా మారుస్తాయి. వీరు కాకుండా మరో వర్గముంది. వారికి ఇష్టానుసారంగా బ్రతకాలని ఉంటుంది. ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర రెడ్ లైట్ వెలిగినా, దూసుకు పోవాలని, పరీక్షలకు ప్రిపేరవకుండా, ఏమీ వ్రాయకపోయినా మంచి మార్కులు పొందాలని, వారికి నచ్చిందే చేయాలని, కావాలన్నది దొరకాలని, ధర్మమైనా, అధర్మమైనా, నీతి అయినా అవినీతి అయినా వారి కనవసరం. వారిని వారించి ఎవరైనా కంట్రోల్ చేయబోతే, వారు సహించలేరు. అలాంటి వారు కూడా ఈ నాస్తికత్వం వైపు మొగ్గు చూపుతారు. చేతులు కాలాక, ఆకులు పట్టుకున్నట్లు, ఎప్పుడో వీరికి జ్ఞానోదయం అవుతుంది, కాని అప్పటికే వారి జీవితానికి అస్తమయం దగ్గరవుతుంది. ఓ నాస్తిక సోదరుడు వేసిన ఒక ప్రశ్నకు జవాబు చెప్పడంతో ఈ శీర్షికను క్రిందటి సంచికలో ప్రారంభించాము. ఆ నాస్తిక సోదరుని మరో ప్రశ్నను ఈ సంచికలో అందిస్తున్నాము.

మీకు నాస్తిక సోదరులు ఎదురైతే, వారి చేత తప్పనిసరిగా ఈ వ్యాసం చదివించండి. వారిని సంస్కరించడానికి ప్రయత్నిద్దాం. ప్రపంచ మానవులందరూ ఒకే జంట నుండి ఉద్భవించారు కాబట్టి, వారు కూడా మన బంధువులే!

**ప్రశ్న** **1400 సంవత్సరాలకు పూర్వం ఉండే సైన్స్, ఖుర్'ఆన్‌లోని సైన్స్‌కి భిన్నంగా ఉందా?**

**జవాబు** నాస్తిక సోదరుడు చెప్పాలనుకున్న దేమిటంటే, ఖుర్'ఆన్ గ్రంథంలో చెప్పబడిన సైన్స్ విషయాలు - ఖుర్'ఆన్ అవతరణ జరిగే సమయంలో అభివృద్ధి చెందిన సైన్స్ విషయాల కంటే ఆధునికమైనవి కావని, అప్పటి సైన్స్ విషయాలనే ఖుర్'ఆన్‌లో వాడి ఉంటారని. ఈ నాస్తిక సోదరునికి ఖుర్'ఆన్ తెలుపబడిన సైన్స్ విషయాల గురించి తెలుసు. అతను అడిగిన మిగిలిన ప్రశ్నలను బట్టి, ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది.

ఇటీవల కనిపెట్టిన విషయాలకు వ్యతిరేకం కాకుండా, వాటికి సరిపోయేలా ఖుర్'ఆన్ గ్రంథ విషయాలు ఉన్నాయని స్పష్టంగా తెలిసినప్పుడు, ఈ ప్రశ్న ఎలా వేయగలిగారో? ఇటీవల కాలంలో కనుగొన్న విషయాలు అంటే, అవి 1400 సంవత్సరముల క్రితం కనుగొనబడలేదనే కదా!

విశ్వం వ్యాపిస్తుందని శాస్త్రవేత్తలు ఎప్పుడు తెలుసుకున్నారు?

1929 సంవత్సరంలోనే కదా! అంటే ఇప్పటికి 80 సంవత్సరాలు అయింది. కాని ఖుర్'ఆన్‌లో 51:47 వాక్యంలో విశ్వం వ్యాపిస్తుందనే విషయాన్ని 1400 సం॥ల క్రితమే అల్లాహ్ తెలియజేశారు.

**"మేము ఆకాశాన్ని మా స్వశక్తితో చేశాము. మరియు నిశ్చయంగా మేమే దానిని విస్తరింపజేయగల వారము."** (ఖుర్'ఆన్ 51:47)

విశ్వం వ్యాపించడం వరకూ ఎందుకు? ముందుగా తెలుసుకోవలసిన విషయమేమిటంటే 'అసలు విశ్వం ఎలా సృష్టించబడింది?' ఆరంభం విశ్వంతోనే కదా! కొన్ని రోజుల క్రితం బిగ్‌బేంగ్ థీరీ గురించి చెప్పిన శాస్త్రవేత్త చనిపోయారని చదివాము.

అంటే, ఇప్పటికి ఓ వంద సంవత్సరాల లోపునే ఈ విషయం తెలిసింది. కాని ఈ విషయాన్ని 1400 సంవత్సరాల క్రితం ఖుర్'ఆన్‌లో అతి స్పష్టంగా, ఎటువంటి సందేహం లేకుండా ఖుర్'ఆన్ వాక్యంలో వివరించడం జరిగింది.

1. ఆయన (అల్లాహ్) ఆకాశాలను, భూమినీ ప్రభవింపజేసినవాడు (ఖుర్'ఆన్ 6:101)
2. మేము మానవుణ్ణి మట్టియొక్క సారంతో సృష్టించాము (ఖుర్'ఆన్ 23:12) (మేము అనే పదం 'అల్లాహ్' నుద్దేశించి చెప్పిన Royal Plural ఏకవచన పదమే!)

పై రెండు వాక్యాలలో, మొదటి వాక్యాన్ని బట్టి భూమ్యాకాశాలనూ అల్లాహ్ సృష్టించాడని, రెండవ వాక్యాన్ని బట్టి మానవున్ని ఆయనే మట్టితో సృష్టించారని స్పష్టమౌతుంది. మనిషిని మట్టితో సృష్టిస్తే, మరి భూమి ఆకాశాలనూ దేనితో సృష్టించారు?

అర్థంలోగాని, భావంలోగాని పై అనువాదాలలో దోషం లేదు. కాని 6:101 వాక్యంలో '**బదీ**' అనే పదం మరియు 23:12 వాక్యంలో '**ఖలఖ**' అనే పదం ఉపయోగించబడ్డాయి.

"**బదీ**" అంటే సృష్టికర్త (సృష్టించేవాడు). "**ఖాలిఖ్**" అంటే కూడా సృష్టికర్తే (సృష్టించేవాడు). ఖుర్'ఆన్‌లోని సుమారు 27 వాక్యాలలో మానవసృష్టి గురించి చెబుతున్నప్పుడు 'ఖలఖ' అనే పదమే ఉపయోగించబడింది గాని, 'బదీ' అనే పదం ఎక్కడా ఉపయోగించ బడలేదు.

ఏమీలేని శూన్యం నుండి దేనినైనా సృష్టించినపుడు "బదీ"అని, అప్పటికే సృష్టించబడిన దానిని ఉపయోగించి, మరో సృష్టి చేసినపుడు 'ఖాలిఖ్' అని అల్లాహ్ నుద్దేశించి చెప్పడం జరిగింది.

ఈ శీర్షికలో ఉదహరించిన అన్ని తెలుగు అనువాదాలలో: సృష్టింపజేశాడు, ప్రభవింపజేశాడు, ఆవిష్కరింపజేశాడు, ఏ నమూనా లేకుండా ఆరంభించిన వాడు అనే పదాలను గమనించవచ్చు.

ఏ నమూనా లేకుండానే భూమ్యాకాశాల సృష్టి జరిగింది, నిజమే!

ఆరంభకుడు, ఇది కూడా నిజమే!

కాని ఆ సృష్టిని ఏ పదార్థంతోనూ చేయలేదు.

''శూన్యం నుండే భూమ్యాకాశాలను సృష్టించాడు''

"**He created the heavens and the Earth from nothing**"

నేటి ఆధునిక **Big Bang Theory** కూడా ఇదే విషయాన్ని చెబుతుంది.

పై విషయం ఒక్కటి చాలు. ఖుర్ఆన్ గ్రంథంలోని సైన్స్ విషయాలు చాలా ఆధునికమైనవని చెప్పడానికి మరియు ఆ విషయాలు కాపీ చేయబడినవి కావని స్పష్టంగా అర్థం కావడానికి.

మన సౌరవ్యవస్థకు సంబంధించిన మరో ముఖ్య విషయం :

విస్తృతంగా అంగీకరించబడిన nebular hypothesis ప్రకారం గ్రహాలు ఎలా ఏర్పడతాయో, ఆ వివరాలను క్రింద ఇస్తున్నాము.

The most widely accepted theory of planetary formation, known as the **nebular hypothesis**, maintains that 4.6 billion years ago, the Solar System formed from the gravitational collapse of a giant **molecular cloud** which was light years across. Several stars, including the Sun, formed within the collapsing cloud. The gas that formed the Solar System was slightly more massive than the Sun itself. Most of the mass collected in the centre, forming the Sun; the rest of the mass flattened into a **protoplanetary disc**, out of which the planets and other bodies in the Solar System formed.

Just as the Sun and planets were born, so they will eventually die. As the Sun begins to age, it will cool and bloat outward to many times its current diameter, becoming a red giant, before casting off its outer layers (forming what is misleadingly called a planetary nebula) and becoming a stellar corpse known as a white dwarf. The planets will follow the Sun's course; some will be destroyed, others will be ejected into interstellar space, but ultimately, given enough time, the Sun's retinue will eventually disappear.

(**http://en.wikipedia.org/wiki/History_of_Solar_System_formation_and_evolution_hypotheses)**

పై hypothesis ప్రకారం, నక్షత్రమైన 'సూర్యుడు' ముందు సృష్టించబడ్డాడు, ఆ తరువాతనే సూర్యుని చుట్టూ తిరిగే గ్రహాలు ఏర్పడ్డాయి. ప్రారంభంలో ఇవి అన్నీ పొగమేఘంలా ఉండి, వాటి నుండి సూర్యుడు, దాని గ్రహాలు ఏర్పడ్డాయి. అంటే ప్రారంభంలో ఇవి అన్నీ కలిసి ఉండేవనీ తరువాత అవి విడదీయబడ్డాయని చాలా స్పష్టంగా తెలుస్తుంది.

క్రింది ఖుర్ఆన్ వాక్యాన్ని చదవండి:

**"ఏమీ? ఈ సత్య తిరస్కారులకు తెలియదా? వాస్తవానికి భూమ్యాకాశాలు కలుసుకుని ఉండేవనీ, అయితే! మేమే వాటిని వేరుచేశామనీ?"** (ఖుర్ఆన్ 21:30)

చూశారా! ఎంత స్పష్టంగా, ఖచ్చితంగా సృష్టి ఏర్పాటు గురించి దివ్య ఖుర్ఆన్ 1400 సంవత్సరాల క్రితమే తెలియజేసిందో! అంతేకాదు అవతరించి నప్పటినుండి ఇప్పటివరకు ఒక్క అక్షరం కూడా మారకుండా, అల్లాహ్ రక్షణలో, ఒరిజినల్ కాపీని కూడా కలిగియున్న ప్రపంచంలోని ఏకైక దివ్య గ్రంథం - ఖుర్ఆన్.

**మానవ సృష్టి :**

తల్లి గర్భంలో పిండాభివృద్ధి దశల గురించి వివరించే ముహ్మద్(స)వారి రెండు బోధనలను (సహీహ్ బుఖారీ నెం. 3208, సహీహ్ ముస్లిం నెం. 6723) విన్న తరువాత డాక్టర్ **Joe Leigh Simpson**, వాటిని అధ్యయనం చేసి తల్లి గర్భంలో మొదటి 40 రోజులలో స్పష్టంగా గుర్తించగలిగే embryo -genesis దశ గురించి వివరించిన ముహమ్మద్(స) వారి బోధనలోని ఖచ్చితత్వానికి ముగ్ధుడై ఓ సమావేశంలో ఆయన చెప్పిన విషయాలు:

."So that the two hadeeth (the saying of the Prophet Muhammad ﷺ) that have been noted provide us with a specific time table for the main embryological development before forty days. Again, the point has been made, I think, repeatedly by other speakers this morning; these hadeeths could not have been obtained on the basis of the scientific knowledge that was available (at) the time of their writing ...... It follows, I think, that not only there is no conflict between genetics and religion but, in fact, religion can guide science by adding revelation to some of the traditional scientific approaches, that there exist statements in the Qur'an shown centuries later to be valid, which support knowledge in the Qur'an having been derived from God."

**Dr. Joe Leigh Simpson,** Chairman and Professor, Dept. of Obstetrics and Gynecology & Professor of Molecular and Human Genetics at the Baylor College of Medicine, Houston, Texas, USA. Former Professor and Chairman, Dept. of Ob-Gyn, University of Tennessee, Memphis, USA.

తొలి 40 రోజులలో జరిగే పిండాభివృద్ధికి సంబంధించిన నిశ్చితమైన టైమ్ టేబుల్‌ని ముహమ్మద్(స)వారి బోధన వివరించిందని చెప్పారు.

**ఖుర్ఆన్ అవతరణ సమయంలో నున్న శాస్త్రీయ విజ్ఞానంతో ఇలాంటి విషయాలను చెప్పడం సాధ్యం కాదని, శతాబ్దాల తరువాత ఆమోదయోగ్యమయ్యే శాస్త్రీయ విషయాలు ఖుర్ఆన్ గ్రంథంలో ఉన్నాయని, ఖుర్ఆన్ గ్రంథంలో నున్న జ్ఞానం దైవం నుండి ఉత్పన్నమైనదని చెప్పారు.** నాస్తిక సోదరుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా డా. సింప్సన్ గారి ఈ స్టేట్‌మెంట్ చాలదా? ✓

**సముద్రాలకు సంబంధించిన వాస్తవాలపై, మైరైన్ సైంటిస్ట్ డా॥ విల్లియమ్ హే ఏమన్నారో చూడండి.**

"I find it very interesting that this sort of information is in the ancient scriptures of the Holy Qur'an, and I have no way of knowing where they would come from, but I think it is extremely interesting that they are there and that this work is going on to discover it, the meaning of some of the passages"

**Dr. William W. Hay,** (marine scientist) Professor of Geological Sciences at the University of Colorado, Boulder, Colorado, USA.Emeritus of Anatomy and Cell Biology, University of Toronto, Toronoto, Canada; Former Dean, Rosenstiel School of Marine and Atmospheric Science, University of Miami, Florida, USA.

**(తరువాయి భాగం 27వ పేజీలో)**

ఏ ధర్మాన్ని కించపరిచే ఉద్దేశ్యం మాకు లేదు. అన్ని ధర్మాలను గౌరవిస్తున్నాం

# టెర్రరిజం

- క్రైస్తవ టెర్రరిజం ?
- సిఖ్ఖు టెర్రరిజం ?
- యూదు టెర్రరిజం ?
- కమ్యూనిస్ట్ టెర్రరిజం ?
- హిందూ టెర్రరిజం ?
- ఇస్లామిక్ టెర్రరిజం ?

తీవ్రవాదానికి, మత ధర్మానికి ఏ విధమైన సంబంధం లేదు. ✓

**టెర్రరిజం అనేది ముస్లిములకే స్వంతమన్నట్లు, మీడియా ఎందుకు ముస్లిములనే టార్గెట్‌గా పెట్టుకుంది?**

తీవ్రవాదాన్ని 'ముస్లిము'లుగా మేము ఖండిస్తున్నాం. మానవులకు అపకారాన్ని తలపెట్టే ఏ పనినైనా మేం వ్యతిరేకిస్తాం. మానవులందరూ ఒకే జంట యొక్క వారసులని, ఖుర్'ఆన్ ద్వారా తెలుసుకుని ప్రపంచ ప్రజలందరినీ వారు హిందువులైనా, క్రైస్తవులైన లేక మరే ధర్మానికి చెందిన వారైనా సరే, వారిని మా సోదరులుగానే భావిస్తున్నాం. మా సోదరులపై జరిగే ఎటువంటి హింసనైనా నిర్ద్వంధంగా ఖండిస్తున్నాం. కాని మీడియా వారి రెండు నాలుకల ధోరణిని వివరించాలనేది ఈ శీర్షిక యొక్క ప్రధానోద్దేశం కాబట్టి ఈ శీర్షికలో మీడియా భాషనే వాడుతున్నాం. మా భాష మాత్రం కాదు. వేరే ధర్మం వారి ఎవరికైనా బాధ కలిగితే, మీడియా వారి వలన ముస్లిములకు కూడా అంతే బాధ కలిగిందని అర్థం చేసుకుని, కొంత మంది ప్రోద్భలంతో మీ తోటి ముస్లిం సోదరులపై అనాగరికంగా వ్రాస్తున్న మీడియా వ్రాతలను ఖండించమని కోరుతున్నాం.

**8**

## నేరస్తున్ని శిక్షించాలి

ఇప్పుడు మీడియా యొక్క ప్రధానమైన ఫోకస్ కసబ్‌కి విధించబోయే శిక్ష పైనే ఉంది కాబట్టి, ఈ నెల మా చర్చను 26/11 దోషులపైనే కేంద్రీకరించడం జరిగింది. రెగ్యులర్‌గా ఈ శీర్షికలో మేము ఇచ్చే వ్యాసాన్ని వచ్చే సంచిక నుండి ఇన్షాఅల్లాహ్ యధావిధిగా కొనసాగిస్తాము.

కోర్టులో జడ్జిగారు తీర్పును చదువుతున్నప్పుడు మరియు ఆ రోజంతా కూడా ఏ న్యూస్ టి.వి. ఛానెల్‌లో చూసినా అన్నీ 'కసబ్' గురించి చర్చా కార్యక్రమాలే!

టి.వి. ఛానెళ్లలో ప్రసారమైన ఈ చర్చాకార్యక్రమాలను చూసిన వారెవరైనా, ఓసారి నిజాయితీగా ఆలోచిస్తే ఈ ఛానళ్ళు ముస్లిములను టార్గెట్‌గా పెట్టుకున్నాయని స్పష్టంగా తెలుస్తుంది.

ఈ చర్చావేదిక లన్నింటిలోనూ కూడా జాతీయ ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులను ఆహ్వానించి, ముస్లిములపై వారు నోరు పారేసుకునేలా చేశారు. చాలా కాలంగా అధికారంలో లేక తీవ్ర నిరాశలో ఉన్న ఈ జాతీయ ప్రతిపక్ష నాయకులకు, కోతికి కొబ్బరికాయ దొరికినట్లు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడానికి, ముస్లిమ్‌లపై విద్వేషాన్ని కక్కడానికి మంచి అవకాశం లభించింది.

వల్లించడానికే నీతులు సుమా అనే విధంగా తీవ్రవాదానికి, రాజకీయానికి ముడిపెట్టకూడదని వారు చెబుతూనే, 'తీవ్రవాదానికి మతానికి' మరియు 'తీవ్రవాదానికి రాజకీయాలకి' ముడిపెడుతూ మాట్లాడటాన్ని చూస్తే, ప్రేక్షకులను వారు వెర్రివాళ్ళుగా భావించారేమోనని అనిపిస్తుంది.

ఇస్లాం గురించి ఈ రాజకీయ పార్టీ వారు ఎలా మాట్లాడుతారో ముందే అందరికీ తెలుసు గనుక, వారినే టి.వి. ఛానళ్ళు పిలిచాయి. **దీనిని బట్టి తీవ్రవాదానికి మతం రంగును పులమడానికి 'మీడియా'యే తొలి అడుగు వేసిందని స్పష్టంగా తెలుస్తుంది.**

అయితే ఓ న్యూస్ ఛానల్‌లో మాత్రం మేము ఊహించనది ఒకటి జరిగింది. అది ఏమిటంటే, జనవిజ్ఞాన వేదిక సభ్యడొకరిని ఇటువంటి చర్చావేదికకు ఆహ్వానించడమే. ఆ చర్చలో రెండవ వ్యక్తి 'ఇస్లామిక్ తీవ్రవాదం' అనే పదాన్ని ఉపయోగించినప్పుడు, అతని మాటలను ఖండిస్తూ జనవిజ్ఞాన వేదిక సభ్యుడు అతనిని తప్పుపట్టారు. ఇస్లామ్ మతానికి తీవ్రవాదానికి సంబంధం లేదని చెబుతూ, ఈ శీర్షికలో గత 7 నెలలుగా శాంతిబాట టీమ్ లేవనెత్తి నటువంటి విషయాలకు దగ్గరగా ఉండే అనేక విషయాలను స్పష్టంగా తెలియజేసి, మతాలకు తీవ్రవాదానికి ముడి పెట్టవద్దని జనవిజ్ఞాన వేదిక సభ్యుడు చెప్పడం జరిగింది.

టెర్రరిజం విషయంలో అమెరికా యొక్క దుర్నీతిని ఆయన ఎండగట్టారు. ఏ మతాన్ని నేను విశ్వసించను అని చెబుతూ జనవిజ్ఞాన వేదిక సభ్యుడు నిర్ద్వంద్వంగా 'ఇస్లామ్' మతాన్ని టార్గెట్ చేయడాన్ని ఖండించారు.

**ఖుర్'ఆన్ గ్రంథ అవతరణ మొదలైన తరువాత 1380 సం॥ల వరకూ 'ఇస్లామిక్' తీవ్రవాదం అనే పదం ఎక్కడా ఉపయోగించ బడలేదు. గత 20 సంవత్సరాలుగా ఈ పదాన్ని ఉపయోగిస్తున్నారు. 'ఇస్లాం'కి తీవ్రవాదానికి అసలు సంబంధమే లేదని వివేకం గలవారికి సులభంగా అర్థమౌతుంది.**

సాధారణంగా టి.వి. యాంకర్, తమకు ఇష్టంకాని విషయం వచ్చినప్పుడు, అతనిని ఆపేసి, రెండవ వ్యక్తిని ప్రశ్నిస్తూ తమకు నచ్చని విషయాలను బయటికి రానివ్వకుండా జాగ్రత్త పడతారు. కాని ఈ ఛానల్‌లో జరిగిన చర్చా కార్యక్రమంలో మాత్రం యాంకర్‌కి మరియు రెండవ వ్యక్తికి అవకాశం లేకుండా స్పష్టంగా తను చెప్పాలనుకున్నది జనవిజ్ఞాన వేదిక సభ్యుడు చెప్పడం జరిగింది.

**మీడియాను అడగవలసిన 2 ప్రశ్నలు :**

1. కసబ్‌కి విధించే శిక్ష విషయంలో ముస్లిములను, ఇస్లామ్‌ను ఎందుకు టార్గెట్‌గా చేసుకున్నారు?
2. కసబ్‌కి ఉరిశిక్షవేస్తే ముస్లిములు బాధపడతారని ఎలా అనుకుంటున్నారు? **తప్పు చేసినవానికి శిక్ష పడాలి.**

విచక్షణా రహితంగా ఎందరో ప్రాణాలను బలిగొన్న వ్యక్తికి శిక్ష వేయడాన్ని ముస్లిమ్‌లు హర్షిస్తారేగాని, అడ్డు చెప్పరు. హిందూ టెర్రరిస్ట్‌గా భావించిన 'సాధ్వి' విషయంలో దర్యాప్తు చేస్తున్న కర్కరేగారు మరణించక ముందే, ఈ సాధ్విగారిని తీవ్రవాది అని నిరూపించి, శిక్షపడేటట్లు గనుక చేసి ఉంటే ఓ రాజకీయ పార్టీ వారు తప్పనిసరిగా ఆందోళన చేపట్టి ఉండేవారు. అయితే ఆమె తీవ్రవాది అవునో కాదో తెలియదు. కాని మీడియాలో వచ్చిన వార్తలను బట్టి, మరియు వారు చూపిన ఆధారాలను బట్టి అటువంటి అనుమానమే కలుగుతుంది.

ఈ విషయం ఎక్కువగా జనాల్లోకి వస్తే, 'హిందూ టెర్రరిస్ట్' అనే పదం ప్రచారంలోకి వస్తుందని భయపడి, ముస్లిమ్‌లను నిత్యం విమర్శించే బిజెపి జాతీయ నాయకులు శ్రీ వెంకయ్యనాయుడు గారు, 'ఇస్లామిక్ తీవ్రవాదం' అనే పదం వాడకూడదని, మతానికి మరియు తీవ్రవాదానికి సంబంధం లేదని స్టేట్‌మెంట్ ఇవ్వడం జరిగింది.

కసబ్‌ని ఉరితీసినా లేదా మరే విధంగా చిత్రహింసలు పెట్టినా సరే, ఇండియాలోని ఏ ముస్లిమ్ కూడా బాధపడడు మరియు పట్టించుకోడు. ఈ అమానుషమైన దాడిలో అన్ని మతాలకు సంబంధించినవారు చనిపోయారు. ఈ దాడి జరిగింది మన దేశానికి వ్యతిరేకంగా.

ఈ దాడికి వెనుకనున్న అసలు కారణాలు మనకు తెలియవు.

ఆర్థికంగా ఇండియా అభివృద్ధి చెందడాన్ని చూసి ఓర్వలేక పాకిస్తాన్ ఈ పనిచేసి ఉంటుందని కొందరు అభిప్రాయ పడుతున్నారు.

ఇండియా అభివృద్ధి చెందకూడదని కోరుకునేది పాకిస్తాన్ దేశమొకటేనా? మన అభివృద్ధి అమెరికాను బాగా కలవర పెడుతుంది. ఏకంగా అధ్యక్షుడి నోటివెంటే అటువంటి అర్థాన్నిచ్చే మాటలు వచ్చాయి. క్రిందటి సంచికలో ఆ వివరాలు అందించాము. **పాకిస్తాన్ దేశీయుడు** 'కసబ్', **అమెరికన్ దేశీయుడు** 'హెడ్లీ' ఈ దాడిలో నిందితులే. అఫ్‌కోర్స్, అమెరికా బహిరంగంగా ఏ దేశంపై దాడిచేసినా కూడా అడగగలిగే ధైర్యం ప్రపంచంలో ఏ దేశానికుంది? అంత గొప్ప ఉగ్రవాద దేశం - అమెరికా.

అన్నీ ఊహాగానాలే! ఆలస్యం కావచ్చేమోగాని నిజం ఎప్పటికైనా బయటికి వస్తుంది.

ఈ కసబ్ విషయంలో అమెరికన్ FBI వారు ఇండియాకి వచ్చి వివరాలు తెలుసుకోవడాన్ని, గొప్ప విషయంగా మనవాళ్ళు చెప్పుకుంటున్నారు. ఈ దాడిలో అమెరికన్ ఇన్‌వాల్వ్‌మెంట్ ఉందనే సాక్ష్యాలేమైనా ఇండియా దగ్గర ఉన్నాయేమోనని తెలుసుకోవడానికే వచ్చారా? వారు ఇండియా రావడంలో అసలు ఉద్దేశ్యమేమిటో?

అమెరికన్ ప్రభుత్వాన్ని కనీస జ్ఞానమున్న వారెవరూ నమ్మరు. ఈ మధ్యనే ఓ వార్త ప్రచురితమైంది. అమెరికాలోని 80శాతం ప్రజలకు ఆ దేశప్రభుత్వం మీద నమ్మకం లేదట. కాని ఆ దేశాన్ని ప్రపంచంలో ఎక్కువగా నమ్మేది ఎవరంటే, భారతీయులే! భారతదేశంలో అయితే 80శాతం కంటే ఎక్కువ మందే అమెరికన్ ప్రభుత్వాన్ని నమ్ముతారు. అందుకొరకే మన మీడియా యొక్క ఇంటర్‌నేషనల్ వార్తలన్నీ అమెరికా చుట్టూ ఎక్కువగా తిరుగుతుంటాయి.

అంతేకాకుండా ఇస్లాం మీద ఎవరు బురద చల్లినా, ఆ పనిచేసిన వారు ఏ దేశానికి చెందినవారైనా సరే, ఆ దేశ విషయాలు మన వార్తాపత్రికలలో దర్శనమిస్తాయి.

**పాకిస్తాన్ దేశీయుడైన 'కసబ్' చేసిన నేరాన్ని నిరూపించి, అంతర్జాతీయ సమాజం ముందు పాకిస్తాన్‌ను స్పష్టంగా మన ఇండియా ఎక్స్‌పోజ్ చేయగలిగింది అని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.**

**అలాగే, అమెరికా దేశీయుడైన 'హెడ్లీ' చేసిన నేరాలను అతడే స్వయంగా అమెరికాలో ఒప్పుకోవడం ద్వారా అంతర్జాతీయ సమాజం ముందు 'అమెరికా' కూడా ఎక్స్‌పోజ్ కాబడింది.**

హెడ్లీకి ఎటువంటి అడ్డు చెప్పకుండా అతను స్వేచ్ఛగా అమెరికా నుండి పాకిస్తాన్, ఇండియాలకు వెళ్ళగలిగే అవకాశాన్ని అతనికి కల్పించి, పరోక్షంగా ఈ దాడికి అమెరికాయే కారణమని చెప్పగలిగే దమ్మున్న దేశం ప్రపంచంలో ఏదైనా ఉందా?

**అంతర్జాతీయ సమాజం ముందు పాకిస్తాన్‌ను దోషిగా నిలబెట్ట గలిగామని పూర్తి విశ్వాసంతో మనం ఎప్పుడు చెప్పగలమంటే,**

1. పాకిస్తాన్‌తో అమెరికా పూర్తిగా తెగతెంపులు చేసుకునేలా చేసినప్పుడు మరియు 'పాకిస్తాన్' తన మిత్రదేశం కాదని అమెరికా చేత అంతర్జాతీయ సమాజానికి చెప్పించగలిగినప్పుడు,
2. విధ్వంసకర ఆయుధాలున్నాయంటూ ఇరాఖ్‌పై ఆంక్షలు విధించిన అమెరికా వంటి (అ)నాగరిక దేశాలు, పాకిస్తాన్ విషయంలో ఆంక్షలు విధించేలా చేయాలి.
3. తాలిబన్లు 'బిన్‌లాడెన్'ని అప్పగించనందుకు 'ఆఫ్ఘనిస్తాన్' దేశంపై అమెరికా దాడిచేసిన విషయాన్ని అమెరికాకు జ్ఞాపకం చేసి, అదేవిధంగా 'హెడ్లీ'ని ఇండియాకు అప్పగించనందుకు మీ దేశంపై ఎందుకు చర్య తీసుకోకూడదు? అని అమెరికాను అంతర్జాతీయ సమాజం ముందు ఇండియా నిలదీయగలగాలి.
4. హెడ్లీ ఇండియా వచ్చినప్పుడు, ఆ సమాచారాన్ని ఇండియాకు

ఎందుకు తెలియజేయలేదు? అని అమెరికాను ప్రశ్నించాలి.

ఇవి అన్నీ జరిగినప్పుడు ఇండియా అంటే ఏమిటో, అంతర్జాతీయ సమాజానికి అర్థమౌతుంది. ఈ విషయంలో భారతీయులందరూ మన ప్రభుత్వానికి సహకరించి, మన దేశ సార్వభౌమాధికారాన్ని సవాల్ చేస్తే సహించేది లేదని ప్రపంచానికి చాటి చెప్పాలి.

ఉన్మాదంతో విచక్షణ కోల్పోయిన 'కసబ్' వంటివారు శిక్షింప బడతారు. కొత్తవారు పుట్టుకొస్తూనే ఉంటారు. మన రాష్ట్రంలో అమ్మాయిలపై యాసిడ్ దాడులు జరిగాయి. ఆ ఉన్మాదులకి శిక్ష పడింది. దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఈ ఉన్మాదానికి పరిష్కారం చూపకుండా శిక్షలు వేసినంత మాత్రాన యాసిడ్ దాడులు ఆగుతున్నాయా?

**అమ్మాయిల లేత జీవితాలను బలితీసుకుంటున్న ఈ ఉన్మాదులు ముస్లిములు కాదు కదా! కాబట్టి మనుషుల ఉన్మాదానికి, మతానికి సంబంధాలు అంటగట్టినంతకాలం, ఈ సమస్య పరిష్కరించబడదు. ఈ దాడులు జరుగుతూనే ఉంటాయి.**

'ఇస్లాం' ధర్మానికి, తీవ్రవాదానికి ఎటువంటి సంబంధం లేదని ప్రతీ భారతీయుడికి స్పష్టమయ్యేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి. తీవ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ శాంతిదూత ముహమ్మద్(స)వారు చెప్పిన బోధనలను ప్రచార మాధ్యమాల ద్వారా భారతదేశ ప్రభుత్వం ప్రజలందరికీ తెలియజేసేలా చేస్తే, ఇక్కడ ప్రధాన మతాల మధ్య సామరస్యం పెరుగుతుంది.

**తీవ్రవాదుల చేతులు కాళ్ళు కట్టి పడేసినట్లు అవుతుంది.**

అలా కాకుండా మత దురభిమానంతో తీవ్రవాదానికి మతం రంగు పులిమి, ఆ మతవర్గపు అమాయక ప్రజలను అవమానిస్తూ, రెచ్చగొడుతూ ఉంటే, తీవ్రవాదులుగాని నక్సలైట్లు గాని ఆ పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకునే అవకాశం ఉంది. అన్యాయానికి, దుర్మార్గానికిబలైన వారిని తమవైపు వారు తిప్పుకునే అవకాశముంది.

ఖుర్‌ఆన్ గ్రంథంలో చెప్పబడిన విషయం :

"....హత్యకు బదులుగా గాని లేదా కల్లోలాన్ని వ్యాపింప జేసి నందుకుగాని కాక, మరే కారణం వల్లనైనా **ఒక మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే** ...." (దివ్య ఖుర్‌ఆన్ 5:32)

"ఒకవేళ మీరు ప్రతీకారం చేస్తే కేవలం మీపై దౌర్జన్యం జరిగిన మేరకే ప్రతీకారం చెయ్యండి. కాని **మీరు సహనం చూపితే, అది నిశ్చయంగా సహనం చూపేవారికే మంచిది.**" (దివ్య ఖుర్‌ఆన్ 16:126)

పార్లమెంట్‌పై దాడిచేసిన 'అఫ్జల్ గురు'ను ఉరితీయక పోవడాన్ని మతతత్వ పార్టీగా ముద్రపడిన బిజెపి నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ముస్లిముల ఓట్ల కోసమే కాంగ్రెస్ ఈ శిక్షను ఆపిందని చెబుతూ అమాయక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

పరోక్షంగా వీరి మాటలలో దాగిఉన్న దుర్మార్గం ఏమిటంటే, పార్లమెంట్‌పై దాడి చేసిన వారిపై ముస్లిములకు అభిమానమున్నట్లు అర్థమొచ్చేలా, ముస్లిములను దేశానికి శత్రువులుగా చూపించడమే.

ఏ పార్టీకి ఓటువెయ్యాలో, ఆయా నియోజక వర్గాలలోని ముస్లిములు నిర్ణయించుకుంటారు. తీవ్రవాదానికి, ఇస్లామ్‌కు ఏదోవిధంగా సంబంధాలను అంటగట్టి, ముస్లిములను అణగదొక్కడానికి ఏదో ఒక చట్టాన్ని తీసుకురావాలనేది ఈ పార్టీవారి కోరిక. మెజారిటీ ప్రజలకు వీరి కుయుక్తులు బాగా తెలుసు.

**కసబ్‌ని నడిరోడ్డు మీద అందరూ చూస్తూ ఉండగా ఉరితీసినా సరే ఏ భారతీయ ముస్లిమ్‌కూడా అభ్యంతరం చెప్పడు.**

ఇస్లామ్‌లో నేరస్తునికి శిక్షను విధించే విషయానికి సంబంధించిన ఓ వాస్తవ సంఘటన :

ఓ సారి మఖ్జూమ్ తెగకు చెందిన ఒక స్త్రీ దొంగతనం చేసింది. దైవప్రవక్త(స) ఆమెకు హస్తఖండన శిక్ష విధించారు.

దానిపట్ల ఖురైష్ తెగవాళ్ళు తీవ్ర ఆందోళన చెందారు. వారు పరస్పరం సంప్రదించుకుని ఈ విషయంలో దైవప్రవక్త(స)తో ఎవరు మాట్లాడుతారు అని అన్నారు. అప్పుడు కొందరు సలహా ఇస్తూ ఈ విషయమై దైవప్రవక్త(స)తో మాట్లాడగల వారు ఉసామా బిన్ జైద్(రజి) ఒక్కరు మాత్రమేనని, ఆయన్ని దైవప్రవక్త(స) అమితంగా అభిమానిస్తారని అన్నారు. చివరికి వారంతా హజ్రత్ ఉసామా(రజి)ని దైవ ప్రవక్త(స)తో మాట్లాడి ఈ వ్యవహారాన్ని పరిష్కరించేందుకు ఒప్పించారు. ఉసామా (రజి) దైవప్రవక్త(స) సన్నిధికి వెళ్ళి వారి విన్నపాన్ని ఆయన ముందు ఉంచారు. అది విని దైవప్రవక్త(స) ఉసామా(రజి)తో ఇలా అన్నారు: "**ఏమిటి, నీవు అల్లాహ్ నిర్ణయించిన శిక్షలలో ఒక శిక్ష గురించి సిఫారసు చేయదలిచావా?** అన్నారు. ఆ తరువాత ఆయన లేచి నిలబడి ప్రజల ముందు ఉపన్యసించారు. ఆ ఉపన్యాసం చివర్లో ఆయన ఇలా అన్నారు - "**ఐశ్వర్యంగలవాడు పేరు పలుకుబడులు గల వ్యక్తి దొంగతనం చేస్తే అతడ్ని శిక్షించేవారు కాదు. ఈ కారణంగానే మీకు పూర్వం గతించిన జాతులు నాశనమయ్యాయి. అల్లాహ్ సాక్షి! ముహమ్మద్ కూతురు ఫాతిమా(రజి) అయినా సరే, దొంగతనం చేస్తే నేనామె చేతిని నరికివేస్తాను.**"

తనలో ఓ భాగమని చెప్పిన తమ ప్రియపుత్రిక 'ఫాతిమా'(రజి) నేరం చేసినా సరే, శిక్ష అనుభవించవలసిందేనని ప్రకటించిన ముహమ్మద్(స)

వారిని అనుసరించే ముస్లిములకు

నేరస్తుడికి శిక్షపడితే, ఎందుకు అభ్యంతరం?

**ఎంతమాత్రం కాదు. పైగా హర్షిస్తారు.**

మానవత్వం ఉన్నవారు **'ఇస్లామిక్ తీవ్రవాదం'** అని పలుకరు.

'ఇస్లామిక్ తీవ్రవాదం' అని పలకడం మానవత్వాన్ని పరిహసించడమేనని భారతీయులంతా తెలుసుకున్నప్పుడు, మత సామరస్యంతో మనదేశం మరింత ధృడమై సూపర్‌పవర్ దిశగా పయనిస్తుందనేది మా ప్రగాఢ విశ్వాసం.

**మనదేశం సూపర్ పవర్ కాకుండా, అడ్డుకునే అగ్రదేశాలకి మత సామరస్యంతో వారికి షాక్ ఇద్దాం, ఇన్షా అల్లాహ్!**

---

## అమెరికా ఆడుతున్న దొంగాట


లాడెన్ చిక్కినా.. దాడి చేయని అమెరికా?

వాషింగ్టన్: 'అమెరికాలో 9/11 దాడుల అనంతరం ఆఫ్ఘ నిస్తాన్ పర్వత ప్రాంతాల్లో అల్ కాయిదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌ను అమెరికా బలగాలు చుట్టుముట్టాయి... అతడిని

సెనెట్ కమిటీ నివేదిక వెల్లడి

సజీవంగా బంధించేందుకు అవకాశాలున్నాయి. అయితే

నవంబర్ 30, 2009 (సాక్షి దినపత్రిక)

**"అమెరికాలో 9/11 దాడుల అనంతరం ఆఫ్ఘనిస్తాన్ తొరబోరా పర్వత ప్రాంతాల్లో అల్‌కాయిదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌ను అమెరికా బలగాలు చుట్టుముట్టాయి. అతడిని చంపేసే లేదా సజీవంగా బంధించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. అయితే అమెరికా బలగాలు ఉద్దేశ పూర్వకంగానే అతడిపై దాడికి వెనుకాడాయి".**

బిన్‌లాడెన్ కొరకు ఆఫ్ఘనిస్తాన్‌ను సర్వనాశనం చేసి, అతనిని ఎందుకు వదిలేసారు? సైన్యం అతనిని ఎందుకు బంధించలేదు?

నిజంగా బిన్ లాడెన్ బ్రతికి ఉంటే పట్టి అప్పగించేవారు కదా! ఎందుకు బంధించలేదో సైన్యం చెప్పకపోతే, ఆ సైన్యాధికారి చేత సత్యం పలికించే శక్తి అమెరికాకు లేదా?

బిన్ లాడెన్ అనారోగ్యంతో బాధపడుతున్నాడనే రిపోర్ట్స్ కూడా వచ్చాయి. కాబట్టి బిన్ లాడెన్ అప్పటికే చనిపోయి ఉంటాడేమో! 'బిన్ లాడెన్' మాట్లాడు తున్నట్లు చూపించే వీడియోలపై చాలామంది అనుమానం వ్యక్తం చేసారు. **దీనిని బట్టి బిన్ లాడెన్ చనిపోయి ఉండవచ్చు**. నిజం అల్లాహ్‌కే తెలుసు.

**"అమెరికా బలగాలు అతనిని బంధించకుండా వెనుతిరగడంతో అతడు సురక్షితంగా మందీ మార్బలంతో పాక్‌కు చేరుకున్నాడు. ఇప్పటికీ ప్రపంచానికి పెను ప్రమాదంగా పరిణమించాడు" అని కమిటీ అధ్యక్షుడు జాన్ కెర్రీ చెప్పారు.**

అంటే ప్రపంచానికి పెను ప్రమాదాన్ని ఏర్పరచడానికే అమెరికా అతనిని తప్పించిందా? లేక అమెరికా ఎక్కడ విధ్వంసం సృష్టించాలంటే, అక్కడ లాడెన్ ఉన్నాడన్న వంకతో మారణకాండ కొనసాగించడానికా?


అమెరికా ముట్టడి సమయంలో వీలునామా రాసిన లాడెన్

వాషింగ్టన్: అల్ కాయిదా అగ్రనేత ఒసామా బిన్ లాడెన్‌ను 2001 డిసెంబర్‌లో తమ సైనిక బలగాలు చుట్టిముట్టినప్పుడు అతడు తానిక చనిపోతానని భావించి వీలునామా రాసుకున్నాడని అమెరికా

డిశంబర్ 1, 2009 (సాక్షి దినపత్రిక)

**"ఒకవేళ లాడెన్‌ను ఆనాడే చంపేసినా, ఉగ్రవాద సమస్య సమసిపోయేది కాదని నివేదిక అభిప్రాయపడింది ............... అతడు తప్పించుకు పోవడం వల్ల పాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో మిలిటెంట్ల చొరబాట్లు దాడులు పెరిగాయని తెలిపింది".**

ప్రపంచంలోనే గొప్ప తీవ్రవాది 'జార్జ్ బుష్' అని ఆ దేశంవారే ఆయనకు బిరుదు ఇచ్చినప్పటికీ, ఆ బిరుదును ఆయన బిన్‌లాడెన్ పైనున్న అభిమానంతో, బిన్‌లాడెన్‌కు ఇచ్చేయడం జరిగింది.

బిన్ లాడెన్ ప్రపంచానికే ప్రమాదకరమని ప్రచారం చేసిన అమెరికా, బిన్ లాడెన్‌ను చంపేసినా సరే ఉగ్రవాద సమస్య సమసిపోయేది కాదని అమెరికన్ సెనేట్ నివేదిక చెబుతుంది.

**ఇది కూడా నిజమే కావచ్చు. తీవ్రవాద దాడులు చేయించేది అమెరికా దేశమే అయినప్పుడు, బిన్ లాడెన్ బ్రతికున్నా, లేకపోయినా సరే ఉగ్రవాదం సమస్య ఎలా సమసిపోతుంది? అని మనల్ని స్వయంగా మనమే ప్రశ్నించుకోవాలేమో!**

జాన్ కెర్రీగారు మరో ప్రశ్న కూడా వేశారు. అదేమిటంటే,

**"నాడు లాడెన్‌ను పట్టుకోవడంలో విఫలమైన అమెరికా నేడు ఆఫ్ఘాన్, పాక్‌లపై నిందారోపణలు చేయడం ఎంతవరకు సబబు?"** అని.

కాబట్టి ఆఫ్ఘనిస్తాన్ మరియు పాకిస్తాన్‌లపై అమెరికా చేసినవి **కేవలం ఆరోపణలేనా?** అని సందేహమొస్తుంది. ఈ మాటలను బట్టి ఆ దేశాల వెనుక ఉండి, **ఉగ్రవాద దాడులు అమెరికాయే చేయిస్తుందా?** అని అనుమానం కూడా వస్తుంది.

**బిన్ లాడెన్ తప్పించుకోవడం వల్లనే మిలిటెంట్ల చొరబాట్లు, దాడులు పెరిగాయట. అలా తప్పించుకునేలా చేసింది అమెరికా సైన్యమేనని**, దానికి 'నాటి అమెరికా అధ్యక్షుడు **జార్జి బుష్**, రక్షణమంత్రి **డొనాల్డ్ రమ్స్‌ఫెల్డ్**, మిలటరీ కమాండర్ **జనరల్ టామీ ఫ్రాంక్స్‌లే**' బాధ్యులని జాన్ కెర్రీ తేల్చి చెప్పారు.

ప్రపంచంలో ఉగ్రవాద దాడులను ప్రోత్సహించే అమెరికా, మత దురభిమానంతో తన నేరాన్ని ముస్లిములపై రుద్దు తుందనేది స్పష్టంగా తెలుస్తుంది. ఈ విషయం అమెరికన్లకు ముందే తెలిసినట్టుంది. అందుకే అక్కడి 80శాతం ప్రజలు అమెరికా ప్రభుత్వాన్ని నమ్మడం లేదు. సెనేట్ నివేదిక తెలుసుకోగోరేవారు క్రింది వెబ్‌సైట్‌లో చూడండి.

http://www.msnbc.msn.com/id/34189238/ns/world_news south_and_central_asia

- డా. నాగిరెడ్డి శ్రీనివాసరావు, M.Sc., Ph.D.

# ఖుర్'ఆన్‌ని అర్ధం చేసుకుంటూ చదువుదాం - 8

**లక్షణాలను తెలిపే కొన్ని పదాలు / గొప్పతనాన్ని తెలియజేసే నామవాచకాలు**

| اسم تفضِيل — Noun of Superiority | Urdu | | Arabic | Some Attributes | Urdu | | کچھ صفات |
|---|---|---|---|---|---|---|---|
| చాలా తీవ్రమైనది = <br> Most severe | بہت سخت | (అషద్ద) | أَشَدّ | శక్తిమంతుడు, తీవ్రంగా శిక్షించేవాడు = <br> Severe; Strong | سخت | (షదీద్) | شَدِيد |
| అందరికన్నా అధికుడు, మహోన్నతుడు = <br> Higher, Superior | بہت بلند | (అఅ'లా) | أَعْلَى | ఘనత గలవాడు, గొప్పవాడు = <br> High, Exalted | بلند | (అలియ్) | عَلِيّ |
| బాగా తెలుసుకోవడం = <br> Better-knowing, more informed | بہت جاننے والا | (ఆ'లమ్) | أَعْلَم | సర్వం తెలిసినవాడు = <br> Knower | خوب جاننے والا | (అలీమ్) | عَلِيم |
| సామీప్యం = <br> Nearer | بہت قریب | (అఖ్రబ్) | أَقْرَب | అతి సమీపంగా ఉండేవాడు = <br> Near | قریب | (ఖరీబ్) | قَرِيب |
| చాలా గొప్ప = <br> Bigger | بہت بڑا | (అక్బర్) | أَكْبَر | పెద్ద, గొప్పవాడు = <br> Big, Great | بڑا | (కబీర్) | كَبِير |
| చాలా ఎక్కువ = <br> More; most | أَكْثَر | (అక్సర్) | أَكْثَر | సమృద్ధి, కోరినంత = <br> Plenty, Much | زیادہ | (కసీర్) | كَثِير |
| ఉత్తమం = <br> Better | بہت اچھا | (అహ్సన్) | أَحْسَن | వేగం, శీఘ్రం = <br> Quick, swift, fast | جلد | (సరీహ్) | سَرِيع |
| ఎక్కువ విలువ = <br> More entitled; more worthy | بڑا حق دار | (అహఖ్) | أَحَقّ | అపార కరుణా ప్రదాత = <br> Merciful | نہایت رحم والا | (రహీమ్) | رَحِيم |
| సామీప్యం, దిగువ, తక్కువ = <br> Nearer, lower; less | زیادہ نزدیک، کمتر | (అద్న) | أَدْنَى | మహోన్నతుడు = <br> Supreme | بڑا، بزرگ | (అజీమ్) | عَظِيم |
| చాలా అన్యాయం = <br> More unjust | زیادہ ظالم | (అజ్లమ్) | أَظْلَم | సూక్ష్మం, కొంచెం = <br> Little | تھوڑا | (ఖలీల్) | قَلِيل |
| ఉత్తమ మార్గదర్శకత్వం పొందడం = <br> Better guided | زیادہ ہدایت یافتہ | (అహ్దా) | أَهْدَى | ఉదారుడు, అనుగ్రహించేవాడు, గౌరవనీయుడు = <br> Noble; Generous; Honourable | عزت والا | (కరీమ్) | كَرِيم |
| సామీప్యం = <br> Nearer, closer; woe | زیادہ قریب، زیادہ لائق | (అవ్లా) | أَوْلَى | సూక్ష్మగ్రాహి = <br> Subtle | باریک بیں، مہربان | (లతీఫ్) | لَطِيف |

**ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.** ***ఈ 8 నెలలలో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 45.4***

ఈ నెల నేర్చుకున్న పదాలు 1078 (అంటే ఈ 24 పదాలు ఖుర్'ఆన్‌లో 1078 చోట్ల చూడవచ్చు) ***source: www.emuslim.com***

ప్రతీ నెలా శాంతిబాటలో ఇస్తున్న 24 పదాలను 30 నెలలపాటు నేర్చుకుంటే ఖుర్'ఆన్‌లోని 64,282 పదాలను నేర్చుకోగలిగినట్లే

**కొంతమంది సోదరులు, తమకు అరబీ చదవడం రాదని, కాబట్టి అరబీ అక్షరాలను ప్రారంభం నుండి మొదలు పెడితే వారికి ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్నవారికి అరబీ చదవడం నేర్చుకోవడానికి 7 రోజులు చాలు. అరబీ మొదటి నుండి నేర్పడం ఈ శీర్షిక యొక్క ఉద్దేశ్యం కానప్పటికిని, సోదరుల కోరికను కొంతమేరైనా తీర్చాలనే సంకల్పంతో 2వ సంచికలో అరబీ అక్షరాలను, వాటి గుణింతాలను ఇచ్చాము.**

*A sincere request to our beloved sisters*

8

# మీరందరూ గౌరవించబడాలని ...

ఎవరైనా గౌరవాన్నే కోరుకుంటారు. తనను చులకనగా చూస్తుంటే, ఏ సోదరి మాత్రం బాధపడకుండా ఉంటుంది? సృష్టికర్త 'అల్లాహ్' ఖుర్ఆన్ గ్రంథం ద్వారా మనకు **'ఉత్తమమైనదే ఆదేశించారు'**. **'ఉత్తమమైనదే తినమన్నారు'**. **'ఉత్తమమైనదే చేయమన్నారు'**. అల్లాహ్ ఆదేశాల ప్రకారం జీవించే వ్యక్తి పొందే గౌరవం కంటే ఉత్తమమైన గౌరవం మరెవరూ పొందలేరు.

తన ప్రవర్తన ద్వారా లేదా తన నైపుణ్యం ద్వారా పొందే గౌరవమే శాశ్వతంగా ఉంటుంది.

క్రిందటి సంచికలో బురఖా (హిజాబ్), నిఖాబ్‌ల గురించి కొన్ని ముఖ్య విషయాలను అందించాము. అల్లాహ్ ఆదేశించినట్లు, శరీరాకృతి తెలియకుండా, వదులుగా ఉన్నవి మరియు పారదర్శకం కానటువంటి దళసరి దుస్తులను ధరించి దుప్పట్లను తమ తలపైనుండి, రొమ్మువరకూ కప్పుకుంటే, స్త్రీలకు ఇన్షాఅల్లాహ్ రెండు రకాల పుణ్యాలు లభిస్తాయి. మొదటిది అల్లాహ్ ఆదేశం ప్రకారం బట్టలు ధరించడం వలన వచ్చే పుణ్యం. రెండవది తన అందం ద్వారా, శారీరక ఆకృతి ద్వారా పరపురుషునిలో చెడు భావం కలగకుండా చేసినందుకు లభించే పుణ్యం.

టైట్ జీన్ ఫ్యాంట్లు, టీ షర్ట్‌లతో తమ అందాలను ప్రదర్శిస్తూ, పరపురుషుల ప్రశంసలు అందుకుంటున్నామని కొందరు అనుకుంటున్నారు. అలా అనుకోవడం కంటే పెద్ద పొరపాటు జీవితంలో మరొకటి ఉండదు. దాని వలన గౌరవం తక్కువ, నష్టమే ఎక్కువ. అలనాటి తెలుగు కథానాయిక 'వాణిశ్రీ', అప్పట్లో హైదరాబాద్ అంతా తిరిగి చూడాలనుకున్నారట. నిర్మాత మొదట్లో భయపడ్డారు. ఆ తరువాత ఆమె 'బురఖా' ధరించి సంతోషంగా హైదరాబాద్ తిరిగి చూడగలిగారట.

ఇటీవల కాలంలో బ్రిటన్‌లో **'వేక్ అప్ టు రేప్'** అనే సర్వే జరిగింది. సుమారు వెయ్యిమంది స్త్రీలు (18 నుండి 24 ఏళ్ళ వయస్సున్న వారే) ఈ సర్వేలో పాల్గొన్నారు. 'తమపై జరిగే అత్యాచార సంఘటనలకు రేపిస్టుల కంటే, స్త్రీలే ఎక్కువ బాధ్యత వహించాలని 54 శాతం మంది స్త్రీలు అభిప్రాయపడ్డారు. 24 శాతం మంది స్త్రీలు చెప్పిన అభిప్రాయాన్ని బట్టి, **'మహిళలపై జరిగే మానభంగాలకు చాలావరకు వారి వస్త్రధారణ కూడా ఒక కారణమే'**. పొట్టి స్కర్ట్‌లు వేసుకుని వారిని రెచ్చగొడుతూ మగవాళ్ళతో స్వేచ్ఛగా హద్దు లేకుండా తిరగడం వలన అక్కడ స్త్రీకి గౌరవం లేకుండా పోయింది. స్త్రీ అంటే అక్కడ ఓ విలాసవస్తువు. అంతే!

ఈ మధ్యనే ఓ దినపత్రికకు 'ఐశ్వర్యరాయ్' ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆమె మగవాళ్ళ ధాటికి తట్టుకోలేక, మరొక కాలేజ్‌కు మారవలసి వచ్చిందట. అక్కడ కూడా ఆమెకు అదే పరిస్థితి ఎదురైంది. ఆమె మాటలలో వారిపై ఎంత ఏహ్యభావం కలిగిందో తెలుస్తుంది. అలాగే ఓ షూటింగ్‌లో నీటిలో ఎక్కువ సేపు నిలబడవలసి ఉందట. అందులో జలగలున్నాయని తెలిసి యూనిట్‌లో ఒకరు కంగారుపడితే, ఈ జలగలకన్నా మగ జలగలే ప్రమాదం అని ఆమె చెప్పడాన్ని బట్టి, ఆమె అందం వలన ఆమెకు గుర్తింపు వచ్చినా, మగవాళ్ళ ద్వారా ఆమె ఎంత ఇన్ సెక్యూరిటీ ఫీలైందో తెలుస్తుంది. ఈమె గనుక హిజాబ్ ధరించి ఉంటే ఇటువంటి మానసిక వేదనకు అవకాశం ఉండేది కాదు కదా!

**"అయ్యో! ముస్లిమ్ స్త్రీని చూడండి, బురఖాలో పాపం ఎంత ఇబ్బంది పడుతుందో"** అని బాధపడిపోతూ ఎంతో సానుభూతి కురిపించే వారు, ఆ బురఖా ధరించిన స్త్రీతో ఒక్కమాట కూడా మాట్లాడకుండానే కామెంట్ చేస్తారు. వేసవి కాలంలో కూడా దళసరి దుప్పటిలా ఉండే టైట్ జీన్‌ఫ్యాంట్ వేసుకున్న 'స్త్రీ'ని చూచినప్పుడు మాత్రం వీరికి సానుభూతికి బదులు ఏ ఫీలింగ్ కలుగుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

వేసవికాలంలో టైట్ జీన్‌ఫ్యాంట్ ధరించిన సోదరికే ఇబ్బంది కలుగుతుంది గాని, వదులుగా ఉండే బట్టలతో హిజాబ్ ధరించిన సోదరికి సౌకర్యంగా ఉంటుంది. స్త్రీ శరీరానికీ, మానానికీ కూడా హిజాబ్ రక్షణగా నిలుస్తుంది.

పురుషుడిని 'స్త్రీ' ఆకర్షిస్తుంది. ఇది సృష్టిధర్మం. కేవలం తన భర్తను మాత్రమే ఆకర్షిస్తే ఆమె జీవితం బావుంటుంది. కొందరు పురుషులు అందంగా ఉన్న స్త్రీలని పెళ్ళి చేసుకుని, గొడవలు పడి వేరయిపోయిన ఉదంతాల నెన్నింటినో మనం సమాజంలో చూస్తూ ఉన్నాము. అందం ద్వారా కలిగిన ఆకర్షణ చాలా అశాశ్వతమైనది. బంధాలు నిలబడేవి కేవలం ఒకరిపై నొకరికి ఉన్న ప్రేమ మరియు గౌరవాల వలనే గాని, అందం ద్వారా కలిగిన ఆకర్షణ వలన కాదు.

**స్త్రీలు ఇతరుల చేత మాత్రమే కాకుండా, తన భర్తచే కూడా గౌరవం పొందగలగాలి.**

**ముహమ్మద్(స)వారికి తన భార్యలపై ప్రేమ మాత్రమే కాకుండా, వారి మీద ఎంతో గౌరవం ఉండేది.** ఏ స్త్రీకైనా భర్త నుండి ప్రేమను పొందడంతో పాటు, గౌరవాన్ని కూడా పొందితే అంతకంటే కావలసింది ఏముంటుంది?

ముహమ్మద్(స)వారు తన 25వ యేట, 40 సం॥ల వయస్సున్న విధవరాలైన హజ్రత్ ఖదీజా(రజి) వారిని వివాహమాడారు. ఆమె మరణించే సమయానికి ఆమెకు సుమారు 65 సం॥లు. ఆమె జీవించి ఉన్నంత కాలం, ప్రవక్త(స)వారు మరొక వివాహం చేసుకోలేదు. ఆ కాలంలో అరేబియాలో ఎన్ని పెళ్ళిళ్ళు అయినా చేసుకోవచ్చు. కాని ప్రవక్త(స)వారు ఆమె జీవించి ఉండగా మరో పెళ్ళి చేసుకోలేదు.

చాలా ఉల్లేఖనాలు 'ఆయిషా(రజి)వారు ప్రవక్త(స)వారి యొక్క ప్రియమైన భార్యగా' తెలియజేస్తున్నాయి. ఒకసారి ఆయిషా(రజి)వారి దగ్గర మరణించిన మొదటి భార్యయైన హజ్రత్ ఖదీజా(రజి)వారి ప్రస్తావన వచ్చింది.

అప్పుడు ముహమ్మద్(స)వారు ఖదీజా(రజి) గురించి ఏమి చెప్పారో చూడండి : **"లేదు. ప్రజలు నన్ను త్రోసి పుచ్చిన రోజుల్లో ఆమె నా పక్షాన నిలిచింది. ప్రజలు తిరస్కార వైఖరి నవలంభిస్తుండగా ఆమె ఇస్లాంను స్వీకరించింది. నాకు సహాయపడే వారెవరూ లేని సమయంలో ఆమె నన్ను ఆదుకున్నది".**

తనకెంతో ప్రియమైన భార్యతో, మరణించిన తన మొదటి భార్య గురించి అంత గొప్పగా, ప్రేమగా ముహమ్మద్(స) వారు చెప్పారంటే, ఆయన వ్యక్తిత్వం ఎంత గొప్పదో అర్థమౌతుంది కదా! అదే విధంగా, భర్త మనస్సులో అంతటి స్థానాన్ని పొందిన హజ్రత్ ఖదీజా(రజి)వారు ఎంత అదృష్టవంతులో! మీరంతా కూడా అటువంటి అదృష్టాన్ని పొందాలని శాంతిబాట టీమ్ కోరుకుంటుంది.

(ప్రవక్త(స) వారి దాంపత్య జీవితానికి సంబంధించి ఎన్నో విషయాలతో మరికొన్ని రోజులలో ఇన్షా అల్లాహ్ మీకు ఒక పుస్తకం ఉచితంగా అందించబడుతుంది)

**అందం ద్వారా ఆకర్షించాలనుకోవడం కంటే, మంచి ప్రవర్తన ద్వారా గౌరవించబడితేనే ఏ స్త్రీకైనా మానసిక ప్రశాంతత కలుగుతుంది.**

పూర్తి స్వేచ్ఛా సమాజమైన అమెరికా వంటి దేశాలలో ఎవరు ఏ బట్టలు వేసుకున్నా సరే ఎవరూ అడ్డు చెప్పరు. అటువంటి స్వేచ్ఛ వాతావరణంలో కూడా ఇస్లామ్ స్వీకరించిన తరువాత అక్కడి స్త్రీలు వెనువెంటనే ఎందుకు బురఖా ధరిస్తున్నారు? బురఖా ధరించమని వారిని ఎవరూ బలవంత పెట్టలేదే!

'ఇస్లామ్'లో స్త్రీకి ఉన్న విలువ, గౌరవం మరెక్కడా లేవని కనుగొన్నాక, వారంతా కనుగొని బురఖా ధరిస్తున్నారంటే, దానివలన వారికి గౌరవం కలుగుతుందనే కదా! రోజూ స్కర్ట్స్ వేసుకునేవారు, ఆ పొట్టిబట్టలు కాకుండా ఇస్లాం చూపిన గౌరవ వస్త్రధారణను స్వీకరిస్తున్నారు. మరి **ముస్లిమ్ కుటుంబంలో పుట్టిన వారెందుకు ఈ గౌరవ వస్త్రధారణ స్వీకరించ లేకపోతున్నారు?**

కొంతమంది పార్కులకు వెళతారు. పార్క్‌లోకి ప్రవేశించగానే పైన వేసుకున్న బురఖా (loose garment) అలాగే ఉంటుంది. కాని తలపై నుండి హిజాబ్‌ని తీసేస్తారు. బురఖా ధరించి ఆ విధంగా చేయడం, అల్లాహ్ యొక్క ఆదేశాన్ని అవహేళన చేయడం కాదా?

ఇస్లామ్ స్త్రీ గౌరవాన్ని పెంచింది. **'నా భర్త వద్దంటున్నాడు కాబట్టి బురఖా వేయడం లేదు'** అని చెప్పే సోదరీమణులున్నారు. ఒకవేళ ఆవిధంగా చెప్పే సోదరి భర్త **'హలాల్'** చెయ్యని మాంసం తీసుకొస్తే ఆ సోదరి ఆ కూర చేసి తినగలుగుతుందా? పందిమాంసం తెచ్చి వండమంటే ఆ సోదరి వండగలుగుతుందా?

వారెంత మాత్రం ఒప్పుకోరు. ఇవే కాదు భర్త చేయమని చెప్పిన ఎన్నింటినో తిరస్కరించే మహిళలు నేటి సమాజంలో చాలా ఎక్కువ మందే ఉన్నారు. భర్త ముఖం మీదే చెయ్యనని చెప్పేస్తారు. కాని బురఖా విషయంలో మాత్రం, భర్త వేసుకోవద్దని చెబితే, వెంటనే ఒప్పుకుంటారు. ఈ విషయంలో భర్త మాటకు విలువిస్తున్నారంటే, దాని అర్థం భర్తను గౌరవించడం కాదు, **అల్లాహ్‌ను తిరస్కరించడమేనని వారికి తెలియదా?**

అల్లాహ్ ఆదేశించిన ప్రతీ విషయం మీ మేలు కొరకే. ఇస్లామ్‌ను అధ్యయనం చేయండి. ముస్లిమ్‌ల చరిత్రను తెలుసుకోండి. రకరకాల డిజైన్లతో, వింత పోకడలతో వస్తున్న బురఖాలను కాకుండా, ఆకర్షణకు అవకాశం లేని 'బురఖా'ను, మీరు బయటికి వెళ్ళే సమయంలో ధరించడం ఈ రోజు నుండైనా మొదలు పెట్టండి.

**ఎక్కడ స్త్రీ గౌరవించబడుతుందో, ఆ సమాజం బావుంటుంది. అటువంటి ఉత్తమ సమాజం కొరకు, ఉత్తమ గౌరవాన్ని పొందడం కొరకు మీరు ఇస్లామీయ వస్త్ర ధారణతో తొలి అడుగు వేయాలని కోరుతున్నాము.**

ప్లీజ్. ఓ సారి ఆలోచించండి.

**- శాంతిబాట టీమ్**

ఎందరో సోదరులు 'హిజాబ్'పై లిరిక్స్ వ్రాశారు. సోదరుడు 'అహమద్ బుఖాతిర్' వ్రాసిన విషయాలు ఈ నెల అందిస్తున్నాము. 'హిజాబ్' గురించి అవహేళన చేసేవారికి ఈ విషయాలు చూపండి చాలు.

**<u>This is my hijab</u>**

This is my hijab, I will never remove
Hijaab is my pride, it makes my soul improve
It is Allah's law, how can I oppose
Hijab is my way, the way that Allah chose
Hijaab is my way, the way that Allah chose
People didnt approve for what I had to say
Covering my self will hide my charm away;
Confused was my mind in what I shouldn't do..
I have been so sad, my feeling never went through;
My heart got that peace, the peace that showed me light
**The light of my hijaab which made my spirit bright;**
**Without my hijaab, I feel insecure**
**Deep within my soul, I feel peace and pure**
This my hijaab, I will never remove
Hijaab is my pride, it makes my soul improve

It is Allah's law, how can I oppose
Hijaab is my way, the way that Allah chose
Hijaab is my way, the way that Allah chose
Oh my dearest sisters, hijaab is the cure
Wisdom lies beneath it, I know thats for sure
Gift yourself with guidance and never regret
Accepting it would be getting all respect;
All around is evil that wants to prevail
Sticking to Islam we won't let good fail;
Lets embrace hijaab and await our reward..
It is for Allah, the one and only Lord!
I will never remove!
This my hijaab, I will never remove
This my hijab, I will never remove.

# పాఠకుల అభిప్రాయాలు

### బురఖాపై ...

7వ సంచికలో ప్రచురించిన ఈ వ్యాసం చాలా బాగుందని సిస్టర్స్ దగ్గరి నుండే కాకుండా, సోదరులు దగ్గరనుండి కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ వ్యాసం తుది రూపాన్ని చేరుకోవడానికి 2 వారాలు పట్టింది. ఈ వ్యాసం కొరకు సేకరించిన సమాచారం చాలా ఉన్నప్పటికీ, స్థలాభావం వలన కొన్ని విషయాలు ఇంకనూ మిగిలిపోయాయి. ఇన్షాఅల్లాహ్, రాబోయే సంచికలలో వాటిని కూడా అందిస్తాము.

'నిఖాబ్' ధరించే విషయంలో ఓ సోదరి సహీహ్ హదీస్ వివరాలను అడిగారు. బురఖా(హిజాబ్) ధరించడం వరకేగాని, నిఖాబ్‌కు సంబంధించి ప్రస్తుతానికి మా దగ్గర స్పష్టమైన సమాచారం లేదు. ఈ విషయంలో విద్వాంసుల మధ్య అభిప్రాయబేధాలు ఉన్నప్పటికీ, సరియైన సమాచారాన్ని అందించడానికి ఇన్షాఅల్లాహ్ మా ప్రయత్నం చేస్తాము. ప్రామాణిక ఆధారాలు సేకరించే ప్రయత్నంలో ఉన్నాము.

ఈ నెలలో న్యూస్‌పేపర్లలోగాని, టి.వి. ఛానళ్ళలలోగాని, చాలా మంది యువతులు (టీనేజ్ గర్ల్స్) స్కూటర్లపై ఎండలో ప్రయాణించడాన్ని చూపెడుతున్నారు. వారి కళ్ళు తప్ప ముఖం అస్సలు తెలియకుండా 'చున్నీ'ను ముఖం చుట్టూ చాలా ఒత్తుగా చుట్టుకుంటున్నారు. చర్మ సౌందర్యం పాడవుతుందని కొందరు, రకరకాల సమస్యల నుండి కాపాడుకునేందుకు కొందరు ఇలా తమ ముఖాలను కప్పుకుంటున్నారు.

ఇవి చూసిన తర్వాత కూడా బురఖా ధరించిన ముస్లిమ్ స్త్రీని గాని, ముస్లిమ్ డ్రెస్ కోడ్‌నిగాని విమర్శ చేసేవారు ఓ సారి ఆత్మపరిశీలన చేసుకోవాలి.

### టెర్రరిజంపై ...

ఒక అబద్ధం చెప్పిన వాడు, ఆ అబద్ధాన్ని కప్పిపుచ్చుకోవడానికి లేదా దానిని నిజమని నమ్మించడం కోసం మరో అబద్ధం ఆడవలసి వస్తుంది. ఆ విధంగా వీరి నుండి ఒకదానికొకటి పొంతనలేని మాటలు వింటూ ఉంటాము. **'ముస్లిములు టెర్రరిస్టులు కారు'** అనే విషయం అమెరికన్లకు బాగా తెలుసు. ఆలోచించగలిగే వారందరికీ తెలుసు. ముస్లిములపై 'తీవ్రవాద' ముద్ర వేయడానికి అమెరికా నేడు ఎన్నో సర్కస్ ఫీట్స్ చేస్తుంది. అలా చేయడంలో వారు ఎన్నో అబద్ధాలు ఆడుతున్నారు.

వారు మాట్లాడిన మాటలనే విశ్లేషించి వారి తప్పును మీ ముందు ఉంచాము. ఈ వ్యాసం బాగుందని చాలా ఫోన్‌కాల్స్, మెస్సేజ్‌లు వచ్చాయి. 'టెర్రరిజం' విషయంలో ఏ ముస్లిమ్ సోదరుడుగాని, సోదరిగాని ఇతరుల ముందు సమాధానం చెప్పుకోలేక తలదించుకోవల్సిన పరిస్థితి రాకూడదని, ఈ శీర్షిక ద్వారా వాస్తవ విషయాలను అందిస్తున్నాము.

### దావత్ విషయంపై ...

మూడు గ్రంథాలతో దావత్ ఇవ్వడం, గ్రంథాల తులనాత్మక అధ్యయనాలు, వాదనలు (డిబేట్స్) ఇస్లామ్‌కి వ్యతిరేకమని చెబుతూ ఖుర్ఆన్ వాక్యాల ద్వారా, హదీస్‌ల ద్వారా వివరించాము. దీనిపై చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే కొందరికి ఇబ్బంది కలిగించింది. ఈ విషయంలో మమ్మల్ని అడిగే వారందరూ వేసిన ప్రశ్న ఒక్కటే. "ఫలానా ప్రముఖ దాయీ గారు కంపేరేటివ్ స్టడీ చేస్తున్నారు కదా! మరి ఈ విషయం వారికి తెలియదా?" మనం అనుసరించవలసింది అల్లాహ్ యొక్క చివరి సందేశహరులు ముహమ్మద్(స)వారి విధానాన్ని. ప్రవక్త(స) వారిని కాకుండా కొంతమంది వ్యక్తులను ఆదర్శంగా తీసుకుంటే వారి కర్మలు వృధాయేనని ఖుర్ఆన్‌పై కనీస అవగాహన ఉన్న ప్రతీ ముస్లిమ్‌కి తెలిసిన విషయమే!

ప్రవక్త(స) నిషేధించింది చేయకుండా, ఆయన(స) చేయమన్నదే చేద్దాం! ఆయన(స) ఆచరించి చూపిన విధానాన్ని అనుసరిస్తే, ఎటువంటి ఘర్షణలకు అవకాశమే ఉండదు. అత్యున్నత దావా విధానం ముహమ్మద్(స) వారిది. **'మీరు చెప్పేది నిజమే అయినప్పటికిని, సూటిగా చెబితే, కొన్ని సంస్థలు మీకు వ్యతిరేకం అవుతాయి కదా'** అని మా శ్రేయోభిలాషులు చెప్పారు. చేసేది అల్లాహ్ కొరకు. **సహాయం చేసేది ఆయనే!** ఎవరో వ్యతిరేకమవుతారని, సత్యాన్ని దాచలేము. మంచిని బోధించడం, చెడును నిరోధించడం ప్రతీ ముస్లిమ్‌పై నున్న కనీస బాధ్యత.

**న్యూస్ పేపర్ క్లిప్పింగ్స్** (క్రింది ఫొటోలలో స్కూటర్లపై ఉన్నవారు ముస్లిమ్ స్త్రీలు కాదు)




మీ అభిప్రాయాలను, విమర్శలను 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా velugubaata@gmail.com కు పంపండి.

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** '*Akash Industries*', G-14, Industrial Estate, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650

حَدَّثَنَا أَبُو بَكْرِ ابْنُ أَبِي شَيْبَةَ وَأَبُو عَامِرٍ الْأَشْعَرِيُّ وَمُحَمَّدُ ابْنُ الْعَلَاءِ ـ وَاللَّفْظُ لِأَبِي عَامِرٍ ـ قَالُوا: حَدَّثَنَا أَبُو أُسَامَةَ عَنْ بُرَيْدٍ، عَنْ أَبِي بُرْدَةَ، عَنْ أَبِي مُوسَىٰ عَنِ النَّبِيِّ ﷺ قَالَ: ((إِنَّ مَثَلَ مَا بَعَثَنِي اللهُ عَزَّ وَجَلَّ بِهِ مِنَ الْهُدَىٰ وَالْعِلْمِ كَمَثَلِ غَيْثٍ أَصَابَ أَرْضًا، فَكَانَتْ مِنْهَا طَائِفَةٌ، طَيِّبَةٌ قَبِلَتِ الْمَاءَ فَأَنْبَتَتِ الْكَلَأَ وَالْعُشْبَ الْكَثِيرَ، وَكَانَ مِنْهَا أَجَادِبُ أَمْسَكَتِ الْمَاءَ، فَنَفَعَ اللهُ بِهَا النَّاسَ، فَشَرِبُوا مِنْهَا وَسَقَوْا وَرَعَوْا، وَأَصَابَ طَائِفَةً مِنْهَا أُخْرَىٰ، إِنَّمَا هِيَ قِيعَانٌ لَا تُمْسِكُ مَاءً وَلَا تُنْبِتُ كَلَأً، فَذَٰلِكَ مَثَلُ مَنْ فَقُهَ فِي دِينِ اللهِ، وَنَفَعَهُ اللهُ بِمَا بَعَثَنِي اللهُ بِهِ، فَعَلِمَ وَعَلَّمَ، وَمَثَلُ مَنْ لَمْ يَرْفَعْ بِذَٰلِكَ رَأْسًا، وَلَمْ يَقْبَلْ هُدَى اللهِ الَّذِي أُرْسِلْتُ بِهِ)).

అబూ మూసా(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు : "ఏ మార్గదర్శకత్వం మరియు జ్ఞానంతో అల్లాహ్ నన్ను పంపారో అది భూమిపై కురిసే వర్షాన్ని పోలి ఉంటుంది. (1) దానిలో కొంత మంచినేల, అది నీటిని స్వీకరించి ఎక్కువ భాగం పచ్చిక మరియు గడ్డిని మొలకెత్తిస్తుంది. (2)దానిలో కొంత (నేల) గట్టిదే గాని నీటిని నిలిపి ఉంచుతుంది మరియు దానివలన అల్లాహ్ ప్రజలకు ప్రయోజనం చేకూరుస్తారు మరియు వారు దానిని త్రాగుతారు మరియు దానిని వారి పశువులకు త్రాగడానికి ఇస్తారు. మరియు వారు దానిని పొలాలకు నీరు పెట్టడానికి మరియు మేసే పశువులకు ఉపయోగిస్తారు.

మరియు (3) దానిలోని మరొక భాగం (బంజరు భూమి) ఇది నీటిని నిలిపి ఉంచదు, ఇంకను పచ్చికను ఉత్పత్తి చేయదు. అంటే,

(మొదటిది) ఎవరైతే అల్లాహ్ ధర్మం యొక్క అర్థాన్ని పొందగలిగారో మరియు అల్లాహ్ అతనికి ప్రయోజనం చేకూరుస్తారు, దేనితో అయితే అల్లాహ్ నన్ను పంపించారో (దానితో), మరియు అతను నేర్చుకుంటాడు, మరియు ఇతరులకు నేర్పుతాడు అతనిని పోలి ఉంటుంది.

(రెండవది) ఏ మనిషైతే దానికి శ్రద్ధ చూపదో అతని పోలిక.

(మూడవది)ఏ మార్గదర్శకత్వంతో అయితే అల్లాహ్ నన్ను పంపారో, దానిని (అతడు) స్వీకరించడు. (సహీహ్ ముస్లిమ్, హదీస్ నెం. 5953)

(పై హదీస్‌లో మూడు రకాల వ్యక్తుల గురించి చెప్పడం జరిగింది. ముహమ్మద్(స) వారిని అల్లాహుతాలా మార్గదర్శకత్వంతోనూ మరియు జ్ఞానంతోనూ మానవుల కొరకు పంపించారు. నీరు లేకపోతే సారవంతమైన నేలయినా సరే దాని వలన ప్రయోజనం లేదు. అందులో పంట పండదు. భూమి నీటిని ఆపి ఉంచకపోతే, మనుష్యులకు మరియు ఇతర జీవులకు త్రాగడానికి నీరు ఉండదు. అల్లాహ్ యొక్క మార్గదర్శకత్వం, ఆయన ఇచ్చిన జ్ఞానం పొందలేకపోతే మానవ జీవితం కూడా నీరులేని భూమిలా వృథాయే!)

**"మరియు మేము నిన్ను (ఓ ప్రవక్తా!) సర్వలోకాల వారి కొరకు కారుణ్యంగా మాత్రమే పంపాము" (21:107)**

**"వాస్తవానికి, అల్లాహ్ యొక్క సందేశహరునిలో మీకు ఒక ఉత్తమమైన ఆదర్శం ఉంది ..." (33:21)**

SAANTHIBAATA MONTHLY March 2010
Registered with Registrar of News Papers for India

Samalkot-533440 (East Godavari Dist.)
RNI Reg. No. APTEL/2009/29650

فَاِنَّ مَعَ الْعُسْرِ يُسْرًا اِنَّ مَعَ الْعُسْرِ يُسْرًا

నిశ్చయంగా కష్టంతోపాటు సుఖం (ఉంటుంది)
నిశ్చయంగా కష్టంతోపాటు సుఖం (ఉంటుంది)

(ఖుర్'ఆన్ 94: 5,6)

